17 . 01. 2026
VELTHURU TELUGU DAILY


# వెలుతురు

శనివారం | రంగారెడ్డి , నల్లగొండ
సంపుటి :07 సంచిక : 223 , పేజీలు : 12 వెల:రూ.5/-
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH
తెలుగు దిన పత్రిక
www.velthuru.com
velthuru Newspaper

## ఎన్నికలు ఏవైనా బీజేపీని ఆశీర్వదిస్తున్న ప్రజలు

- ఎమ్మెల్యే పాయల్ శంకర్






# లక్ష్యం మేరకు ఉద్యోగాల కల్పన



- ఇప్పటికే 70వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ
- గ్రూప్- 3కి ఎంపికైన 1,370 మందికి నియామక పత్రాలు
- నిరుద్యోగులతో ఆడుకున్న గత బీఆర్ఎస్ ప్రభుత్వం
- కోర్టు కేసులతో నియామకాలను అడ్డుకునే యత్నాలు
- వారి ఉద్యోగాలు పోవడంతోనే మీకు ఉద్యోగాలు
- నియామక పత్రాలు అందించిన సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,జనవరి16 :**
తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రాణ త్యాగాలతో సాధించుకున్నామని.. కానీ బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగుల ఆశలు నెరవేరలేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నిరుద్యోగుల జీవితాలతో




# జైపాల్ రెడ్డికి సిఎం రేవంత్ నివాళి



**హైదరాబాద్,జనవరి16 వెలుతురు:**
దివంగత మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి 84వ జయంతి సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి తదితరులు ఘనంగా నివాళి అర్పించారు. నెక్లెస్ రోడ్ లోని జైపాల్ సమాధి స్ఫూర్తి స్థల్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. రాష్ట్రానికి, దేశానికి జైపాల్ రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, మాజీమంత్రి చిన్నారెడ్డి, పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



# అభివృద్ధి కోసమే నా ఆరాటం

### అభివృద్ధి కోసం ఆశీర్వదించండి..మున్సిపల్ ఎన్నికల్లోనూ ఆదరించండి

- ఉమ్మడి జిల్లాకు యూనివర్సిటీ మంజూరు
- బాసర ఐఐటిలో క్యాంపస్ ఏర్పాటు చేస్తాం
- నిర్మల్ జిల్లాకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు
- ఆదిలాబాద్ విమానాశ్రయానికి ప్రధానితో శంకుస్థాపన
- పనుల కోసమే ప్రధాని మోదీతో భేటీ అవుతూనే ఉంటా
- తుమ్మడిహట్టి వద్ద ప్రాజెక్ట్ కట్టి తీరుతాం
- కెసిఆర్ అప్పులతో తెలంగాణ కుప్పయ్యింది
- నిర్మల్ బహిరంగ సభలో సిఎం రేవంత్ పిలుపు





**నిర్మల్,జనవరి16 వెలుతురు :**
పాలమూరు జిల్లాతో సమానాంగా ఆదిలాబాద్ జిల్లాకు నిధులు మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల అనంతరం నిర్మల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. నిర్మల్ ప్రజలు ఇచ్చిన భరోసా, మద్దతు వల్లే సీఎం అయ్యాను. ఆదిలాబాద్ జిల్లా పోరాటానికి, పౌరుషానికి గడ్డ అంటూ.. జల్, జంగల్, జీమీన్ అంటూ కుమురం భీం కొట్లాడారని అన్నారు. ఈ జిల్లాలో జరగాల్సినంత అభివృద్ధి జరగలేదు. బాసర ట్రిపుల్ ఐటీలోనే యూనివర్సిటీ



## పదేళ్ల పాలనలో అప్పులు తప్ప అభివృద్ధి లేదు

### ఫామ్‌హౌజ్‌లో ఉంటూ రాజకీయాలతో తెలంగాణకు నష్టం

### రాక్షసుల్లా అభివృద్ధికి అడ్డుపడుతున్నారు

### మండిపడ్డ సిఎం రేవంత్

ఏర్పాటు చేస్తాం. జిల్లాలోని ప్రజాప్రతినిధులంతా ఇందుకు సహకరించాలి. పారిశ్రామికంగానూ ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేస్తాం. జిల్లాకు ఎయిర్ బస్ తీసుకొస్తాం. ఎయిర్‌పోర్టు



## మెట్రో రెండోదశకు కేంద్ర సుముఖం

- ఎల్ అండ్ టీ నుంచి టేకోవర్ లావాదేవీలు పూర్తి చేయండి
- రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి ఇద్దరేసి సభ్యులతో కమిటీ
- సిఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ



# సుప్రీం ఆదేశాలను ధిక్కరించిన స్పీకర్

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ధిక్కరణ కేసు
- అనర్హత ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవడంలో కాలయాపన
- కేసు దాఖలు చేసిన తెలంగాణ బిజెపి నేత

**హైదరాబాద్,జనవరి16 వెలుతురు:**
తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారిన ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసు మరో కీలక దశకు చేరుకుంది. పార్టీ మారిన ఎమ్మెల్యేల వ్యవహారంపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని ఆరోపిస్తూ తెలంగాణ బీజేపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీం న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయలేదని పేర్కొంటూ.. తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను తెలంగాణ బీజేపీ శాసనసభ పక్ష




నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేశారు. ఈ విషయం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ క్రమంలో ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో తెలంగాణ భాజపా నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంలో పలువురు

## వేములవాడ అభివృద్ధికి శ్రీకారం

- నిధులు కేటాయించి పనులు ప్రారంభం
- విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి రాజన్న ఆలయం సందర్శన
- గత కెసిఆర్ ప్రభుత్వం వేములవాడను విస్మరించింది
- రాజన్న ఆలయ సందర్శనలో మంత్రి సీతక్క



## రైతుల పంటలకు గిట్టుబాటు ధరల కల్పన

- వానాకాలం సీజన్‌లో కందుల కొనుగోళ్లు,
- లాభదాయక ధర కల్పించడమే తమ లక్ష్యం,
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ఖమ్మం,జనవరి16 వెలుతురు:**
రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడం కోసం తమ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




## ధరణి,భూభారతి కుంభకోణంలో 15మంది అరెస్ట్

### నిందితుల నుంచి రూ.63.19లక్షల నగదు స్వాధీనం

### మరో 9 మంది పరారీలో ఉన్నట్టు పోలీసుల వెల్లడి

**వరంగల్,జనవరి16 వెలుతురు:**
తెలంగాణలో సంచలనం సృష్టించిన ధరణి, భూ భారతి కుంభకోణంలో 15 మందిని అరెస్టు చేసినట్టు వరంగల్

# తిరుపతి కేంద్రంగా అతిపెద్ద రీసెర్చ్ సెంటర్

### రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ పేరుతో అభివృద్ధి

### క్యాంపు కార్యాలయంలో అధికారులతో సిఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి,జనవరి16 వెలుతురు:**
తిరుపతి కేంద్రంగా అతిపెద్ద రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. ఏపీ ఫ్యూచరిస్టిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ పేరుతో ఈ కేంద్రం ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఏరో స్పేస్-డిఫెన్స్,



ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ భేటీలో డ్రోన్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. యువతరం భవిష్యత్తును తీర్చిదిద్దేలా, వారికి అన్ని విధాలా సహకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ మేరకు భవిష్యత్తులో ఏయే రంగాల్లో

## కాకినాడలో పది బిలియన్ డాలర్ల పెట్టుబడి

### ఎక్స్ వేదికగా వివరాలు వెల్లడించిన మంత్రి లోకేశ్



**అమరావతి,జనవరి16 వెలుతురు:**
ఏపీలో భారీ పెట్టుబడి పెట్టేందుకు ఏఎం గ్రీన్ సంస్థ ముందుకొచ్చిందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పెట్టుబడుల వివరాలు వెల్లడిస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. కాకినాడలో ఏఎం గ్రీన్ కంపెనీ.. 10 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏడాదికి 1.5 మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేయడంతోపాటు జర్మనీ, సింగపూర్, జపాన్‌కు ఎగుమతి చేయనున్నట్లు చెప్పారు. ఈ ప్లాంట్ ఏర్పాటుతో 8వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. దేశం నుంచి తొలిసారి గ్రీన్ అమ్మోనియా ఎగుమతికి సన్నాహాలు జరుగుతున్నాయని.. 2030 నాటికి ఏఎం గ్రీన్ కంపెనీ ఉత్పత్తి ప్రారంభిస్తుందని తెలిపారు.

వెలుతురు

## తిరుపతి కేంద్రంగా అతిపెద్ద రీసెర్చ్ సెంటర్

అవకాశాలు ఉంటాయో గుర్తించడంతో పాటు.. ఆయా రంగాల్లో వారిలో నైపుణ్యాన్ని పెంచడంపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని సీఎం తెలిపారు. వివిధ రంగాల్లో కంపెనీలు కూడా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయన్నారు. ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ, ఏఐ-సైబర్ సెక్యూరిటీ, సెమీ కండక్టర్ల డివైజెస్-సెన్సర్లు, క్వాంటమ్ టెక్నాలజీ, హెల్త్ కేర్, బయో టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, రూరల్ ఏరియా టెక్నాలజీ వంటి రంగాలు భవిష్యత్తులో కీలకం కానున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అందుకు అనుగుణంగా పాలసీలు రూపొందిస్తోందని వివరించారు. ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టే కంపెనీలను ప్రొత్సహిస్తోందని సీఎం తెలిపారు. దేశంలో తొలిసారిగా గ్రీన్ ఎనర్జీ రంగంలో.. గ్రీన్ అమోనియా ప్లాంట్ కాకినాడలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ తరహాలో కొత్త ఆవిష్కరణలకు.. వివిధ స్టార్టప్ కంపెనీలకు రాష్ట్రం వేదికగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు భవిష్యత్తులో డిమాండ్ ఉన్న రంగాలకు పెద్దపీట వేయడమే కాకుండా.. స్టార్టప్ కంపెనీలను ప్రొత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. వీటికి రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి అతి పెద్ద రీసెర్చ్ కేంద్రం అవసరమన్న సీఎం.. తిరుపతిలో ఏర్పాటు చేసే ఏపీ-ఫస్ట్ వ్యవస్థ ఆ అవసరాలను తీర్చేలా ఉండాలన్నారు. రాష్ట్రంలోని యువతకు సహకరించేలా పూర్తి స్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. తిరుపతిలోని ఐఐటీ-ఐఐఎస్ఈఆర్ రెండు ప్రముఖ జాతీయ విద్యా సంస్థల కాంబినేషన్లో ఏపీ ఫస్ట్ ఏర్పాటు కానుందన్న చంద్రబాబు.. దీన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దాలని స్పష్టంచేశారు. ఏపీ ఫస్ట్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వంతోనూ సంప్రదింపులు జరపాలని సూచించారు.

## మెట్రో రెండోదశకు కేంద్ర సుముఖం

హైదరాబాద్,జనవరి16 **వెలుతురు**:

హైదరాబాద్ మెట్రో రెండో దశ కోసం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ని కలిసి చర్చించానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు.ముందుగా మెట్రో మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసుకోవాలని, అందుకు అన్ని ఒప్పందాలు, నిర్ణయాలు, లావాదేవీలు పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతి గురించి ప్రస్తావించారు. అలాగే హైదరాబాద్ నగరంలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంలో భాగంగా నగరంలో మెట్రో రెండో దశ పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరిందని గుర్తుచేశారు. ఇప్పటికే అమలు జరుగుతున్న మొదటి దశ మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, తామే నిర్వహిస్తామని ప్రకటించిందని ప్రస్తావించారు. లావాదేవీలు పూర్తయిన తర్వాత రెండో దశ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి అంగీకరించిందని కూడా కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ గుర్తు చేశారని అన్నారు. మెట్రో మొదటి దశను రాష్ట్ర ప్రభుత్వం ఎల్ అండ్ టీ నుంచి తీసుకోవడం, రెండో దశకు సన్నాహాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సంయుక్తంగా కమిటీ ఏర్పాటు చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నిర్ణయించారని కూడా కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తనకు తెలిపారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇద్దరు, కేంద్ర ప్రభుత్వం తరపున మరో ఇద్దరు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకోసం రాష్ట ప్రభుత్వం తరపున ఇద్దరు అధికారుల పేర్లను పంపాలని కోరినట్లు కూడా వివరించారు. కానీ, ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను ఎందుకు ప్రతిపాదించలేదని ప్రశ్నించారు. కావున సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఇద్దరు అధికారుల పేర్లను పంపి సమావేశ నిర్వహణకు ప్రయత్నం చేయాలని సూచించారు. అదేవిధంగా, వేగవంతంగా ఎల్ అండ్ టీ నుంచి మెట్రో నెట్‌వర్క్‌ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ఆ తర్వాత మెట్రో రెండో దశ నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కిషన్‌రెడ్డి కోరారు.

## రైతుల పంటలకు గిట్టుబాటు ధరల కల్పన

వ్యాఖ్యానించారు. వానాకాలం 2025-2026 సీజన్‌లో కందుల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. శుక్రవారం.. ఖమ్మం జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటించిన ఆయన.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రైతులకు లాభదాయక ధర కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం, టీజీ మార్క్‌ఫెడ్ సమన్వయంతో ఓ÷ూఖ కొనుగోళ్లు ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,99,393 ఎకరాల్లో కందులు సాగవుతున్నాయని పేర్కొన్నారు మంత్రి తుమ్మల. వాస్తవానికి సుమారు 2,99,635 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేశామని తుమ్మల తెలిపారు. ఈ లెక్కన క్వింటాల్‌కు రూ. 8,000 ఓ÷ూఖ నిర్ణయించామన్నారు. అయితే.. ప్రస్తుతం మార్కెట్ ధర రూ. 7,200 వరకు మాత్రమే ఉందని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 1,71,310 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతి ఇచ్చిందని వివరించారు. 2025 డిసెంబర్ 27 నుంచి 2026 మార్చి 26 వరకు కొనుగోళ్లు జరుగుతాయని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 82 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించామని తెలిపారు. ఇప్పటికే 13 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు వివరించారు. జనవరి 16 నాటికి 32 మంది రైతుల నుంచి 30.25 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరుగుతాయనే అంచనా వేశామని వెల్లడించారాయన.వీటి మొత్తం విలువ రూ. 0.24 కోట్లు ఉంటుందని అంచనా వేశామని పేర్కొన్నారు మంత్రి. నారాయణపేట జిల్లాలో కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఆయా పంటల రాకల ఆధారంగా ఇతర జిల్లాల్లోనూ దశలవారీగా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అన్నదాతలు మధ్యవర్తులకు పంటను అమ్మొద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. టీజీ మార్క్‌ఫెడ్ కేంద్రాలకు మాత్రమే పంటను తీసుకు రావాలని సూచించారు. కొనుగోలు మొత్తాన్ని డీబీటీ ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో జమచేయాలని అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని తుమ్మల నాగేశ్వరరావు భరోసానిచ్చారు.

## వేములవాడ అభివృద్ధికి శ్రీకారం

**వేములవాడ,జనవరి16 వెలుతురు:**

వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. రాజన్న అనుబంధ భీమేశ్వర ఆలయంలో స్వామి వారిని మంత్రి శుక్రవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి మీడియాతో మంత్రి మాట్లాడారు. వేములవాడలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఆలయాల అభివృద్ధి.. భావోద్వేగాలు, ఆచారాలతో ముడిపడి ఉంది. ఈనెల 18న మేడారంలో క్యాబినెట్ భేటీ జరుగుతుంది. 19న మేడారం ఆలయాన్ని సీఎం పునఃప్రారంభిస్తారు. పుష్కరాల దృష్ట్యా గోదావరి పరివాహక ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సీతక్క తెలిపారు. కేసీఆర్ హయాంలో వేములవాడ రాజన్న ఆలయాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఆలయాన్ని ఎంతగానో అభివృద్ధి చేస్తోందని వ్యాఖ్యానించారామె. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ జంక్షన్ అభివృద్ధికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆమె.. బీఆర్ఎస్ హయాంలో వేములవాడ రాజన్న ఆలయాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. మేడారం సమ్మక్క - సారక్క, వేములవాడ ఆలయాల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ఏకకాలంలోనే నిధులు కేటాయించారని ప్రస్తావించారు మంత్రి. సమ్మక్క - సారలమ్మ చరిత్ర, ప్రత్యేకతను శిలలపై రాయిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో రాజన్నను దర్శించుకుంటే నష్టం అంటూ దుష్ప్రచారాలు చేశారని అన్నారు. వేములవాడ రాజన్నను ఎంతోమంది భక్తులు తమ ఇంటి ఇలవేల్పుగా కొలుస్తారని తెలిపారు సీతక్క. ప్రస్తుతం.. వేములవాడకు భారీగా భక్తులు తరలివచ్చి రాజన్నకు మొక్కులు సమర్పిస్తుంటారని పేర్కొన్నారు. రాజన్నపై నమ్మకంతోనే ఇంతమంది భక్తులు ఆలయానికి వస్తున్నారని వెల్లడించారు. కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా స్వామివారిని భక్తులు కొలుస్తుంటారని తెలిపారు. తెలంగాణ సార్వత్రిక ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తాను వేములవాడ రాజన్నను దర్శించుకున్నామని గుర్తుచేశారు. అలాగే, మేడారం సమ్మక్క - సారక్క అమ్మవార్ల నుంచి పాదయాత్ర ప్రారంభించామని తెలిపారు. ఏ దేవాలయాల ప్రత్యేకత వాటికి ఉంటుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# అభివృద్ధి కోసమే నా ఆరాటం








కోసం 10వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందన్నారు. విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానిద్దాం. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టాల్సిందే.. ఆదిలాబాద్ జిల్లాకు నీరు ఇవ్వాల్సిందే. ప్రతి 3 నెలలకు ఒకసారి ప్రధాని వద్దకు వెళ్తున్నాం. ఆయనకు ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చి.. అడగాల్సిన ప్రాజెక్టులు అడుగుతున్నాం. మోదీని పదే పదే కలుస్తున్నానని కొంత మంది విమర్శిస్తున్నారు. రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు ఎవరు ఇస్తారు.. ప్రధాని కాదా? ప్రధానిని కలవకపోతే నిధులు, ప్రాజెక్టులు ఎలా వస్తాయి. పదేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వాన్ని గత ప్రభుత్వం అడగలేదు. అడగకపోతే రాష్ట్రానికి ఏం కావాలో కేంద్రానికి ఎలా తెలుస్తుంది. పైరవీలు చేయను.. పర్సనల్ ఎంజెడా లేదు.. రాష్ట్ర అభివృద్ధి కోసం, నిధుల కోసం.. ప్రధాని మోదీ, అమిత్ షా సహా ఎవరినైనా కలుస్తానని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు.. ఆ తర్వాత అభివృద్ధే అందరి లక్ష్యం. పదేళ్లు అధికారంలో ఉన్న వారు ఈ ఆలోచన చేయకపోవడం వల్లే.. తెలంగాణకు తీరని నష్టం జరిగిందని పరోక్షంగా కెసిఆర్ తీరుపై మండిపడ్డారు.. రాష్ట్ర భాజపా నేతలు కూడా ప్రధాని మోదీని కలిసి రాష్ట్రానికి ప్రాజెక్టులు, నిధులు తేవాలి. నిర్మల్ జిల్లాకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు చేస్తున్నాం. నాగోబా జాతరకు రూ.22కోట్లు మంజూరు చేసి అభివృద్ధి చేస్తాం. సమ్మక్క-సారలమ్మ జాతరకు రూ.300 కోట్లు కేటాయించి పునర్నిర్మాణం చేశాం. ప్రపంచ పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామంగా మారిందన్నారు. పెట్టుబడుల కోసం మేం ప్రయత్నిస్తుంటే.. స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పదేళ్లు అధికారాన్ని అనుభవించి రూ.8లక్షల కోట్లు అప్పు చేశారు.. రూ. వేల కోట్లు దోపిడీ చేశారని కెసిఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. భూసేకరణ కు నిధులు మంజూరు చేసి ప్రాజెక్టులు పూర్తి చేసుకున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు వర్సిటీ లేదని.. ఈ ప్రాంతానికి వర్సిటీ మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. త్వరలో వర్సిటీ మంజూరు అవుతుందన్నారు. బాసర వర్సిటీ ఏర్పాటు చేసుకుంటున్నామని.. దానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఆదిలాబాద్ వర్సిటీ బాసరలో ఏర్పాటు చేస్తున్నామని.. ఉమ్మడి జిల్లా కు కావాల్సిన నిధులను బ్జడెట్ లో ప్రవేశ పెట్టుతామన్నారు.. తుమ్మడి హెట్టీ వద్ద ప్రాణహిత చేవెళ్ల పై నివేదిక తయారు చేస్తున్నామని.. తుమ్మడి హెట్టీ వద్ద ప్రాజెక్టు కట్టి తీరుతామని స్పష్టం చేశారు. ప్రతి నీటి చుక్కని ఒడి పట్టుతామన్నారు.. ఆదిలాబాద్‌కు ఎయిర్ పోర్ట్ తీసుకొచ్చే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. మోడీ చేతుల మీదుగా ఆదిలాబాద్ ఎయిర్ పోర్టు శిలాఫలకం వేయిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికలు వచ్చాక రాజకీయం.. ఎన్నికల తర్వాత అభివృద్ధికి కలిసి నడుద్దామన్నారు. ప్రతి మూడు నెలలకు సారి కేంద్రాన్ని కలుస్తాం.. మీరు సైతం నా దగ్గరకు రండి.. సాధ్యం అయినంత పనులు చేస్తామని ప్రతిపక్ష నేతలకు సీఎం తెలిపారు. మోడీ నాకు చుట్టం కాదు దేశానికి ప్రధాని కాబట్టి మన ప్రాంతం అభివృద్ధి కావాలి కాబట్టి మోడీని కలుస్తున్నానని చెప్పారు. ప్రాంత అభివృద్ధి కోసం ఎవ్వెర్నినా కలుస్తా. పైరవీలు లేవు, పర్సనల్ పనులు నాకు లేవని సీఎం స్పష్టం చేశారు.కేంద్రం వరంగల్ ఎయిర్ పోర్టు వచ్చింది. ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ ఇస్తాం అని చెప్పినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 'ఇవ్వన్నీ అడిగనిదే ఇవ్వరు. గత పాలకులు అడగకపోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. వాళ్ల తప్పులకు ఇప్పుడు అప్పులు మిగిలాయి. ఆ ప్రభుత్వంలో ఇచ్చిన బియ్యం ఎవ్వరైనా తిన్నారా..? కాని మేము ఇచ్చే సన్న బియ్యం తింటున్నారు. నాడు పావలా వడ్డీ లేదు సున్నా వడ్డీ లేదు.. గుండు సున్నా మిగిల్చారు. వెయ్యికోట్ల భూమి మహిళలకు కేటాయించాం..రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితి వల్ల క్రమక్రమంగా అభివృద్ధి చేసుకుందాం.. రాష్ట్ర ప్రజలు అండగా నిలవండి, దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతా.. త్వరలో మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయి? ప్రజా ప్రభుత్వంతో కలిసి పని చేసే వారిని గెలిపించండి.. కేవలం ఎన్నికల అప్పుడే రాజకీయాలు, అభివృద్ధికి అందరం ఒకటే..' అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

### పదేళ్ల పాలనలో అప్పులు తప్ప అభివృద్ధి లేదు

ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు ప్రత్యేకమైన అభిమానం ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అత్యంత వెనుకబడిన ఈ జిల్లాకు ఆశించిన న్యాయం జరగలేదని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శక్రవారం పర్యటించిన సిఎం రూ.386.46 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హాతిఘాట్‌లో చనాకా - కొరాట బ్యారేజ్ పంప్‌హౌస్ ప్రారంభించారు. సదర్మట్ బ్యారేజ్‌ను జాతికి అంకితం చేశారు. యాసంగి పంటకు నీరు విడుదల చేశారు. పొన్కల్ దగ్గర గోదావరి నదిపై సదర్మట్ బ్యారేజ్ నిర్మాణాన్ని ప్రారంభించారు. రూ.676 కోట్లతో ప్రభుత్వం సదర్మట్ బ్యారేజ్ నిర్మాణం చేపట్టిందని సీఎం ప్రసంగించారు. ఈ బ్యారేజ్ ద్వారా 18 వేల ఎకరాలకు సాగునీరును ప్రభుత్వం అందించనుందన్నారు. కేసీఆర్ హయాంలో చిత్తశుద్ధిగా పనిచేసి ఉంటే చనాక - కొరాట ప్రాజెక్టు ఎప్పుడో పూర్తయ్యేదని తెలిపారు. చనాక - కొరాట, సదర్మట్ బ్యారేజీలు గత పదేళ్లలో పూర్తికాలేదని ఈ సందర్భంగా సీఎం చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేశామని వెల్లడించారు. కాళేశ్వరానికి రూ.లక్షా 10 వేల కోట్లు ఖర్చుచేసినా.. చుక్కనీరు రాలేదని విమర్శించారు. రైతులకు నీరు రావాలంటే తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు కట్టాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొన్నారు. ఒక్కొక్కటిగా సమస్యలు పరిష్కరించుకుంటూ ముందుకెళ్తున్నామని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. నాటి పాలకులు చేసిన అప్పులే ఇప్పుడు ఉరి తాడు అయ్యాయి. మేం ఫ్యూచర్ సిటీ అంటే మమ్మల్ని రియల్ ఎస్టేట్ బ్రోకర్స్ అంటున్నారు' అని ప్రతిపక్షాలనుద్దేశించి అన్నారు ముఖ్యమంత్రి.'పదేళ్ల పాలనలో ఏమిచేయని వ్యక్తి ప్రజాపాలనను భరించలేక పోతున్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఉన్న వ్యక్తి ఇలాగేనా మాట్లాడేది. చేతనైతే మమ్మల్ని ఆశీర్వదించండి.. లేకుంటే ఫామ్‌హౌస్‌లోనే ఉండండి. మారీచుడు, సుగ్రీవుడు తరహాలో రాక్షసుల్లా.. అభివృద్ధికి అడ్డుపడుతున్నారు. శుక్రాచార్యుడిలా ఫామ్‌హౌస్‌లో ఉన్న వ్యక్తి ప్రోత్సహిస్తున్నారు. పదేళ్లు అధికారంలో ఉండి రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారు. బీఆర్ఎస్ నేతలకు అభివృద్ధి అంటే ఇష్టం లేకపోతే ఫామ్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకోవచ్చు. బావాబామ్మర్దులు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. మొన్న పంచాయతీ ఎన్నికల్లో 66శాతం కాంగ్రెస్ సర్పంచ్‌లను గెలిపించారు ప్రజలు. వారి నమ్మకాన్ని వమ్ము చేయం. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ మంచి వాళ్లను ఎన్నుకోండి. సమస్యలను పరిష్కరించే వాళ్లను, ప్రజా ప్రభుత్వంతో కలిసి పనిచేసిన వాళ్లనే గెలిపించుకోండి. నేను ఓడిపోయిన వాళ్ల గురించి మాట్లాడను. మేం పాలకులం కాదు.. సేవకులం. మీ మనసు గెలుస్తాం.. రాబోయే ఎన్నికల్లో విజయం సాధిస్తాం. 2038వరకు అధికారంలో ఉంటాం' అని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# లక్ష్యం మేరకు ఉద్యోగాల కల్పన

బీఆర్ఎస్ పాలకులు ఆడుకున్నారని మండిపడ్డారు. ఈ పాలనలో వారు.. వారి స్వప్రయోజనాలే చూసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో ఓపిక నశించిన యువత.. కేసీఆర్‌ను ఇంటికే పరిమితం చేశారని వ్యంగ్యంగా పేర్కొన్నారు. శుక్రవారం శిల్పకళా వేదికలో కొలువుల పండగ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి.. గ్రూప్- 3కి ఎంపికైన 1,370 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలకుల ఉద్యోగాలు పోతేనే మీకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతున్నారని చెప్పారు. ఉద్యోగాలు ఇవ్వకూడదని కోర్టుల్లో కేసులూ వేశారన్నారు. అన్ని అవరోధాలు అధిగమించి ఉద్యోగాలు ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్ 1 నియమకాలు చేపట్టలేదన్నారు. గతంలో నియామక పరీక్షలు కూడా సరిగా నిర్వహించ లేదని గుర్తు చేశారు. నిరుద్యోగులు తమ విలువైన సమయం కోల్పోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము వచ్చాక తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేశామన్నారు. యూపీఎస్సీ తరహాలోనే టీజీపీఎస్సీని సంస్కరించామని తెలిపారు. ఇప్పటి వరకు 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని వివరించారు. గతంలో అర్హత లేనివారికి టీజీపీఎస్సీలో కీలక ఉద్యోగాలు ఇచ్చారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై సీఎం రేవంత్ నిప్పులు చేశారు. గత ప్రభుత్వ పెద్దల ఉద్యోగాలు ఊడగొట్టి.. తమకు ఉద్యోగాలు ఇచ్చే ప్రజా ప్రభుత్వాన్ని యువత తెచ్చుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వివిధ శాఖల్లో గ్రూప్-3 ఉద్యోగాలకు ఎంపికైన 1,370 మందికి నియామక పత్రాలను సీఎం చేతుల మీదుగా అందజేశారు. గత ప్రభుత్వం గ్రూప్-1 పరీక్ష నిర్వహించలేదని, పోటీ పరీక్షలు నిర్వహించకపోవడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. పేపర్లు లీకవ్వడం, మళ్లీ పరీక్షలు నిర్వహించడం మరో బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ విశ్వసనీయతను దెబ్బతీశారు. యూపీఎస్సీ తరహాలోనే టీజీపీఎస్సీని సంస్కరించాం. గ్రూప్-1 నియామకపత్రాలు ఇచ్చే సమయంలో కూడా కోర్టుకు వెళ్లి కుట్రలు చేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 60వేల ఉద్యోగ నియామకపత్రాలు అందించాం. ఉద్యోగాలు ఇవ్వడం మాకు బాధ్యత.. మీకు జీవితం. ప్రభుత్వ ఉద్యోగం అంటే జీతం తీసుకోవడం కాదు.. ఒక భావోద్వేగం. అందరికీ విద్య అందుతుంది.. కానీ, నాణ్యమైన విద్య అందడం లేదు. ప్రైవేటు పాఠశాలల మీద ప్రజలకు ఎందుకు విశ్వాసం పెరిగింది? లక్షల మంది ఇంజినీరింగ్ చేసి బయటకు వస్తున్నా.. అందరికీ ఎందుకు ఉద్యోగాలు రావట్లేదు? జాబ్ మార్కెట్‌లో అవకాశాలు ఉన్నా స్కిల్ లేక అందుకోలేకపోతున్నాం. నైపుణ్యాభివృద్ధి కోసం మీరు ప్రయత్నించాలి. ఒకప్పుడు పేదరికం పోగొట్టడానికి భూములు ఇచ్చే వాళ్లం. ఇప్పుడు ఇవ్వడానికి భూములు లేవు.. నాణ్యమైన విద్యను మాత్రమే అందించగలం. విద్య ఒక్కటే పేదరికాన్ని పోగొడుతుంది. కులం, డబ్బు, అధికారంతో కాదు.. విద్యతోనే గౌరవం వస్తుంది. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చాలి. రాబోయే రోజుల్లో అన్ని ఉద్యోగ నియామకాలు పూర్తి చేస్తా.. రాజకీయపార్టీల చేతుల్లో ఆయుధాలుగా మారొద్దు. ఎవరూ మనకు చెప్పాల్సిన అవసరం లేదు.. నాకు సంపూర్ణ అవగాహన ఉంది. ప్రభుత్వంలోనే కాదు.. ప్రవేటు రంగంలో కూడా రూ.లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చి ప్రపంచంతోనే పోటీ పడే విధంగా యువతను తీర్చి దిద్దే బాధ్యత నాదని సీఎం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి తదిరులు పాల్గొన్నారు.

## సుప్రీం ఆదేశాలను ధిక్కరించిన స్పీకర్

ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ క్లీన్‌చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే. మరికొందరిపై నిర్ణయాన్ని పెండింగ్‌లో పెట్టారు. దీంతో స్పీకర్‌పై భాజపా శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి.. కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల విషయంలో 3 నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పినా.. ఆ సూచనను స్పీకర్ పాటించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలను కూడా పిటిషన్‌లో పొందుపరిచారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై గతంలో విచారణ జరిపిన సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో సరైన నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఆదేశించింది. అయితే.. నిర్ణీత గడువు ముగిసినా ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని ఇది న్యాయస్థానం ఆదేశాల ఉల్లంఘన కిందకు వస్తుందని బీజేపీ తన పిటిషన్‌లో స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించకపోవడమే కాకుండా.. కావాలనే తన నిర్ణయాన్ని ఆలస్యం చేస్తున్నారని ఆరోపిస్తూ స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌లో కోరారు. కోర్టు ఆదేశాలు అమలు జరగలేదని... ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నం, పార్టీ ఫిరాయింపులను చట్టబద్ధం చేసే పరిస్థితి వంటివి ఉన్నాయని పిటీషన్‌లో ప్రస్తావించింది బీజేపీ. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో స్పష్టత లేకపోవడాన్ని స్పీకర్ నిర్ణయం ఎందుకు ఆలస్యమవుతోందో చూపిస్తున్నాయని బీజేపీ వాదిస్తోంది. అధికార పార్టీకి అనుకూలంగా ఉండేలా నిర్ణయాన్ని స్పీకర్ ఆలస్యం చేస్తున్నారని, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వ స్థిరత్వంపై ప్రభావం పడుతుందని అందుకే స్పీకర్ ఉద్దేశపూర్వకంగా నిర్ణయం తీసుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు ఏలేటి. ఎమ్మెల్యేలు పార్టీ మారినా ఎలాంటి పరిణామాలు ఉండవనే భావన పెరుగుతుందని బీజేపీ తన పిటిషన్‌లో రాసుకొచ్చింది.ఇప్పుడీ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరడంతో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలుతో ఈ కేసు ఎలాంటి మలుపులు తిరుగుతుందో.. న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది.

## ధరణి,భూభారతి కుంభకోణంలో 15మంది అరెస్ట్

కమిషనర్ సన్ ప్రీత్‌సింగ్ తెలిపారు. మరో 9 మంది పరారీలో ఉన్నట్టు చెప్పారు. ప్రధాన నిందితులుగా బసవరాజు, జెల్లా పాండుగా గుర్తించాం. జనగామ, యాదాద్రి జిల్లాల్లో గతంలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయి. యాదగిరిగుట్టలోని ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ల ద్వారా మోసాలు జరిగాయన్నారు. రూ.3.90 కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. వెబ్‌సైట్‌లో సాంకేతిక లోపాల ఆధారంగా లూటీ చేశారు. నిందితుల నుంచి రూ.63.19లక్షల నగదు స్వాధీనం చేసుకున్నాం. నిందితుల బ్యాంక్ ఖాతాల్లోని రూ.లక్ష సీజ్ చేశాం. రూ.కోటి విలువైన ఆస్తి పత్రాలు, కారు, ల్యాప్ టాప్‌లు, డెస్క్ టాప్‌లు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నాం. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ధరణి- భూ భారతి కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశముందని సీపీ తెలిపారు. మొత్తం మూడు కోట్ల 72 లక్షల రూపాయల కుంభకోణం జరిగినట్టు పోలీసులు వెల్లడించారు. జనగామ, యాదాద్రి జిల్లాల్లో సంచలనం సృష్టించిన ధరణి, భూ భారతి కుంభకోణం కేసులో కీలక ఆధారాలు సేకరించారు పోలీసులు.

వెలుతురు

# ఎన్నికలు ఏవైనా బీజేపీని ఆశీర్వదిస్తున్న ప్రజలు

**ఆదిలాబాద్ వెలుతురు జనవరి 16:**
బీజేపీ సుపరిపాలన అందిస్తుందన్న ప్రజల నమ్మకం మహారాష్ట్రలో మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయంతో మరో మారు రుజువయిందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మహారాష్ట్ర లోని ముంబై తో పాటు ఇతర మున్సిపాలిటీలో బీజేపీ దాని అనుబంధ పార్టీలు విజయం సాధించడంతో ఆదిలాబాద్ లో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు చేపట్టారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట బీజేపీ శ్రేణులు చేపట్టిన సంబరాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద్ తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా టపాసులు కాలుస్తూ, స్వీట్లు పంచుకుని విజయోత్సవ సంబరాలను ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. దేశంలో ఏ ఎన్నికలు వచ్చినా బీజేపీ విజయ డంకా మోగిస్తుందన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలతో పాటు మహారాష్ట్రలో ముంబై తో పాటు ఇతర మున్సిపాలిటీలో బీజేపీ పార్టీతో పాటు దాని అనుబంధ పార్టీలు 85 శాతానికి పైగా గెలుపొందడం చూస్తే మరోమారు బీజేపీ కి ప్రజలపై ఉన్న నమ్మకానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఈ ఎన్నికల ఫలితాలే త్వరలో తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో సైతం బీజేపీ కి ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. దేశంలో భవిష్యత్తు అంతా భారతీయ జనతా పార్టీ దేనని పేర్కొన్నారు. దేశంలో సురక్షిత పాలన సాగుతోందంటే అది భారతీయ జనతా పార్టీ, ప్రధాని నరేంద్ర మోడీ పాలనలోనే సాధ్యమని వెల్లడించారు. మునిసిపాలిటీలో కానీ, పంచాయతీలో కానీ కేంద్ర ప్రభుత్వమే ఇస్తున్న నిధులు తప్ప రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ పార్టీ నాయకులు, లాలా మున్నా ఆకుల ప్రవీణ్ . నగేష్ దినేష్ మటోలియా భీమ్సేన్ రెడ్డి వేద వ్యాస్ శివ కుమార్ .కార్తీక్ . కృష్ణ యాదవ్ . గట్టిగా క్రాంతి పాల్గొన్నారు.

## బెంగాల్లో నేటినుంచి మోడీ రెండ్రోజుల పర్యటన

**- పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న ప్రధాని**

**కోల్‌కతా,జనవరి16( వెలుతురు):**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీఈనెల 17,18 తేదీల్లో పశ్చిమబెంగాల్లో పర్యటించనున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు రాజకీయ ర్యాలీల్లోనూ పాల్గొంటారు. ఎన్నికల జాబితా ఎస్ఐఆర్(÷ూఎఖీ) ప్రక్రియ, టీఎంసీ రాజకీయ కన్సెల్టెన్సీ ఐ–ప్యాక్ పై ఇటీవల జరిగిన ఈడీ దాడులతో బెంగాల్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కిన నేపథ్యంలో మోదీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకోనుంది. ÷డ్యూల్ ప్రకారం.. మైనారిటీల ఆధిపత్యం ఉన్న మాల్దాలో ఈనెల 17న జరిగే బహిరంగ ర్యాలీలో మోదీ పాల్గొంటారు. సింగూర్‌లో జరిగే మరో ర్యాలీకి కూడా హాజరవుతారు. శనివారం సాయంత్రం మాల్దాకు ప్రధాని చేరుకుంటారని, తొలుత ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని ఆ తర్వాత సమీప గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసే పబ్లిక్ ర్యాలీలో పాల్గొంటారని బీజేపీ రాష్ట్ర నేత ఒకరు తెలిపారు. ఆదివారం నాడు మరలా బెంగాల్ వచ్చి హుగ్లీలోని సింగూర్‌లో ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని, ఆ వెంటనే పబ్లిక్ ర్యాలీకి హాజరవుతారని చెప్పారు. ఆ రాత్రి కోల్‌కతాలోనే బస చేస్తారా అనేది మాత్రం వెల్లడించలేదు. పీఐబీ ప్రకటన ప్రకారం.. ప్రధాని జనవరి 17వ తేదీ మధ్యాహ్నం 12:45 గంటలకు మాల్దా చేరుకుంటారు. హౌరా–గౌహతి మధ్య నడిచే తొలి వందేభారత్ స్లీపర్ ట్రైన్‌ను పచ్చజెండా ఊపి ప్రారంభిస్తారు. ఆదివారం నాడు హుగ్లీ జిల్లాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభం, శంకుస్థాపనలు చేస్తారు. ఎస్ఐఆర్ పేరుతో సాధారణ పౌరులను బీజేపీ, ఎన్నికల కమిషన్ వేధిస్తోందని.. దీనికి బ్యాలెట్ బాక్స్ వద్దే ప్రజలు గట్టి గుణపాఠం చెప్పాలని అధికార టీఎంసీ కొద్దిరోజులుగా విమర్శలు గుప్పిస్తోంది. అయితే.. ఈ వాదనలను బీజేపీ తోసిపుచ్చుతోంది. అక్రమ వలసదారులు, రోహింగ్యాలను ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు ఎస్ఐఆర్ తప్పనిసరని, గణనీయంగా తమ ఓటు బ్యాంకు కోల్పోతోందనే అక్కసుతోనే టీఎంసీ తప్పుడు ఆరోపణలను చేస్తోందని చెబుతోంది.

## 299లకే మేడారం ప్రసాదం

**- తెలంగాణ ఆర్టీసీ వినూత్న సేవ**

**ములుగు,జనవరి16( వెలుతురు):**
ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన 'సమ్మక్క సారలమ్మ జాతర' ఈ నెల 28 నుండి 31వ తేదీ వరకు జరుగనుంది. ములుగు జిల్లాలోని మేడారంలోలో కొలువైన వనదేవతలకు బంగారం సమర్పించుకునేందుకు తండోపతండాలుగా భక్తజనం తరలివస్తారు. ఈ నేపథ్యంలో భక్తుల కోసం టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సేవల్ని ప్రారంభించింది. మేడారంలో అమ్మవార్లకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించడం ఆనవాయితీ. భక్తులు ఈ బంగారాన్ని పరమపవిత్రంగా భావిస్తారు. అయితే.. వివిధ కారణాల వల్ల మేడారం వెళ్లలేకపోయిన భక్తులకు టీజీఎస్ ఆర్టీసీ తీపి కబురు చెప్పింది. అలాంటి వారికి అమ్మవారి బంగారం ప్రసాదాన్ని తమ ఇంటి వద్దకే చేర్చేందుకు తగు ప్రణాళికలు సిద్ధం చేసింది. రూ.299 చెల్లిస్తే చాలు వద్దకే మేడారం అమ్మవార్ల ప్రసాదాన్ని తీసుకొచ్చి ఇవ్వనుంది. దేవాదాయ శాఖ సహకారంతో మేడారం అమ్మవార్ల బంగారం ప్రసాదాన్ని ఇంటి వద్దకే పంపించాలని టీజీఎస్ ఆర్టీసీ భావించింది. ఈ ప్రసాదం ప్యాకెట్‌లో సమ్మక్క, సారలమ్మ దేవతల ఫోటోతో సహా బెల్లం, పసుపు కుంకుమ వంటివి ఉంటాయి. ఈ గారం ప్రసాదం ప్యాకెట్ పొందాలనుకునే భక్తులు కేవలం రూ.299/– చెల్లించాల్సి ఉంటుంది. లిలిలి.బిణబసబిశౌనీణతిబబితిఞ్బ.ఞ్నీ.తిని వెబ్‌సైట్‌లో లాగిన్ కావడం ద్వారా లేదంటే తమ సమీపంలోని టీజీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్స్ కౌంటర్లలో అమ్మవార్ల బంగారం ప్రసాదాన్ని బుక్ చేసుకోవచ్చు. మరింత సమాచారం కోసం టీజీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ను 040-69440069, 040-23450033 నంబర్లలో సంప్రదించవచ్చు అని టీజీఎస్‌ఆర్టీసీ వీసీ, ఎండీ వై.నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

# 'సీఐసీ' విజేత సురేష్ ఎరియట్ 'దేశీ ఊన్న చిత్రంతో భారత యానిమేషన్ రంగానికి అంతర్జాతీయ ఖ్యాతి







**హైదరాబాద్ వెలుతురు జనవరి 16:**
ప్రసిద్ధ యానిమేషన్ చిత్ర దర్శకుడు, 'క్రియేట్ ఇన్ ఇండియా' (సీఐసీ) పోటీల విజేత సురేష్ ఎరియట్ తన 'దేశీ ఊన్' (స్వదేశీ ఊలు) చిత్రంతో భారత యానియేషన్ రంగానికి అంతర్జాతీయ ఖ్యాతినార్జించి పెట్టారు. ఫ్రాన్స్‌లో నిర్వహించిన యాన్సీ అంతర్జాతీయ యానిమేషన్ చలనచిత్రోత్సవం–2025లో ఇది 'ఉత్తమ కమిషన్డ చిత్రంగా జ్యూరీ అవార్డు గెలుపొంది, భారత్ గర్వపడేలా చేసింది. 'వేవ్స్ అవార్డ్స్ ఆఫ్ ఎక్సలెన్స్–2025'లో 'సీఐసీ' కింద నిర్మించిన 'దేశీ ఊన్' చిత్రం స్వర్ణ పతకం సాధించింది. భారతీయ సంస్కృతిని ప్రపంచ స్థాయి కథనం, యానిమేషన్‌ల అద్భుత సమ్మేళనంగా మలచిన చిత్రమిది. గ్రామీణ భారతం నేపథ్యంగా రూపొందించిన ఈ చిత్రం, గొర్రెల కాపరుల జీవితాల్లోని భావోద్వేగపు లోతులను సాధికారికంగా ప్రేక్షకుల కళ్లకు కట్టింది. ఆ మేరకు సంప్రదాయం, పట్టుదల, గుర్తింపు సంబంధిత శక్తిమంతమైన కథనాన్ని అల్లింది. ఈ విజయానందాన్ని పంచుకుంటూ– "యాన్సీలో ఈ గుర్తింపు నాకు దక్కిన గొప్ప గౌరవం. ఇది నిస్సందేహంగా ఓ భారతీయ చిత్రం సాధించిన అరుదైన విజయం. ఈ చలనచిత్రోత్సవ పురస్కారాన్ని భారత్ కైవసం చేసుకోవడం మాకెంతో సంతోషాన్నిస్తోంది. 'వేవ్స్'లో స్వర్ణ పతకం సాధించిన చిత్రాల్లో 'దేశీ ఊన్' కూడా ఒకటి. 'క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్'కి నిజంగా ఇదెంతో స్ఫూర్తినిచ్చింది" అని సురేష్ ఎరియట్ వ్యాఖ్యానించారు. గొర్రెల కాపరుల జీవితాన్ని తెరపై సాధికారికంగా ఆవిష్కరించడం కోసం ఎరియట్, ఆయన బృందం చాలాకాలం పాటు సన్నిహితంగా అధ్యయనం చేశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ– "ప్రతి ఫ్రేమునూ వాస్తవికంగా చిత్రించేందుకు వీలుగా కాపరుల ప్రపంచాన్ని, పరిసరాలను, జీవన శైలిని లోతుగా అర్థం చేసుకోవడానికి మేమెంతో శ్రద్ధతో పనిచేశాం" అని ఆయన వివరించారు. 'దేశీ ఊన్న చిత్రానికి లభించిన పలు రకాల గుర్తింపులలో యాన్సీలో లభించిన ఈ విజయం కూడా ఒకటి. ఈ మేరకు 'కాన్స్ లయన్స్–2025'కు షార్ట్ లిస్టింగ్ సహా 'గుడ్ యాడ్స్ మ్యాటర్, 'ఏఐసీపీ షో', 'క్యూరియస్ క్రియేటివ్ అవార్డ్స్' పురస్కారాలు కూడా దక్కాయి. భారత సృజనకర్తలు తమ కథలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడంలో కేంద్ర సమాచార–ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని 'వేవ్స్' కార్యక్రమం కింద 'క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్ ఎంతటి సాధికారతనిచ్చిందో చెప్పడానికి ఎరియట్ విజయం ఒక తిరుగులేని నిదర్శనం. సృజనాత్మకతతో మనోరంజకంగా దేశీయ కథలను తెరకెక్కిస్తే అవి సరిహద్దులకు అతీతంగా ప్రతిభా ప్రకాశాన్ని వెదజల్లగలవని 'దేశీ ఊన్' చిత్రం రుజువు చేసింది. 'ఊన్న అంటే– ఉన్ని కాగా... 'దేశీ ఊన్న ప్రధానంగా కర్ణాటక, దక్షిణ మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో స్థానిక దక్కనీ నల్ల గొర్రెల నుంచి లభించే సంప్రదాయ ఊలును సూచిస్తుంది. ఈ చిత్రాన్ని సురేష్ ఎరియట్ నడిపే 'స్టూడియో ఈక్సారస్ట సంస్థ నిర్మించింది. ఈ చిత్ర విజయంపై ఎరియట్ వ్యాఖ్యానించినట్లు– ఈ చిత్రంలో సందేశానికి అవార్డులు, ప్రశంసలు వంటివి మరింత ఉత్తేజం ఇవ్వగలవనడంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో "దేశం కోసం రూపొందించే సినిమాలతో మరింత మంది భారత దర్శకులు, నిర్మాతలు అంతర్జాతీయ వేదికలపై తమదైన ముద్ర వేయగలరని నేను ఆశిస్తున్నాను" అని ఆయన అన్నారు.

# 18న పాలేరుకు సీఎం రేవంత్ రెడ్డి

**- రూ. 362 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం**
**- చారిత్రక ఘట్టం.. మేడారంలో రాష్ట్ర క్యాబినెట్ భేటీ: మంత్రి పొంగులేటి**









**వెలుతురు ఏదులాపురం మున్సిపాలిటీ జనవరి 16:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత ఉమ్మడి జిల్లాల పర్యటనలో భాగంగా ఈ నెల 18న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పర్యటనలో భాగంగా మొత్తం రూ. 362 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు.

### పాలేరు గడ్డపై అభివృద్ధి పండుగ

మద్దులపల్లిలో జేఎన్టీయూ కళాశాలకు శంకుస్థాపన, నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవం చేయడంతో పాటు.. మున్నేరు–పాలేరు లింక్ కెనాల్ నిర్మాణ పనులను సీఎం ప్రారంభిస్తారు. అదేవిధంగా మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ ను ప్రారంభిస్తారు. అలాగే కూసుమంచిలో నిర్మించిన 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొంటారని వివరించారు. ఇదే వేదికగా రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల సన్నద్ధతపై ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తలతో సీఎం దిశానిర్దేశం చేయనున్నారని పొంగులేటి తెలిపారు.

### తొలిసారిగా హైదరాబాద్ వెలుపల క్యాబినెట్ భేటీ..

రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా ఈ నెల 18న మేడారంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం (క్యాబినెట్ మీటింగ్) నిర్వహించనున్నట్లు పొంగులేటి ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎన్నడూ లేని విధంగా హైదరాబాద్ వెలుపల క్యాబినెట్ భేటీ జరగడం ఇదే ప్రథమమని పేర్కొన్నారు. "గత ప్రభుత్వంలా ఎన్నికల వేళ బొమ్మలు చూపడం మా అలవాటు కాదు.. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పనిచేసే ప్రభుత్వమిది" అని స్పష్టం చేశారు.

### కుంభమేళాకు మించి మేడారం ఏర్పాట్లు

సమ్మక్క–సారలమ్మ జాతరను కుంభమేళా కంటే అద్భుతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని మంత్రి తెలిపారు. మేడారంలో కాకతీయుల నాటి వైభవం ఉట్టిపడేలా నిర్మించిన రాతి కట్టడాలను 19వ తేదీ ఉదయం ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని వెల్లడించారు. అలాగే గడువు ముగిసిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో 57న విడత 'ఫిట్ ఇండియా- సండేస్ ఆన్ సైకిల్

**- పాల్గొననున్న భారత బ్యాడ్మింటన్ దిగ్గజం పుల్లెల గోపీచంద్, పారాలింపియన్ దీప్తి జీవంజి, ఇతర ప్రముఖులు**
**- డిసెంబర్ 2024లో 'ఫిట్ ఇండియా - సండేస్ ఆన్ సైకిల్ల కార్యక్రమాన్ని ప్రారంభించిన కేంద్ర క్రీడా శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ**

**హైదరాబాద్, వెలుతురు 2026 జనవరి 16:**
శారీరక ధృడత్వం, ఏకాగ్రత, సామాజిక భాగస్వామ్యం అనే వినూత్న కలయికతో ఈ ఆదివారం జరగనున్న 57వ విడత 'ఫిట్ ఇండియా – సండేస్ ఆన్ సైకిల్లకు ఆతిథ్యం ఇచ్చేందుకు హైదరాబాద్ నగరం సిద్ధమైంది. ఆధ్యాత్మిక, ఆరోగ్య సంరక్షణ విషయంలో ఈ కార్యక్రమానికి ఉన్న ప్రత్యేకతను తెలియజేస్తూ రంగారెడ్డి జిల్లా చేగూరు గ్రామం సమీపంలోని కన్హా శాంతి వనం ప్రాంగణంలో అంతర్జాతీయ ప్రధాన కార్యాలయం కలిగిన హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఈ కార్యక్రమంతో జతకలిసింది.

డిసెంబర్ 2024లో యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ శ్రీ మన్సుఖ్ మాండవియా ప్రారంభించిన ఈ 'ఫిట్ ఇండియా – సండేస్ ఆన్ సైకిల్ల.. శారీరక దృఢత్వం, స్వచ్ఛమైన వాతావరణం, సుస్థిరతను ప్రోత్సహించే ఒక 'ప్రజా ఉద్యమం'గా మారింది. ఈ ఉద్యమంలో దేశవ్యాప్తంగా 2 లక్షలకు పైగా ప్రదేశాలలో 22 లక్షల కంటే ఎక్కువ మంది భాగస్వాములయ్యారు.



ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్ణ కార్యక్రమంలో పదేపదే ఈ కార్యక్రమం గురించి ప్రస్తావించారు. ఈ ఉద్యమం ద్వారా భారత్.. ఆరోగ్యాన్ని దినచర్యతో, శ్రమను క్రమశిక్షణతో, వ్యక్తిగత శ్రేయస్సును దేశ శ్రేయస్సుతో సమతుల్యం చేయడం నేర్చుకుంటోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం స్థూలకాయంపై పోరాటం, కాలుష్యానికి పరిష్కారం అనే రెండు ముఖ్యమైన అంశాలపై పనిచేస్తూ ప్రజలకు కర్బన ఉద్గారాలను తగ్గిస్తూనే ఆరోగ్యంగా ఉండటానికి ఒక సులభమైన, ఆహ్లాదకరమైన మార్గాన్ని అందిస్తుంది.

'ఫిట్ ఇండియా – సండేస్ ఆన్ సైకిల్ల 57వ విడతలో భారత మాజీ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్‌తో పాటు పారిస్ 2024 పారాలింపిక్ కాంస్య పతక విజేత– అర్జున అవార్డు గ్రహీత (2025)– ప్రపంచ రికార్డు సాధించిన దీప్తి జీవంజి, ఇతర అథ్లెట్లు పాల్గొననున్నారు.

ఆసియా జూనియర్, ఆసియా 'యూ20' ఛాంపియన్‌షిప్‌లలో డబుల్ ఆసియా రిలే మెడలిస్ట్ అయిన స్ప్రింటర్ వీ. హిమ తేజ.. ఆసియా యూత్ ఛాంపియన్‌షిప్‌లో 2000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో ఐదో స్థానంలో నిలిచిన మిడిల్ డిస్టెన్స్ రన్నర్ సల్లా మహేష్.. దక్షిణాసియా ఛాంపియన్‌షిప్ వెండి పతక విజేత, వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన ఎండ్యూరెన్స్ స్పెషలిస్ట్ మోహిత్ చౌదరి ఈ కార్యక్రమానికి మరింత ఆకర్షణను తీసుకురానున్నారు. వీరితో పాటు దక్షిణాసియా ఛాంపియన్‌షిప్‌లో 800 మీటర్ల పరుగులో కాంస్య పతక విజేత, వరల్డ్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న ఎం. వెంకట్రామ రెడ్డి.. ఆసియా యూత్ గేమ్స్‌లో హైజంప్‌లో పోటీపడిన యశ్విత పొతనపల్లి.. ఏయూ ఐఎస్‌బీఏఎం వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న ఎం. ఉమా కూడా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

క్రీడల్లో రాణించేందుకు, రోజువారీ జీవితానికి శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, చురుకైన జీవనశైలికి సాధారణ పునాదులు అనే సందేశాన్ని వీరు బలపరచనున్నారు. ఇది సైక్లింగ్ ఉద్యమానికి పోటీతత్వ శక్తి, స్ఫూర్తిని అందిస్తుంది. ఫిట్ ఇండియా ఛాంపియన్లు, అంబాసిడర్లు కూడా సైక్లింగ్ మార్గ మధ్యలో ప్రజలతో కలిసి పాల్గొంటూ అన్ని వయసుల వారిని ఉత్తేజపరుస్తారు. సైక్లింగ్‌తో పాటు యోగా, జుంబా, టగ్–ఆఫ్–వార్, రోప్ స్కిప్పింగ్, ఇతర శారీరక కార్యకలాపాలు కూడా సమాంతరంగా జరగనున్నాయి.

శారీరక ధృడత్వాన్ని దైనందిన జీవితంలో ఒక అంతర్భాగంగా మార్చాలనే ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ.. 2019 ఆగస్టు 29న 'ఫిట్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజల ప్రవర్తనలో మార్పులు తీసుకురావడం, శారీరక శ్రమతో కూడిన జీవనశైలి వైపు మళ్లించటం అనేవి ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం.

ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్ – హైదరాబాద్
వివరాలు:
తేదీ: జనవరి 18, 2026 (ఆదివారం)
మీడియా రిపోర్టింగ్ సమయం: ఉదయం 7 గంటలకు
వేదిక: గచ్చిబౌలి స్టేడియం

# సంపాదకీయం.. రాష్ట్రాల పురోగతి లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపులు !

మరో పక్షం రోజుల్లో కేంద్ర బడ్జెట్ ప్రకటించనున్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతరామన్ మరోమారు బడ్జెట్ కసరత్తులో బిజీగా ఉన్నారు. ఇటీవల ఆయా రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో చర్చించారు. ఆయా రాష్ట్రాల మంత్రులు వారివారి రాష్ట్రాల్లో ఉన్న అవసరాలను, నిధుల కేటాయింపులపై వినతిపత్రాలు సమర్పించారు. తెలుగు రాష్ట్రాల నుంచి భట్టి విక్రమార్క, పయ్యావుల కేశవుఉల హాజరై తమ అసవరాలను, ఆకాంక్షలను వెల్లడంచారు. అయితే ఏటా కేటాయింపులు చేస్తున్నా..ఇప్పటి వరకు ప్రకటించిన కేటాయింపులు, ఖర్చులపై స్పష్టత లేదు. ఏ పథకానికి ఎంత ఖర్చు చేశారో తెలియదు. అలాగే అన్ని రాష్ట్రాలను సమానంగా చూస్తూ కేటాయింపులు ఉండాలి. బడ్జెట్ అంటే అభివృద్ధి దివఘా చర్యలు ఉండాలి. అనుకూల రాష్ట్రాలకు ఒక రకంగా, తమ పార్టీ పాలనలో లేని రాష్ట్రాలను మరో రకంగా చూసే విధానాలకు పాతరేయాలి. బడ్జెట్ అందరికి సమాన హక్కుగా ఉండాలి. అది దేశ ప్రగతిని ప్రతిఫలించాలి. తమకు మద్దు ఇస్తున్న పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ఒక రకంగా, మిగతా రాష్ట్రాలను మరో రకంగా చూసు విధానం సరికాదు. మరికొద్ది రోజుల్లో పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు జరగనుండగా, దానికి సన్నాహంగా ఇటీవల నిర్వహించిన ప్రీ బడ్జెట్ సమావేశంలో రాష్ట్రాల ఈ దైన్య స్థితి స్పష్టంగా వెలుగులోకి వచ్చింది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్రంలో ఎన్‌డిఎ కూటమికి చెందిన పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు సైతం నిధుల కోసం గళం విప్పాల్సి రావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. తమ తమ




రాష్ట్రాల్లో నెలకొన్న దుర్భర పరిస్థితులను వివరిస్తూ అదనపు నిధులు కావాలని, జిఎస్‌టి పరిహారం కొనసాగించాలని సమావేశంలోనే ఆ రాష్ట్ర ప్రభుత్వాలూ విజ్ఞప్తులు చేశాయి. పన్నుల వసూళ్లలో రాష్ట్రాల వాటా తగ్గిస్తూ, గ్రాంట్లు ఆలస్యం చేస్తూ, అప్పుల పరిమితులను కట్టడి చేస్తూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరే రాష్ట్రాల ఈ దుస్థితికి కారణం. సిపిఎం నేతృత్వంలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కేరళ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం మరింత కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. ఆర్థికంగా దిగ్బంధించడం ద్వారా వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వ ప్రతిష్టను ప్రజల్లో దిగజార్చే కుటిల వ్యూహానికి బిజెపి తెగబడుతోంది. ఇలా దాదాపు లక్ష కోట్ల రూపాయల మేర ఆ రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేంద్రం మంజూరు చేయడానికి నిరాకరిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. గత ఐదేళ్లలోనే 57వేల కోట్ల రూపాయలకు కోత పెట్టింది. పన్నుల వాటాను 3.89 శాతం నుండి 1.92 శాతానికి తగ్గించింది. ఈ చర్య వల్ల 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే కేరళ ప్రజలు 27 వేల కోట్ల రూపాయలు నష్టపోయారు. జిఎస్‌టి సంస్కరణల ద్వారా మనో 9వేల కోట్లను ఆ రాష్ట్రం కోల్పోయింది. త్వరలో ఎన్నికలు జరగనున్నఈ రాష్ట్రంలో ఈ తరహా రాజకీయ కక్ష సాధింపు చర్యలు పతాకస్థాయికి చేరడంతో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ సత్యాగ్రహం చేయాల్సి వచ్చింది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ ఆర్థిక దిగ్బంధనంపై కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ పెదవి విప్పక పోవడం పచ్చి అవకాశవాద రాజకీయం తప్ప మరోటి కాదు. ఏమైనప్పటికీ ఈ తరహా ఏకపక్ష విధానాలను నరేంద్రమోడీ ప్రభుత్వం ఇప్పటికైనా విడనాడాలి. రాజ్యాంగ బద్ధమైన రాష్ట్రాల హక్కులను గౌరవించాలి. లేని పక్షంలో ఈ తరహా ఆందోళనలు మరిన్ని రాష్ట్రాల్లో చోటుచేసుకునే అవకాశం ఉంది. బలమైన రాష్ట్రాలే కేంద్రాన్ని బలంగా నిలబెడతాయి. స్థిరమైన ఆర్థిక వనరులతోనే బలంగా నిలుస్తాయి. సమాఖ్య వ్యవస్థ పురోగతికి అత్యంత కీలకమైన ఈ అంశంపైనే నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం దాడి చేస్తోంది. ఆర్థిక హక్కులను క్రమేణా హరిస్తోంది. ఫలితంగా రాష్ట్రాలు ప్రతి చిన్న అవసరానికి కేంద్రం దయా దాక్షిణ్యాలపై ఆదారపడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.ప్రీ బడ్జెట్ సమావేశంలో రాష్ట్రం తరపున పాల్గొన్న తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అనేక విషయాలను నిర్మలా సీతారామన్ ముందుంచారు. ఫ్యూచర్ సిటీ, నవోదయలు, మూసీ సుందరీకరణ, రోడ్ల విస్తరణ, ఎస్సీఆరెస్పీకి జాతీయ హోదా ,ట్రిపుల్ ఆర్ వంటి అనేక అంశాలను, నిధుల కేటాయింపులను ప్రస్తావించారు. వీటికి కేంద్రం బ్జడెట్‌లో ఏ రకమైన స్పందన చూపిస్తుందో చూడాలి.

అలాగే ఎపికి చెందిన మంత్రి పయ్యావుల కేశవ్ కూడా కోరికల చిట్టా విప్పారు. రాష్ట్ర రాజధాని అమరావతి నగర నిర్మాణ పనులకు సాయాన్ని కొనసాగించాలని ఆయన కోరారు. విభజన హామీల్లో భాగమైన పోలవరం ప్రాజెక్టుకు పూర్తి నిధులు ఇవ్వాలని, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విశాఖపట్నం, రాయలసీమ ప్రాంతాల మౌలిక సదుపాయాల కోసం అదనపు కేటాయింపులు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ కోరికలు కోరడం ఇదే మొదటి సారికాదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతిసారీ దాదాపుగా ఇవే అంశాలను ప్రధాన మంత్రి నుండి మంత్రుల వరకు వ్యక్తిగతంగా కలిసి ఈ మేరకు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు. ఢిల్లీలో ఉన్న రాష్ట్ర ఎంపీలు, పర్యటనలకు వెళ్లే మంత్రులూ ఇదే పనిమీద ఉంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయినా, కేంద్రం నుండి నిధులు రావడం లేదు. మన రాష్ట్రమే కాదు, ఎన్‌డిఎలో మరో భాగస్వామిగాఉన్న బీహార్ ప్రభుత్వం నుండి కూడా ఇటువంటి విజ్ఞప్తులే అందాయి. పలు బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా జిఎస్‌టి నష్టపరిహారం, గ్రాంట్ల పెంపు, ప్రత్యేక ప్యాకేజీల కోసం కేంద్రాన్ని కోరినట్లు వార్తలు వచ్చాయి. నిధుల కేటాయింపుల్లో సమతుల్యత పాటించాలి. విభేదాలు పక్కన పెట్టాలి. అప్పుడే కేంద్ర, రాష్ట్రాల మధ్య సయోధ్య సాధ్యం అవుతుంది.

# స్వేచ్ఛకు భారం అయ్యిన బాధ్యతలు - మనమే కూల్చుకుంటున్న పెళ్లి వ్యవస్థ...!



**మన్నారం నాగరాజు.**
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

*పెళ్లి అనేది మన సమాజంలో కేవలం ఒక ఆచారం కాదు. అది ఒక విశ్వాసం. రెండు జీవితాలు మాత్రమే కాదు, రెండు కుటుంబాలు, రెండు తరాలు, ఒక విలువల వ్యవస్థ ఒకే దారిలో నడిచే ఒప్పందం. ఒకప్పుడు ఈ ఒప్పందం మాటలతో కాదు, మనసులతో కుదిరేది. కష్టాలు వస్తాయని తెలిసినా, అవి కలిసి ఎదుర్కొనే ధైర్యమే పెళ్లి బంధానికి పునాది. కానీ నేడు ఆ పునాది కదిలిపోతోంది. కారణం బయట నుంచి వచ్చిన తుఫాను కాదు, మన ఆలోచనల్లో చోటు చేసుకున్న మార్పు. పాశ్చాత్య మోజు, అనుమానం, ఈగో అనే మూడు పదాలు నేడు పెళ్లి వ్యవస్థను లోపల నుంచే తినేస్తున్నాయి.*

నేటి కాలంలో పెళ్లి గురించి మాట్లాడితే ముందుగా వినిపించే మాట "వ్యక్తిగత స్వేచ్ఛ". నిజానికి స్వేచ్ఛ తప్పు కాదు. కానీ స్వేచ్ఛకు బాధ్యత జత కాకపోతే అది అమాయకత్వంగా మారుతుంది. పాశ్చాత్య దేశాల్లో వ్యక్తిగత స్వేచ్ఛ ఎందుకు పనిచేస్తుందో మనం అర్థం చేసుకోలేకపోతున్నాం. అక్కడ వ్యక్తి చిన్నప్పటి నుంచే స్వతంత్రంగా నిలబడేలా వ్యవస్థలు ఉంటాయి. విద్య, ఉపాధి, సామాజిక భద్రత అన్నీ వ్యక్తిని ఆధారంగా చేసుకుని నడుస్తాయి. పెళ్లి అక్కడ ఒక ఎంపిక. కానీ మన సమాజంలో పెళ్లి ఇప్పటికీ ఒక జీవనాధారం. భావోద్వేగ భద్రత, ఆర్థిక సహకారం, కుటుంబ రక్షణ అన్నీ దానిపైనే ఆధారపడి ఉంటాయి. ఈ మౌలిక తేడాను పక్కన పెట్టి కేవలం "అక్కడ అలా ఉంది" అనే వాదనతో ఇక్కడ కూడా అదే సరైనదని భావించడం ఒక ప్రమాదకరమైన అపోహ.

పాశ్చాత్య మోజు మనలో ఎలా పనిచేస్తుందంటే – బాధ్యత తీసుకోకుండా హక్కులు కోరడం. పెళ్లిలో అసంతృప్తి వచ్చినప్పుడు దాన్ని సరిచేసుకునే ప్రయత్నం చేయకుండా, వెంటనే బయటకు రావాలనే ఆలోచన రావడం. ఒకప్పుడు గొడవ అంటే కుటుంబ పెద్దలు కూర్చుని మాట్లాడేవారు. ఇప్పుడు గొడవ అంటే న్యాయవాది నంబర్ వెతకడం. ఇది ఆధునికత అని మనం అనుకుంటున్నాం. కానీ నిజానికి ఇది ఓర్పు కోల్పోవడం. జీవితం మొత్తం సాఫీగా సాగుతుందని అనుకోవడం ఒక భ్రమ. ఆ భ్రమ పగిలినప్పుడు బంధాన్ని వదిలేయడం పరిష్కారం కాదు.

ఈ పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తున్న అంశం అనుమానం. ప్రేమకు పునాది నమ్మకం. నమ్మకం పోయిన చోట ప్రేమ నిలబడదు. నేటి పెళ్లిళ్లలో అనుమానం ఒక సాధారణ లక్షణంగా మారిపోయింది. మొబైల్ ఫోన్ మన జీవితంలోకి వచ్చిన తర్వాత వ్యక్తిగత స్థలం అనే భావన మారిపోయింది. ఒకప్పుడు ఎవరి డైరీ ఎవరు తెరవరు. ఇప్పుడు ఎవరి ఫోన్ ఎవరు చూడాలనే ప్రశ్నే గొడవలకు కారణం. ఆలస్యంగా ఇంటికి రావడం, ఎక్కువసేపు ఫోన్ మాట్లాడడం, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండడం – ఇవన్నీ అనుమానాలకు బీజాలు వేస్తున్నాయి. నిజానికి సమస్య టెక్నాలజీలో లేదు. మన మనసుల్లో ఉంది. సంభాషణ తగ్గిపోయిన చోట అనుమానం పెరుగుతుంది. మాట్లాడితే తేలే విషయం మాట్లాడకుండా మనసులోనే తీర్పు ఇచ్చేస్తున్నాం.

అనుమానం క్రమంగా ఆరోపణగా మారుతుంది. ఆరోపణ ఘర్షణగా మారుతుంది. ఘర్షణ చివరికి విడాకుల దాకా తీసుకెళ్తుంది. ఈ మొత్తం ప్రయాణంలో ఎక్కడా ఆగి ఆలోచించం. నిజంగా సమస్య ఇదేనా? లేక మనం సమస్యను పెద్దదిగా చేస్తున్నామా? ఈ ప్రశ్నలు వేసుకునే ఓపిక లేకపోవడమే నేటి పెళ్లి సంక్షోభానికి మూలం.

అనుమానంతో పాటు ఈగో కూడా పెరుగుతోంది. "నేనే సరి" అనే భావన నేటి కుటుంబాల్లో బలంగా పాతుకుపోయింది. ఒకప్పుడు భర్త మాటే చివరి మాట అన్న వ్యవస్థ కూడా తప్పే. ఇప్పుడు భార్య మాటే చివరి మాట అన్న వ్యవస్థ కూడా అంతే తప్పు. పెళ్లి అంటే ఆధిపత్యం కాదు. సమన్వయం. కానీ ఈ సమన్వయానికి ఈగో అడ్డుగా నిలుస్తోంది. చిన్న విషయాల్లో తగ్గితే పరువు పోతుందన్న భయం, క్షమాపణ చెప్పితే ఓడిపోయినట్టేనన్న భావన -- ఇవన్నీ బంధాన్ని నలిపేస్తున్నాయి. నిజానికి సర్దుకుపోవడం ఓటమి కాదు. అది బంధాన్ని కాపాడుకునే తెలివి.

ఈగో పెరిగిన కొద్దీ పెళ్లి పోరాటంగా మారుతుంది. ఎవరు గెలిచారు? ఎవరు ఓడిపోయారు? అనే లెక్కలు మొదలవుతాయి. కానీ పెళ్లిలో గెలుపు--ఓటమి అనే భావనే లేదు. ఇద్దరూ కలిసి నిలబడ్డారో లేదో అంతే ముఖ్యం. ఈ సత్యాన్ని మరిచిపోయినప్పుడే పెళ్లి కోర్టు మెట్లెక్కుతుంది.

ఇంకో పెద్ద సమస్య ఏమిటంటే, పెళ్లిని హక్కుల పుస్తకంగా మార్చడం. "నాకు సమానం కావాలి", "నాకు గౌరవం కావాలి", "నాకు స్వేచ్ఛ కావాలి" – ఇవన్నీ సహజమైన కోరికలే. కానీ వాటితో పాటు "నేను బాధ్యతగా ఉండాలా?", "నేను ఎంత వరకు సహకరిస్తున్నా?" అనే ప్రశ్నలు లేకపోతే బంధం అసమతుల్యంగా మారుతుంది. హక్కులు మాత్రమే మాట్లాడే బంధం ఎక్కువ కాలం నిలవదు. బాధ్యతల గురించి ఆలోచించే బంధమే నిలుస్తుంది. ఈ సమతుల్యత కోల్పోవడమే నేటి పెళ్లి వ్యవస్థకు వచ్చిన పెద్ద ప్రమాదం. ఇకఈనాటి యువతలో ఒక కొత్త ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. పెళ్లి అయిన వెంటనే "అత్తమామలు వద్దు, తల్లిదండ్రులతో కూడ ఉండం, మనమిద్దరం స్వేచ్ఛగా జీవిద్దాం" అనే ఆలోచన వేగంగా విస్తరిస్తోంది. స్వేచ్ఛ అనేది వ్యక్తిగత హక్కే అయినప్పటికీ, అదే స్వేచ్ఛ పేరుతో పెద్దవాళ్లను పూర్తిగా దూరం పెట్టడం సమాజాన్ని ఆలోచింపజేయాల్సిన విషయం.

పూర్వకాలంలో కుటుంబం అంటే కలిసి ఉండడం, ఒకరిపై ఒకరు ఆధారపడటం. తల్లిదండ్రులు పిల్లల కోసం తమ జీవితాన్ని అర్పించేవారు. చదువు, ఉద్యోగం, పెళ్లి---అన్నీ వారి త్యాగాల ఫలితమే. అలాంటి తల్లిదండ్రులు వయస్సు మీదపడిన తర్వాత, పిల్లల దగ్గర ప్రేమతో, భరోసాతో జీవించాలని ఆశిస్తారు. కానీ నేటి యువత మాత్రం "మాకు స్పేస్ కావాలి, మా లైఫ్ మాకు ఉండాలి" అంటూ వారిని పక్కన పెట్టేస్తోంది.

అత్తమామల పరిస్థితి కూడా అంతే బాధాకరం. పెళ్లి అంటే రెండు మనుషుల కలయిక మాత్రమే కాదు, రెండు కుటుంబాల అనుబంధం. కానీ ఇప్పుడు పెళ్లిని కేవలం వ్యక్తిగత ఒప్పందంగా మార్చి, పెద్దవాళ్లను భారంగా భావించడం పెరుగుతోంది. "వాళ్లు ఉంటే మనకు స్వేచ్ఛ ఉండదు" అనే భావన వెనుక అసలు సమస్య స్వేచ్ఛ కాదని, సహనం లేకపోవడం, బాధ్యత తప్పించుకోవడమేనని చెప్పాలి.

వయస్సు ఈడిన తల్లిదండ్రులు, అత్తమామలు పిల్లలు దూరంగా ఉంటే ఎదుర్కొనే ఒంటరితనం మాటల్లో చెప్పలేనిది. అనారోగ్యం వచ్చినప్పుడు చూసుకునే వాళ్లు లేకపోవడం, మానసికంగా కుంగిపోవడం, చివరకు వృద్ధాశ్రమాలే ఆశ్రయంగా మారడం---ఇవి నేటి కుటుంబ వ్యవస్థ ఎదుర్కొంటున్న వాస్తవాలు. పిల్లలతో కలిసి ఉండాలన్న చిన్న కోరిక కూడా నెరవేరకపోవడం వారి జీవితాన్ని ఖాళీగా చేస్తోంది.

స్వేచ్ఛకు, బాధ్యతకు మధ్య సమతుల్యత అవసరం. కలిసి ఉండడం అంటే ఎప్పుడూ గొడవలే అని కాదు, పరస్పర గౌరవం, సంభాషణ ఉంటే సమస్యలు పరిష్కరించవచ్చు. పెద్దవాళ్ల అనుభవం యువతకు మార్గదర్శకం అవుతుంది. అదే విధంగా యువత ఆలోచనలను పెద్దవాళ్లు అర్థం చేసుకోవాలి.

స్వేచ్ఛ అనేది సంబంధాలను తెంచుకోవడం కాదు, వాటిని మానవీయంగా నడిపించడమే. ఈ నిజాన్ని యువత గుర్తించిన రోజే కుటుంబ బంధాలు బలపడతాయి, ఇప్పుడు కొంతమంది యువత పెద్దలను కుటుంబాలలో ఉండే కుటుంబ సభ్యులను సద్ది చెప్పడానికి ప్రయత్నిస్తే వారు చెప్పిన మాటలకు నాకు చెప్పకండి,"ఇది మా వ్యక్తిగత విషయం" అంటూ అందరినీ దూరం పెట్టేస్తున్నారు. వ్యక్తిగతం అన్న మాట వెనుక ఒంటరితనం దాగి ఉంది. పెళ్లి పూర్తిగా వ్యక్తిగతం కాదు. అది సామాజిక ఒప్పందం. కుటుంబం దూరమైనప్పుడు పెళ్లి బలహీనమవుతుంది. చిన్న సమస్య కూడా పెద్ద చీలికగా మారుతుంది.

ఈ విరిగిన బంధాల మధ్య నలిగిపోతున్నవారు పిల్లలు. పెద్దలు విడిపోతే అది వారి నిర్ణయం కావచ్చు. కానీ ఆ నిర్ణయం ప్రభావం పిల్లల జీవితాలపై పడుతుంది. ప్రేమ అంటే ఏమిటి? నమ్మకం అంటే ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం దొరకకుండా పెరుగుతున్న పిల్లలు రేపటి సమాజాన్ని ఎలా నిర్మిస్తారు? ఈ రోజు మనం ఒక పెళ్లిని తేలికగా తీసుకుంటే, రేపు ఒక తరం సంబంధాలపై నమ్మకం కోల్పోయి ఎదుగుతుంది. ఇది వ్యక్తిగత సమస్య కాదు,సామాజిక భవిష్యత్తుకు సంబంధించిన విషయం.

మీడియా, సినిమాలు కూడా ఈ పరిస్థితికి పరోక్షంగా కారణమవుతున్నాయి. తక్షణ భావోద్వేగాలు, అతిశయ ప్రతిస్పందనలు, విడాకులను విముక్తిలా చూపించే కథనాలు యువతపై ప్రభావం చూపుతున్నాయి. సహనం, త్యాగం, సర్దుబాటు వంటి విలువలు పాతబడ్డవిగా చూపబడుతున్నాయి. కానీ సమాజం నిలవాలంటే అవే పునాదులు. అవి లేకుండా ఆధునికత పేరుతో ముందుకు వెళ్తే అది పురోగతి కాదు, పతనం.

అయితే ఈ పరిస్థితికి పరిష్కారం ఉందా? ఉంది. కానీ అది చట్టాల్లో లేదు. కోర్టుల్లో లేదు. మన ఆలోచనల్లో ఉంది. పెళ్లిని వినియోగ వస్తువులా చూసే దృష్టి మారాలి. పాశ్చాత్య మోజును అర్థంతో, సందర్భంతో స్వీకరించాలి. అనుమానం పెంచుకునే బదులు సంభాషణ పెంచాలి. ఈగో కన్నా బంధాన్ని పెద్దదిగా చూడాలి. "నేను" అనే మాట కన్నా "మనము" అనే భావన బలపడాలి.చివరి మాట ఒక్కటే. పెళ్లి బంధాలు కూలిపోతున్నాయంటే అది కొందరి వ్యక్తిగత వైఫల్యంగా కొట్టిపారేయలేం. ఇది సమాజం ఎదుర్కొంటున్న నిశ్శబ్ద సంక్షోభం. ఈ రోజు మనం సర్దుకుపోవడాన్ని బలహీనతగా భావిస్తే, రేపు ఒంటరితనాన్ని శిక్షగా అనుభవించాల్సి వస్తుంది. పాశ్చాత్య మోజు, అనుమానం, ఈగో -- ఇవి నియంత్రించకపోతే కుటుంబ వ్యవస్థ కేవలం జ్ఞాపకంగా మిగిలిపోతుంది. ఆలోచించాల్సిన సమయం ఇదే. మారాల్సిన దిశను నిర్ణయించాల్సిన సమయం కూడా ఇదే.పెళ్లి బంధాలు కూలిపోతున్నాయంటే దానికి కారణం కాలం కాదు, మార్పు కాదు, ఆధునికత కాదు. కారణం మనం మనల్ని మోసం చేసుకుంటున్న తీరు. స్వేచ్ఛ పేరుతో బాధ్యతను వదిలేసి, హక్కుల పేరుతో త్యాగాన్ని తృణీకరించి, ఆధునికత పేరుతో ఓర్పును అవమానపరుస్తున్న సమాజం నుంచి ఇంకేం ఆశించగలం? నేటి పెళ్లి సంక్షోభం అనేది సహజ పరిణామం కాదు, అది మన ఆలోచనా దారిద్ర్యానికి అద్దం.

## పోచారం ఇంకా బిఆర్‌ఎస్‌లోనే ఉన్నాడని అంటారా?

**- స్పీకర్ తీరు చట్టసభలను అగౌరవ పరిచేలా ఉంది**

**- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆగ్రహం**

**నిజామాబాద్,జనవరి16( వెలుతురు):** చట్టసభల గౌరవాన్ని హక్కులను రక్షించాల్సిన అసెంబ్లీ స్పీకర్ భక్షకుడుగా మారడం శోచనీయమని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు , మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. స్పీకర్ జడ్జిమెంట్ రాష్ట్ర అసెంబ్లీ చరిత్రలో చీకటి రోజుగా అభివర్ణించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంకా బీఆర్‌ఎస్ పార్టీలోనే ఉన్నారని, పార్టీ మారినట్లు ఎలాంటి ఆధారాలు లేవని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీర్పునివ్వడం రాష్ట్ర చట్టసభల గౌరవాన్ని దిగజార్చిందని అన్నారు. నిజామాబాద్ జిల్లా రాజకీయాల్లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి పార్టీ ఫిరాయింపు చేసినప్పటికీ, అనర్హత వేటు వేయకపోవడం రాజ్యాంగ విరుద్ధమైన చర్యగా మారిందని అభిప్రాయ పడ్డారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం స్పష్టంగా ఉన్నా, దాన్ని అమలు చేయడంలో స్పీకర్ నిర్లక్ష్యం, ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తోందన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి అవలంబిస్తున్న ఈ అనైతిక రాజకీయ విధానం ప్రజలు ఇచ్చిన తీర్పుకు విరుద్ధమని దుయ్యబట్టారు. బిఆర్‌ఎస్ బీ ఫామ్ కింద గెలిచి, మంత్రిగా ఉన్నత పదవులు అనుభవించి, కాంగ్రెస్ పార్టీ లోకి ఫిరాయించిన పోచారం తాను బీఆర్‌ఎస్ కొనసాగుతున్నారని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. నిజంగా బిఆర్‌ఎస్ పార్టీలోనే ఉంటే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు తన చిత్తశుద్ధిని



చాటాలని డిమాండ్ చేశార. జీవిత చరమాంకంలో ఉన్న విలువ తీసుకోవద్దని పోచారానికి హితవు పలికారు. మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు కేటాయించకుండా ముందుకెళ్లడం ద్వారా కాంగ్రెస్ పార్టీ బీసీ లను మరోసారి వంచించిందని బాజిరెడ్డి గోవర్ధన్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను తగ్గించడం మరో ప్రజావ్యతిరేక నిర్ణయంగా మారిందని ఆరోపించారు. బీసీ వర్గాల హక్కులను కాలరాసేలా తీసుకున్న ఈ నిర్ణయం సామాజిక న్యాయ సూత్రాలకు పూర్తిగా విరుద్ధమని స్పష్టం చేశారు. బీసీ వర్గాలు రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న తరుణంలో, వారి ప్రాతినిధ్యాన్ని తగ్గించే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పుగా మారతాయని, కాంగ్రెస్ ప్రభుత్వ బీసీ వ్యతిరేక విధానానికి బీసీ లు రాబోయే ఎన్నికల్లో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## మద్యం సేవిస్తూ అన్నదమ్ముల గొడవ

**- పై అంతస్తు నుంచి తోసి అన్నను చంపిన తమ్ముడు**



**హైదరాబాద్,జనవరి16( వెలుతురు):** పండగ పూట హైదరాబాద్ నాచారంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. మద్యం సేవించే క్రమంలో జరిగిన చిన్న గొడవ అన్నదమ్ముల మధ్య ఘర్షణకు దారి తీసింది. మద్యం గ్లాస్ విషయంలో మొదలైన వాగ్వాదం తీవ్రస్థాయికి చేరడంతో తమ్ముడు అన్నపై దాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా కోపోద్రిక్తుడైన తమ్ముడు అన్నను మూడో అంతస్తుపై నుంచి తోసేయడంతో అన్నకు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా.. మర్గమధ్యంలో మృతి చెందారు. సమాచారం అందుకున్న నాచారం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు స్టీఫెర్డ్ రోహన్ సాయర్స్ (30), నిందితుడు లేనర్డ్ లయనెల్ సాయర్స్ (28)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనకు కారణమైన తమ్ముడు సాయర్స్‌ని పోలీసులు అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది.

## దాద్ పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ క్రీడోత్సవాలు





**మంచాల వెలుతురు జనవరి 16:**
మంచాల మండలం సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ క్రీడోత్సవాలు ఘనంగా నిర్వహించారు డిపి లెజెండ్స్ మరియుడిపీకింగ్స్ జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ లో డిపి లెజెండ్స్ కాంగ్రెస్ పార్టీ సీనియర్స్ గెలుపొంది విజయం సాధించి మొదటి బహుమతి అందుకున్నారు మొదటి బహుమతి 7వేల777రూపాయలు రెండవ బహుమతి 3వేల333 రూపాయలు బహుమతులు అందజేశారు ఈకార్యక్రమంలోక్రికెట్ టీం సభ్యులు కెప్టెన్ ఐలయ్య పాలకుర్ల శేఖర్ గౌడ్ నర్సింగ్ వెంకటరమణాగౌడ్ జి శ్రీధర్ నర్సింగ్ శేఖర్ గౌడ్ పి రవీందర్ ఎం లింగం ఎం రవీందర్ ఎం వేణు ఎన్ గణేష్ ఎం జగన్ గ్రామంలోని. పెద్దలుయువకులు తదితరులుపాల్గొన్నారు.

## సంక్రాంతి సంబరాలో భాగంగా వివిధ గ్రామాల్లో ఇంటి ముందు రంగ వల్లులు వేసిన మహిళలు



ఆరుట్ల గ్రామంలో ఇంటి ముందు రంగవల్లి చాలా గొప్పగా వేసిన మాధగోని శివాని




ఆరుట్ల గ్రామంలో ఇంటిముందు.రంగవల్లి చాలా గొప్పగా వేసిన అల్లంపల్లి అంజలి



దండు మైలారం గ్రామంలో తన ఇం టి ముందు రంగవల్లి గొప్పగా వేసిన చీమల ఆరాధ్య

**ఇబ్రహీంపట్నం వెలుతురు జనవరి 16:**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మకర సంక్రాంతి సంబరాల్లో భాగంగా వివిధ గ్రామాల్లో మహిళలు ఇంటి ముందు వివిధ రకాల రంగవల్లులు వేసి బొబ్బమ్మలు పెట్టి నవధాన్యాలు పోసి సంక్రాంతి పండుగ ఘనంగా జరుపుకున్నారు యువకులు చిన్నారులు గాలిపటాలు ఎగరవేసి క్రీడలు ని ర్వహించి గ్రామస్తులందరూ కలిసిమెలిసి సంతోషంగా సంక్రాంతి పండుగ జరుపుకున్నారు




## ముగ్గులను తిలకిస్తున్న చిన్నారి పాపలు దవన్ సాయి అద్రితి

బషీర్ బాగ్ వెలుతురు 16 జనవరి :రామంతపూర్ శ్రీరామ కాలనీ లోని ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులను చూస్తూ అలరిస్తున్న చిన్నారులు

## కొండేడు గ్రామంలో సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్ ఘన విజయం

**జడ్చర్ల వెలుతురు జనవరి 16:**
మహబూబ్నగర్ డిస్ట్రిక్ట్ జడ్చర్ల మండలం కొండేడు గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామస్థుల ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ టోర్నమెంట్‌కు గ్రామ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటుకున్నారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీల్లో సతీష్ క్యాప్టెన్‌గా ఉన్న జట్టు అద్భుతమైన ప్రదర్శనతో ప్రత్యర్థి జట్లను మట్టికరిపించి విజేతగా నిలిచింది. సతీష్ నాయకత్వంలో జట్టు సభ్యులందరూ సమన్వయంతో ఆడి విజయాన్ని సాధించడం విశేషం. అలాగే ఈ



టోర్నమెంట్‌లో దేవా తన అసాధారణ ఆటతీరుతో ప్రేక్షకులను ఆకట్టుకుని ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్ అవార్డును గెలుచుకున్నారు. ఆయన ప్రదర్శనకు క్రీడాభిమానుల నుంచి విశేషమైన ప్రశంసలు లభించాయి. ఈ కార్యక్రమం గ్రామంలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకునేలా చేసింది. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను గ్రామ పెద్దలు అభినందించారు.

## పటేల్ చెరువుతండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ క్రీడోత్సవాలు

### క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేసిన పటేల్ చెరువుతండా సర్పంచ్ మెగావత్ రాజ్యలక్ష్మి లక్ష్మణ్ నాయక్

**మంచాల వెలుతురు జనవరి 16:**
మంచాల మండలం సంక్రాంతి పండుగ సంబరాలో భాగంగా పటేల్ చెరువు తండాలో గ్రామపంచాయతీ వారి సహకారంతో ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా పటేల్ చెరువుతండా ప్రీమియర్ లీగ్ సీజన్ ఆధ్వర్యం లో క్రీడోత్సవాలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన క్రీడా మైదానం దాత టోర్నమెంట్ నిర్వాహకుడు పటేల్ చెరువు తండా సర్పంచ్ మెగావత్ రాజ్యలక్ష్మిలక్ష్మణ్ నాయక్ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు ఈ సందర్భం గా మాట్లాడుతూ క్రీడాకారులకు గ్రా మంలోని యువకులకు అన్ని విధాలుగా అండగా ఉంటూ ప్రోత్సహిస్తాను అనిఅన్నారు





ఈకార్యక్రమానికి ముఖ్య అతిధులు క్రీడా ప్రోత్సాహాని కి ముందుకు వచ్చిన దాతలుకాంగ్రె స్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మెగావత్ జివిలాన్ నాయక్ పి పి ఎల్ పౌ డర్ క్రాంతి కుమార్ మరియు జీవి లాల్ నాయక్ మొదటి బహుమతి దాత 5వ వార్డ్ మెంబర్ మెగావత్ రజిత అర్జున్ నాయక్ (శంకర్ టీం ) రెండో బహుమతి దాత చెన్నారెడ్డి గూడ మాజీ సర్పంచ్ చీమల జంగయ్య యాదవ్ మాజీ సర్పంచ్ (గోపాల్ ఎంప్లాయిస్ టీం)ట్రోఫీలు మరియు మెడల్స్ దాత4వ వార్డ్ సభ్యుడుమెగావత్ గణేష్ నాయక్ మరియు ఆంగోత్ లక్ష్మిగోపీనాథ్ ప్రజ్ఞ హాస్పిటల్ యాంజల్ క్రికెట్ కిట్ దాత మన్మోహన్ రెడ్డి క్రీడా మేనేజ్మెంట్ 6వవార్డ్ సభ్యుడు మెగావత్ కృష్ణవేణి లచ్చునాయక్ రాజు నాయక్ మరియుబద్దు నాయక్ఆర్గనైజింగ్ సపోర్టింగ్ సభ్యులునీర్మల్ కిరణ్ పాప శంకు నితిన్ చరణ్ శ్రావణ్ అరుణ్ కాబ్జా మరియు పటేల్ చెరువుతండా పెద్దలు యువకులుతదితరులు పాల్గొన్నారు

# ఘనంగా నోపా క్యాలెండర్ ఆవిష్కరణ

- లయన్స్ క్లబ్ లో నాయి ప్రతిభ పురస్కారాలు అందజేత
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న రిటైర్డ్ డి ఈ వనపర్తి లక్షపతి

**మహబూబాబాద్ వెలుతురు జనవరి 16:**
మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నాయి ప్రతిభ పురస్కారాలుస్థానిక లయన్స్ క్లబ్ లో నాయి బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు నోపాజిల్లా అధ్యక్షులు ఎలమందల కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ గత పదమూడు సంవత్సరాల నుంచి క్యాలెండర్ ఆవిష్కరణ నిర్వహిస్తున్నామని అదేవిధంగా పదవ తరగతిలో ఉత్తీర్ణులైనటువంటి విద్యార్థులకు పురస్కారాలు కూడా అందజేస్తున్నామనేటువంటి విషయాన్ని తెలియజేయడం జరిగింది ఈ క్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి రిటైర్డ్ డి ఈ వనపర్తి లక్ష పతి మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులు అనాదిగా వెనుకబడుతూ అనేక రంగాల్లో రాణించలేకపోతున్నారు దాని గల కారణం విద్య అనేటువంటి విషయాన్ని గుర్తుకు చేయడం జరిగింది విద్యలో ముందు ఉంటే ఏదైనా సాధించగలమని మన జీవిత గమనాన్ని మార్చేటువంటి శక్తి కేవలం విద్యకు మాత్రమే ఉందని కాబట్టి ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని వారు కోరడం జరిగిందిఈ క్రమంలో నాయి విద్యార్థులకు ఎలాంటి సహాయ సహకారాలు







కావాలన్న ఎల్లవేళలా అందిస్తారని పేర్కొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి మరొక ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి ఖానాపురం ఎంపీడీవో అద్వైత మాట్లాడుతూఎవరైనా ఎదగాలంటే చదువు ఒకటే మార్గమని తాను వివాహమైన తర్వాత కూడా ఐదు ఉద్యోగాలు సంపాదించాలని గ్రూప్ వన్ ఉద్యోగం సంపాదించడమే లక్ష్యంగా పెట్టుకొని ప్రతి ఒక్కరూ కూడా ఉన్నత స్థాయిలో ఎదిగిమంచి మంచి పేరు సంపాదించి ,ఇటు ఇంటికి అటు సంఘానికి పేరు తెచ్చి భవిష్యత్తులో సంఘ కార్యకలాపాలకు అండదండగా ఉండాలని పేర్కొన్నారు. తదుపరి పదవ తరగతిలో ఉత్తీర్ణులైనటువంటి విద్యార్థిని విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు సన్మానం ఏర్పాటు చేసి వారికి మెమెంటోలు ప్రశంస పత్రాలు అందించడం జరిగింది. అంతేకాకుండా ఇటీవల ఎన్నికల్లో గెలిచినటువంటి సర్పంచ్లకు మరియు వార్డు మెంబర్లకు వారు సన్మానం చేయడం జరిగింది ఇంకా ఈ కార్యక్రమంలో వనపర్తి సదానందం, జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిపాక మల్లయ్య, ఎడ్ల కొమురయ్య,ఉపాధ్యక్షులు లింగంపల్లి దయానంద్, ఉల్లందుల వెంకటేశ్వర్లు, కొండూరు వెంకన్న, జంపాల విక్రమ్ ,జంపాల గంగ, జంపాల యాకయ్య, ఎర్రనాగి రామ్మూర్తి,కుమ్మరి కుంట్ల మౌనేందర్ ,కుమ్మరి కుంట్ల కృష్ణమూర్తి , తక్కల్లపల్లి వీరభద్రం, నేల పోగుల దుర్గయ్య,ఉల్లందుల కనకయ్య , ఎర్నాగి రాంమూర్తి,జంపాల శ్రీనివాస్, తోపాటు ఇటీవల ఎన్నికల్లో ఎన్నికైన సర్పంచ్లు మరియు వార్డ్ మెంబర్లతో పాటు వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొనడం జరిగింది.

## ఎట్టకేలకు ఫయాజ్ నగర్, శ్రీరామ్ నగర్ కాలనీల్లో సీసీ డ్రైనేజీ పనులు ప్రారంభం....!

- ఎంపీ సురేష్ శెట్కార్, ఇంచార్జ్ చంద్రశేఖర్ సహకారంతో పనులకు శ్రీకారం...
- నేటితో కష్టాలు తీరానున్న కాలనీ వాసులు సమస్య...
- కాంగ్రెస్ పెద్దలకు, వార్డు అధ్యక్షులు ఎండీ. గౌస్ కు కృతజ్ఞతలు తెలిపిన కాలోని ప్రజలు...







**జహీరాబాద్ వెలుతురు జనవరి 16:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అల్లిపూర్ ప్రాంతం ఫయాజ్ నగర్ కాలనీతో పాటు శ్రీరామ్ నగర్ కాలనీలో నూతన సీసీ డ్రైనేజీ మురికి కాలువల నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కార్ జహీరాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి డా. ఏ. చంద్రశేఖర్, సమర్థవంతమైన నాయకత్వంలో వారి సహకారంతో ఈ అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది. ఈ పనులను 21వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ గౌస్ నేతృత్వంలో అధికారికంగా ప్రారంభించారు. కార్యక్రమంలో జహీరాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కండెం నర్సింలు, కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీ అశోక్, మస్జీద్ అధ్యక్షులు ఎండి. ముక్తార్ ముఖ్య అతిథులుగా హాజరై కొబ్బరికాయ కొట్టి డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఫయాజ్ నగర్, శ్రీరామ్ నగర్ కాలనీల్లో చాలా కాలంగా మురికి కాలువల సమస్య తీవ్రంగా ఉండడంతో వర్షాకాలంలో మురుగు నీరు రోడ్లపై నిలిచి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా సీసీ డ్రైనేజీ పనులు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ సమస్యను గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పనులు ప్రారంభింపజేసిన వార్డు అధ్యక్షులు మహమ్మద్ గౌస్ కృషి అభినందనీయమని కొనియాడారు. అలాగే రాబోయే రోజుల్లో 21వ వార్డులో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు తదితర మౌలిక వసతులను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేస్తూ, ఎల్లప్పుడూ ప్రజల్లోనే ఉంటూ సేవలందిస్తున్న నాయకుడు మహమ్మద్ గౌస్ అని నాయకులు ప్రశంసించారు. అలాగే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 21వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కాలనీవాసులను కోరారు. అనంతరం కాలోనివాసులు మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపిన కాంగ్రెస్ నాయకత్వానికి, వార్డు అధ్యక్షులు ఎండీ. గౌస్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు ఎండి. అఖీల్, ఎండి. అహ్మద్, ఎండి. ఆలీం, మన్సూర్, జావీద్ భాయ్, అర్షద్ భాయ్, గౌస్ (గైబు భాయ్), బాబా భాయ్, షహాబుద్దీన్ భాయ్, యూసఫ్, ఇస్సాం తదితరులు పాల్గొన్నారు. డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపిన కాంగ్రెస్ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## చూపరులను ఆకట్టుకున్న చత్రపతి శివాజీ మహారాజ్ త్రీడీ ముగ్గు

**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 16 :**
నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణ పరిధిలోని సాయిబాబా కాలనీలో లావణ్య--మహాదేవరావు దంపతులు తమ ఇంటి ముందర వేసిన చత్రపతి శివాజీ మహారాజ్ త్రీడీ ముగ్గు చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పండుగ విశిష్టతతో పాటు చరిత్రాత్మక గొప్పతనాన్ని ప్రతిబింబించేలా ఈ ముగ్గును తీర్చిదిద్దారు. సాంప్రదాయ రంగులు, ఆధునిక త్రీడీ కళాశైలిని సమ్మేళనం చేస్తూ రూపొందించిన ఈ ముగ్గు కాలనీవాసుల ప్రశంసలు అందుకుంది. ముగ్గులో చత్రపతి శివాజీ మహారాజ్ రూపాన్ని జీవంతంగా ప్రతిబింబించడంతో అందరి దృష్టిని ఆకర్షించింది. గత పది సంవత్సరాలుగా ప్రతి సంక్రాంతికి ఇలాంటి ప్రత్యేక ముగ్గులు వేస్తూ పండుగ ఆనందాన్ని పంచుకుంటున్నామని లావణ్య--మహాదేవరావు దంపతులు తెలిపారు. సంక్రాంతి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన ఈ త్రీడీ ముగ్గు పట్టణంలో ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంది.



## ఖేడ్ కళకళలాడిన కనుమ ముగ్గులు





**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 16 :**
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ కళకళలాడిన కనుమ ముగ్గులు తెల్లవారుజామునే మహిళలు ఇంటి కనుమ పండుగ సందర్భంగా నారాయణఖేడ్ పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో ముగ్గులు ముందు అందమైన కనుమ ముగ్గులు వేసి పండుగ శోభను పెంచారు. సూర్యుడు, వివిధ రకాల పంటల ఆకృతులతో రూపొందించిన సంప్రదాయ ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## ఓడియమ్మ బంటి ముగ్గు

**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 16 :**
సంగారెడ్డి జిల్లా :- నారాయణ్ ఖేడ్ పట్టణానికి చెందిన పట్లోళ్ల అద్విక్ రెడ్డి ఓడియమ్మ బంటి ముగ్గును మంచి డిజైన్ లో వేశారు కాగా ఈ ముగ్గు ఇన్స్టా గ్రామ్ లో వైరల్ అవుతున్నదని పలువురు పట్లోళ్ల అద్విక్ రెడ్డి ప్రశంసించారు.



# సంక్రాంతి సందర్భంగా రేఖ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ముగ్గుల పోటీలు నిర్వహించిన రేఖ బోయలపల్లి

**- తెలంగాణ ప్రదేశ్ మహిళా ఉపాధ్యక్షురాలు, కాంగ్రెస్‌డా. రేఖ బోయలపల్లి**



**తుంగతుర్తి వెలుతురు జనవరి 16:**
శుభకరమైన సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని, రేఖ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా, అడివెముల గ్రామంలో ఘనంగా రంగోలి పోటీలు నిర్వహించబడ్డాయి. మన గ్రామీణ జీవనానికి ప్రాణం పోసే సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించడం ఫౌండేషన్‌కు ఎంతో ఆనందం, గర్వకారణం. మన సంప్రదాయాలు, సంస్కృతి, ఆత్మీయతలను ప్రతిబింబించేలా ఈ కార్యక్రమం సాగింది. పండుగకు స్వగ్రామాలకు వచ్చిన మహిళలు, చిన్ననాటి స్నేహితులను కలుసుకొని, రంగుల మధ్య ఆనందం, అనుబంధాన్ని పంచుకున్న క్షణాలు అందరికీ చిరస్మరణీయంగా నిలిచాయి. గ్రామమంతా పండుగ వాతావరణాన్ని సృష్టించిన ఈ రంగోలి పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డా. రేఖ బోయలపల్లి గారు, డైరెక్టర్ మద్ది పద్మ గారితో కలిసి, మహిళల సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ మొత్తం 50 బహుమతులు అందజేశారు. వీటిలో గ్రైండర్లు, ఎలక్ట్రిక్ రైస్ కుకర్లు, ప్రెషర్ కుకర్లు, ఇతర కిచెన్ ఉపకరణాలు, హాట్ బాక్స్‌లు ఉన్నాయి. 2019 నుంచి రేఖ చారిటబుల్ ఫౌండేషన్ గ్రామీణ స్థాయిలో సంప్రదాయాల పరిరక్షణ, మహిళా సాధికారత, సామాజిక అనుబంధాల బలోపేతం లక్ష్యంగా ఇటువంటి సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలను నిరంతరంగా నిర్వహిస్తోంది. ఈ సంక్రాంతి వేడుక కూడా అడివెముల గ్రామ ప్రజలకు ఒక అర్థవంతమైన, స్మరణీయ ఘట్టంగా నిలిచింది.



## నూనెగూడెం ఉపసర్పంచ్ కి ఘన సన్మానం




**గుండాల, జనవరి 16(వెలుతురు):**
గుండాల మండలంలోని నూనెగూడెం గ్రామంలో నూతనంగా ఎన్నికైన ఉపసర్పంచ్ అండెం ప్రశాంత్ రెడ్డిని 2006--2007 పదవ తరగతి బ్యాచ్ బాల్యమిత్రులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ, యువతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. నాయకత్వం అనేది అధికారం కాదని, అది బాధ్యత అని పేర్కొంటూ, ఆ బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించాలని కోరారు. కార్యక్రమంలో వల్లాల రాంమూర్తి యాదవ్, అండెం వెంకట్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మచ్చ వివాకర్ రెడ్డి, కంబాల మధు, కోల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమరైతు అవార్డు గ్రహీత పాల పరశురాం జన్మదిన వేడుకలు



**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 16:**
నార్కట్ పల్లి పట్టణ కేంద్రానికి చెందిన ఉత్తమ రైతు అవార్డు గ్రహీత పాల పరశురాం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో బోడ శంకర్ లింగాల దేవేందర్ మంద శంకర్ లింగాల నవీన్ మేడి స్వామి మంద దుర్గేష్ నవీన్ రేణిగుంట నవీన్ వాసు తదితరులు పాల్గొన్నారు.

## ఎబివిపి రాష్ట్ర అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన రావుల కృష్ణ కి అభినందనలు తెలియజేసిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్



**మిర్యాలగూడ వెలుతురు జనవరి 16:**
విద్యార్థి,యువత నిరుద్యోగ సమస్యల పరిష్కారానికై ఎన్నో ఏళ్లుగా ఉద్యమిస్తున్న రావుల కృష్ణ గారిని ఎబివిపి రాష్ట్ర అధ్యక్షులుగా నియమించడం పట్ల బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అభినందనలు తెలియజేశారు. విద్యార్థి దశ నుంచే అనేక సమస్యలపై అలుపెరుగని పోరాటం చేయడమే గాకుండా,నిరుద్యోగ సమస్యలపై ఉద్యమించిన బీసీ బిడ్డ రావుల కృష్ణ గారు భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమించాలని కోరారు.

## సైబర్ మోసాలపై గుండాల మండల ప్రజలకు ఎస్సై ఎం. తేజం రెడ్డి హెచ్చరిక

**గుండాల, జనవరి 16 (వెలుతురు):**




గుండాల మండల పరిధిలో సైబర్ నేరాలు రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుండాల మండల ఎస్సై ఎం.తేజం రెడ్డి హెచ్చరించారు. సోషల్ మీడియాను వేదికగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన తెలిపారు.ఇటీవల వాట్సాప్ గ్రూపులు, వ్యక్తిగత చాట్స్‌లో "నాకు రూ.5 వేలు వచ్చాయి.మొదట నకిలీ అనుకున్నాను. మీరూ ప్రయత్నించండి.ఈ లింకును పది మందికి ఫార్వర్డ్ చేయండి" అంటూ వస్తున్న సందేశాలు పూర్తిగా మోసపూరితమైనవని స్పష్టం చేశారు.ఇలాంటి లింకులను క్లిక్ చేసిన వెంటనే మొబైల్ ఫోన్ హ్యాక్ అయ్యే ప్రమాదం ఉండటంతో పాటు, బ్యాంక్ ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్లే అవకాశం ఉందన్నారు.ఈ తరహా మోసాల ద్వారా బాధితుల ఖాతాల నుంచి డబ్బును అక్రమంగా విత్‌డ్రా చేస్తున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయని తెలిపారు.ప్రజలు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులు, ఆఫర్లు, బహుమతి సందేశాలపై నమ్మకం పెట్టుకోవద్దని సూచించారు.ముఖ్యంగా ప్రభుత్వ పథకాలు, నగదు బహుమతుల పేరుతో వచ్చే లింకులను పూర్తిగా దూరంగా ఉంచాలని, ఏవైనా అనుమానాస్పద సందేశాలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గుండాల మండల ఎస్సై ఎం. తేజం రెడ్డి ప్రజలను కోరారు.

## కాంగ్రెస్ పార్టీ వార్డ్ మెంబర్ వంగాల అవినాష్ ఆధ్వర్యంలో రంగమ్మ గూడెం లో ఘనంగా ముగ్గుల పోటీ



**రామన్నపేట వెలుతురు జనవరి 16:**
యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామపంచాయతీ రంగమ్మ గూడెం విలేజ్ లో కాంగ్రెస్ పార్టీ పదో వార్డు సభ్యులు వంగల అవినాష్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు ఈ ముగ్గుల పోటీలో గెలుపొందిన మహిళలకి అవినాష్ కు తోచిన ఆర్థిక సహాయంతో మహిళలకు బహుమతి ప్రధానం అందజేయడం జరిగింది ఫస్ట్ ప్రైస్ మాంద్ర పూజ, సెకండ్ ప్రైస్ మద్దె గళ్ళ ఉమా ,థర్డ్ ప్రైస్ పల్సం సంతోష విజేతలుగా గెలుపొందారు అనంతరం అవినాష్ మాట్లాడుతూ రంగమ్మ గూడెం మహిళలు చైతన్యవంతులుగా ఎదగాలని రాబోయే రోజులలో మహిళలు ఉన్నత స్థాయికి రావాలని అన్నారు అవినాష్ ఆధ్వర్యంలో వారికి ప్రైస్ లు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హొంగార్డు శ్రీశైలం యాదవ్ రావడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ముద్రబోయిన మల్లయ్య, వంగాల ఉపేందర్ ముద్రబోయిన ఆంజనేయులు, ముద్ర బోయిన లింగస్వామి మద్దె గళ్ళ శీను ,మద్దె గల్ల ఉప్పలయ్య కొంతమంది గ్రామ యువకులు. తదితరులు పాల్గొన్నారు




## ఔరవాణిలో ముగ్గుల పోటీలు నిర్వహించిన సామాజిక ఉద్యమకారుడు ముప్పిడి మారయ్య



**నార్కట్పల్లి వెలుతురు జనవరి 16:**
నార్కట్పల్లి మండలంలోని ఔరవాణి గ్రామంలో ప్రముఖ సామాజిక సేవకుడు సర్పంచ్ కంటెస్టెంట్ అభ్యర్థి ముప్పిడి మారయ్య ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. గ్రామంలో ఉన్నటువంటి మహిళలందరూ పాల్గొనగా మొదటి బహుమతి గెలిచిన వారికి ఎడ్ల యాదగిరి రెడ్డి 516 రూపాయలు ఇవ్వడం జరిగింది. ద్వితీయ బహుమతికి516 రూపాయలు బహుమతి ఇచ్చి వారిని ఎంకరేజ్మెంట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రూపాని సత్యనారాయణ, బైరు అశోక్, పెద్ది రాములు, కాలం సుభాష్ రెడ్డి, ముప్పిడి ఎల్లయ్య మాజీ ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ప్రతిష్ట భూమి పూజ



**గుండాల, జనవరి 16 (వెలుతురు):**
గుండాల మండలంలోని వెల్మజాల గ్రామంలో పాల సెంటర్ వద్ద గౌడ యూత్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ప్రతిష్ట భూమి పూజ కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కురిమిళ్ళ కవిత శ్రీను ముఖ్య అతిథిగా హాజరై కొబ్బరికాయ కొట్టి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత మాత ముద్దుబిడ్డ, తొలి తెలుగు చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్ర ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిందన్నారు. తెలంగాణకే తిరుగుబాటు స్ఫూర్తిని అందించిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని పేర్కొన్నారు.గౌడ జాతి గర్వకారణుడైన, తెలంగాణ బహుజన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో బహుజనులంతా రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ఉండి ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షించారు.అనంతరం గౌడ సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కచ్చిగళ్ల మహేందర్, గౌడ సంఘం అధ్యక్షుడు మొరిగాల బాలమల్లు, ఉపాధ్యక్షుడు లోడ సత్తయ్య, గౌడ యూత్ అధ్యక్షుడు మొరిగాల ఉపేందర్ గౌడ్, ఉపాధ్యక్షుడు అయితగాని బాలు గౌడ్, గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి రావుల అనిల్ కుమార్ గౌడ్, కోశాధికారి నలమాస భవదీష్, భరత్, మాజీ ఎంపీపీ సంగి వేణు, మాజీ సర్పంచ్ సంగి బాలకృష్ణ, మేకల రమేష్, మాజీ ఉపసర్పంచ్ సింగారం పాండు, పంజాల వెంకటేష్, సంగి భాస్కర్, మాధవరెడ్డి, నల్లతీగ రామకృష్ణలతో పాటు గౌడ సంఘం కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, వివిధ కులాల పెద్దలు, విగ్రహ ప్రతిష్టాపన కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సర్పంచి గా గెలిచిన గర్దాస్ విక్రమ్ సన్మానించిన బాల్యమిత్రులు



**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 16:**
గ్రామం ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్దాస్ విక్రమ్ ను సన్మానించిన సహచర విద్యార్థులు గ్రామ సర్పంచ్ గా అత్యధిక మెజారిటీ తో గెలిచిన గర్దాస్ విక్రమ్ ని మర్యాదపూర్వకంగా కలిసి తమతో చదివిన విద్యార్థి గ్రామ సర్పంచ్ కావడంతో తనతోపాటు చదువుకున్న విద్యార్థులు కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేసి తదినంతరం సన్మానించారు.

## కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

**కొత్తకోట,జనవరి16( వెలుతురు):**
కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటన శుక్రవారం అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటలో జరిగింది. ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్ ఘాట్ రోడ్డులో కొండపై నుండి కిందకు దిగుతున్న కారు ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం ధ్వంసమయ్యింది. అయితే పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఘాట్ రోడ్డుపై సూచిక బోర్డులు లేకపోవడంతోనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న చర్యను గ్రామీణ ప్రజలు తిప్పి కొట్టాలి.

**- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి.**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 16:**
పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రను గ్రామీణ ప్రజలు తిప్పి కొట్టాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు. జనంపల్లి గ్రామంలో గ్రామ శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ రాష్ట్రాలపై భారాన్ని మోపుతూ కేంద్ర



ప్రభుత్వ బాధ్యత నుండి తప్పుకునే ప్రయత్నం చేస్తూ పేరును సైతం మార్చే కుట్ర చేస్తుంది. అన్నారు. గ్రామాల్లో పేదలు వ్యవసాయ కూలీలకు కాస్త ఉపాధి, ఆర్థిక వెసులుబాటు ఆత్మగౌరవం కలుగుతుందని ఉపాధి హామీ చట్టాన్ని రూపుమాపేందుకు ప్రయత్నిస్తున్న బిజెపి కుట్రను తిప్పి కొట్టాలని అన్నారు. మాజీ ఎంపిటిసి వేమవరపు సుధీర్ బాబు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం గ్రామ శాఖ కార్యదర్శి పులి బిక్షమయ్య, నాయకులు పండుగ రాజమల్లు సంగిశెట్టి మార్కండేయ మాజీ సర్పంచి రాచమల్ల పర్వతాలు, అక్కెనపల్లి వీరయ్య, వార్డు సభ్యులు పండుగ రజిత, అక్కెనపల్లి కలమ్మ, సంగిశెట్టి శివాజీ, అక్కెనపల్లి శివ, ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు కందుల హనుమంతు, సిఐటియు మండల నాయకులు వంగాల మారయ్య, దేశపాక రవి,శ్రీకృష్ణ, పుట్టల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# జనరల్ వార్తలు

## పాలింకర్ సంతోష్ ఆధ్వర్యంలో ఘనంగా ముగ్గుల పోటీలు

**జహీరాబాద్ వెలుతురు జనవరి 16:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని హమాలికాలని పెద్దమ్మ తల్లి దేవాలయంలో శుక్రవారం నాడు ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. యువ నాయకులు పాలింకర్ సంతోష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం స్థానిక మహిళల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపింది. మన భారతీయ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ముగ్గుల కళను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న మహిళలు వివిధ రకాల రంగురంగుల ముగ్గులను వేసి దేవాలయ ప్రాంగణాన్ని ఆకర్షణీయంగా మలిచారు. సంప్రదాయ విలువలు ప్రతిబింబించేలా రూపొందించిన ముగ్గులు అందరి దృష్టిని ఆకర్షించాయి. పోటీల అనంతరం ఉత్తమ ముగ్గులు వేసిన వారిని ఎంపిక చేసి మొదటి, రెండో, మూడో బహుమతులను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. బహుమతులు అందుకున్న మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాలింకర్ సంతోష్ మాట్లాడుతూ, మహిళల కళాత్మక ప్రతిభను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు, పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పోటీలను వీక్షించారు. విజేతలకు బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. ముగ్గుల పోటీలు ప్రాంతంలో పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

## జాడిమల్కాపూర్‌లో 26వ పాత పంటల జాతర ఘనంగా నిర్వహణ

**- సేంద్రియ వ్యవసాయం, భూమి సంరక్షణ,**
**పాత చిరుధాన్యాల ప్రాముఖ్యతపై రైతుల అవగాహన...**





**జహీరాబాద్ వెలుతురు జనవరి 16:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లి మండలంలోని జాడిమల్కాపూర్ గ్రామంలో జనవరి 16న డెక్కన్ డెవలప్మెంట్ సొసైటీ, పస్తాపూర్ వారు 26వ పాత పంటల జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 250 మంది పాల్గొన్నారు. ఊరేగింపుతో గ్రామ సర్పంచ్, వార్డ్ మెంబర్లు, స్థానిక పెద్దలు, జాడిమల్కాపూర్ సంఘం సభ్యులు జాతర ప్రారంభాన్ని నిర్వహించారు. చుక్కమ్మ, డిడియస్ మాట్లాడుతూ 42 ఎకరాలలో చిరుధాన్యాల పంటలు పండిస్తున్నామని, సర్కార్ ఎరువులు వాడకుండా పాత పంటల పెంపకమే మన లక్ష్యం అని పేర్కొన్నారు. వినయ్ కుమార్, రాజు, సర్పంచ్ భూశక్తి, పంటలు, ఆరోగ్యం కాపాడుకోవడానికి పాత పంటల ప్రాముఖ్యతను వివరించారు. మహేష్, గ్రామ పంచాయతీ సెక్రటరీ ఎన్.పి.యం వేప నూనె కషాయాలు, పాత పంటల ప్రాముఖ్యతపై అవగాహన ఇచ్చారు. రాజేంద్ర రెడ్డి, ఎస్.ఐ. చిరాగ్పల్లి సేంద్రీయ వ్యవసాయం, పాత పంటల వంటలు తినడం వల్ల ఆరోగ్యం మెరుగవుతుందని, కరోనా వంటి వ్యాధుల నుండి రక్షణ లభిస్తుందని తెలిపారు. డా. దివ్యా, డిడియస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సర్కార్ రసాయన ఎరువుల ప్రభావం భూమిలో 50 సంవత్సరాలపాటు ఉంటుందని, భూశక్తి, నీటి, వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని చెప్పారు. రైతులు సేంద్రియ వ్యవసాయం వైపుకు మొగ్గు చూపడం సానుకూలమని, శిక్షణ ద్వారా కషాయాలు తయారీ, పంటల సంరక్షణకు సహకరించనున్నట్లు వెల్లడించారు.

## జహీరాబాద్ ఎన్నికల రిజర్వేషన్లలో ఎస్సీ-ఎస్టీ స్థానాల అన్యాయం

**- అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించిన ఎమ్మెల్యే మాణిక్ రావు...**



**జహీరాబాద్ వెలుతురు జనవరి 16:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మునిసిపాలిటీ 37 వార్డుల రిజర్వేషన్లలో షెడ్యూల్ క్యాస్ట్ మరియు షెడ్యూల్ ట్రైబల్ వర్గాలకు కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగిందని ఎమ్మెల్యే కొణింటి మాణిక్ రావు తెలిపారు. సమస్య పరిష్కారం కోసం సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంలో, రాజ్యాంగం ప్రకారం ఎస్సీలకు 15%, ఎస్టీలకు 7% వార్డులను పెంచేలా సవరణ చేయాలని వినతి పత్రం సమర్పించారు. సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాణిక్ రావు కోరారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తంజిం, సీనియర్ నాయకులు నామ రవికిరణ్, మాజీ పట్టణ అధ్యక్షులు మొహియుద్దీన్, వెంకట్, యువ నాయకులు ముర్తుజా, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ శతాబ్ది ఉత్సవాలు యువతకు భావజాలాన్ని పరిచయం చేసే వేదిక

**- సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్...**

**జహీరాబాద్ వెలుతురు జనవరి 16:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాలు కేవలం వేడుకలుగా కాకుండా, కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను, ఆ ఉద్యమం కోసం ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలను స్మరించుకునే చారిత్రాత్మక సందర్భమని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటం నుంచే కమ్యూనిస్టులు ప్రజల పక్షాన నిలబడి బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారని ఆయన గుర్తు చేశారు. అనేక ఉద్యమాల్లో కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషించారని, స్వాతంత్ర్యానంతరం కూడా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, పేద ప్రజల హక్కుల పరిరక్షణ కోసం సిపిఐ నిరంతరం ముందుండి పోరాటాలు సాగించిందని తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర త్యాగాలతో ముడిపడి ఉందని పేర్కొన్న సయ్యద్ జలాలుద్దీన్, దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమాలు, కార్మిక ఉద్యమాలు, భూ పోరాటాలు, ప్రజాస్వామ్య హక్కుల కోసం సాగిన ఉద్యమాల్లో నాలుగు వేల మందికి పైగా కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ ప్రాణాలను అర్పించారని చెప్పారు. ఆ అమరుల త్యాగాల పునాదిపైనే నేటి ప్రజాస్వామ్య హక్కులు, కార్మిక చట్టాలు, భూ హక్కులు నిలబడి ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రాంతంలో వెట్టిచాకిరీ నిర్మూలన, భూమి కోసం జరిగిన భూ పోరాటాలు, జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాల్లో అనేక మంది కమ్యూనిస్టు కార్యకర్తలు అమరులయ్యారని గుర్తు చేశారు. వారి రక్తంతో రాసిన చరిత్రే నేటి తరాలకు మార్గదర్శకంగా నిలుస్తోందని, ఆ త్యాగాలను మరచిపోతే చరిత్రకు ద్రోహం చేసినట్టేనని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు, ప్రజా రంగ సంస్థల ప్రైవేటీకరణ, ప్రజాస్వామ్య హక్కులపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయాల్సిన బాధ్యత కమ్యూనిస్టు పార్టీపై మరింత పెరిగిందని చెప్పారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడటమే కమ్యూనిస్టుల మార్గమని, అదే భావజాలంతో సిపిఐ ముందుకు సాగుతోందని తెలిపారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాలు యువతకు కమ్యూనిస్టు భావజాలాన్ని పరిచయం చేసే గొప్ప వేదికగా నిలుస్తాయని, పార్టీ చరిత్రను, అమరుల త్యాగాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలందరిపై ఉందని అన్నారు. ఈ ఉత్సవాలకు జిల్లావ్యాప్తంగా ప్రజలు, కార్మికులు, రైతులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపు ఓటములు సహజం - తలరి సబితా స్వరాజ్

**- తలరి స్వరాజ్ మెమోరియల్ వాలీబాల్.1**
**విజేతగా ఇస్మాయిల్ టీం చెన్నై రైల్వేస్...**







**జహీరాబాద్ వెలుతురు జనవరి 16:**

వాలీబాల్ అంటేనే ఏనాలేని అభిమానం ప్రదర్శిస్తూ జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో ఏక్కడ వాలీబాల్ టోర్నీలు జరిగిన టక్కున హాజరయ్యే జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు ఆనతికాలంలోనే తమ మధ్యలో నుంచి వెళ్లిపోవడం బాధాకరం అని తలరి సబితా అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం పరిది కోహిర్ మండలంలోని రాజినెల్లి గ్రామంలో స్వర్గీయ తలరి స్వరాజ్ మెమోరియల్ అంతరాష్ట్ర వాలీబాల్.1 సీజన్ లో భాగంగా జరిగిన పోటీలను వారి కుటుంబ సభ్యులు రిబ్బన్ కత్తారించి ప్రారంభించారు. టోర్నీలో మొత్తం 8 జట్లు పాల్గొన్నాయి. వారిని రెండు గ్రూపులుగా వర్గీకరించి పోటీలు నిర్వహించారు. సౌత్ సెంట్రల్ రైల్వేస్, పూణే ఇన్కమ్ టాక్స్, చెన్నై ఇన్కమ్ టాక్స్, నాసిక్ ఆర్మీ, పాండ్య బెంగళూరు, అమాన్ క్లబ్ బిడ్, లతూర్ గోండ్వాన, మైసూర్ ఆర్మీ లు రసవత్తరంగా పోటీపడ్డాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు సరైన సౌకర్యాలు, వసతులు కల్పిస్తే దేశం పేరును ప్రపంచ వ్యాప్తం చేస్తారని, దివంగత స్వరాజ్ ఆశయం మేరకు వారి జ్ఞపకార్థం ఈ యొక్క టోర్నీని నిర్వహించడం జరిగిందని, దీనిని ప్రతి ఏడాది ఇంతకంటే రెట్టింపు స్థాయిలో నిర్వహిస్తామని అన్నారు. టోర్నీలో విజేతగా నిలిచిన రాజినెల్లి ఇస్మాయిల్ టీం(చెన్నై రైల్వేస్) కు 50 వెయ్యిలు, టొర్నీ రన్నరప్ ట్రిపుల్ ఎన్ లడ్డు(పూణే ఇన్కమ్ టాక్స్) కు 30 వెయ్యిల పురస్కారంతో పాటు ట్రాఫి, మూడవ స్థానంలో అమాన్ క్లబ్ బిడ్ నాగ్ పూర్ కు 15 వెయ్యిలు, నాలగవ స్థానంలో నిలిచిన కుమార్ బెంగళూరు జట్టుకు 5 వెయ్యిల నగదు బహుమానం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సినీయర్ నాయకులు మ్యాతరి ఆనంద్, మోషే అభినవ్ డేనియల్, మోషే అభిషేక్, నిర్వాహక సభ్యులు ధనరాజ్, మధు, సుకుమార్, మధుకర్, నవీన్, తలారి ప్రియాంక, సర్పంచ్ అమృత పటేల్, ఉప సర్పంచ్ మహిపాల్ భాగ్యమ్మ, చిటకరి భాస్కర్, డప్పు దేవయ్య, ఈశ్వరప్ప పటేల్, విష్ణువర్ధన్ రెడ్డి, రాజు వర్ధన్ రెడ్డి, ప్రకాష్ పాస్టర్, మధు పాస్టర్, రాజనెల్లి సంఘ కాపరి సామెల్ పాస్టర్, డప్పు విద్యాసాగర్ ఎం డి ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎమ్మార్వో కి వినతి పత్రం

**చిట్యాల వెలుతురు న్యూస్ నల్గొండ జిల్లా జనవరి 16:**




మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు చట్టభద్రతతో కూడిన 42% శాతం రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలని చిట్యాల ఎమ్మార్వో విజయ మేడం కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, ఎడ్ల మహలింగం మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలు ఇచ్చిన మాట ప్రకారం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేసి ఎన్నికలకు వెళ్లాలని కోరారు. జనాభా ప్రకారం విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లతో పాటు స్థానిక సంస్థల మరియు మున్సిపల్ రిజర్వేషన్లకు శాశ్వత పరిష్కారం లభించడానికి రాజ్యాంగ సవరణ చేయాలి. బీసీలు ఈ రాష్ట్రంలో రాజకీయంగా 14% గిట్ల దాటలేదంటే రాజకీయంగా ఎంత వెనుకబడ్డారో అర్థం చేసుకోవచ్చు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 243- డి 6 ప్రకారం స్థానిక సంస్థలోని బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగ అధికారం ఇచ్చింది. కావున అసెంబ్లీలో చట్టం చేశారు. జీవో తీసి వెంటనే ఎన్నికలకు వెళ్లాలి. ఎందుకంటే జనాభా లెక్కలు ఉన్నవి అసెంబ్లీలో చట్టం చేశారు అలాగే సుప్రీంకోర్టు అగ్ర కులకు 10శాత్తం రిజర్వేషన్లు పెట్టినప్పుడు 50% సీలింగ్ ఎత్తివేసింది. పైగా ఇందిరా సహనీ కేసులో ఎంపరికల్ డాటా ఉంటే 50% సీలింగ్ ను అధిగమించవచ్చునని సుప్రీం కోర్టు తీర్పు కూడా ఉన్నది. ఇప్పుడు అన్ని కోణాల్లో చూస్తే కేసు గెలిచే అవకాశం ఉంది. చట్ట ప్రకారము, న్యాయప్రకారము రాజ్యాంగపరమైన అవరోధాలు లేవు కావున చివరకు సుప్రీంకోర్టులో కేసు గెలుస్తుంది. ఎందుకంటే రిజర్వేషన్లు పెంచడానికి న్యాయపరమైన చట్టపరమైన రాజ్యాంగపరమైన అవరోధాలు ఏమీ లేవు కేసు బలంగాముంది. రిజర్వేషన్లు పెంచడానికి కులాల వారీగా లెక్కలు తీశారు. అసెంబ్లీలో చట్టం చేశారూ. ఈ కేసు రాజ్యాంగపరంగా బలంగా యుంది. రాజ్యంగంలోని 243-డి-6 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్లను నిర్ణయించే అధికారం ఉంది. దీని ప్రకారం జీవో జారీ చెయ్యాలి. మండల్ కమిషన్ కేసు సందర్భంగా 9 మంది జడ్జిల ధర్మాసనం ప్రకారం - జనాభా లెక్కలు ఉంటే దాని అనుగుణంగా రిజర్వేషన్లు పెంచవచ్చు అని తీర్పు చెప్పింది. కనుక ప్రభుత్వం బీసీలకు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, బీసీ యువజన సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎడ్లమహాలింగం,మనీల్,రాజారాం, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం అవలంబించే కార్మిక కర్షక వ్యతిరేక విధానాలు నిరసించండి

**- వ్య.కా.స, సీఐటీయూ, రైతు సంఘం**
**జిల్లా వ్యాప్త కార్మిక, కర్షక యాత్ర.**

రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 16: కేంద్ర బిజెపి ప్రభుత్వం అవలంబించే కార్మిక, రైతు,వ్యవసాయ కూలీ, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ఉద్యమించాలని వ్య.కా.స, రైతు సంఘం, సిఐటియు జిల్లా కార్యదర్శులు కొండమడుగు నర్సింహ్మా, మాటూరి బాలరాజు,కల్లూరి మల్లేశం, పిలుపునిచ్చారు. లేబర్ కోడ్స్,విబిజి రాంజి,చట్ట, జాతీయ విత్తన, విద్యుత్ సవరణ బిల్లుల రద్దుకై జరిగే దేశ వ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా మూడు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్మిక కర్షక యాత్ర శుక్రవారం మండల కేంద్రానికి చేరుకోగ స్థానిక సుభాష్ కేంద్రంలో జరిగిన సభలో మాట్లాడుతూ గత 11 సం,, కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాయడమే కాక రాష్ట్రాల హక్కులను హరిస్తూ చట్టాలను చేసింది. ఓవైపు ప్రజా సంక్షేమం వల్లిస్తూనే పాలనలో కార్పోరేట్ సంస్థలకు రూ.16 లక్షల కోట్ల రాయితీ ఇచ్చింది చివరికి ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని, అంబానీ వంటి బడా పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నది. అత్యంత ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్ లను అమలు, విద్యుత్ సవరణ చట్టం, విత్తన బిల్లు, వి బి జి రామ్ జి చట్టం , బీమా రంగంలో వంద శాతం విదేశీ పెట్టుబడులు అనుమతి ఇస్తూ ప్రజలపై పెనుబారం మోపుతున్నది. కేంద్ర ప్రభుత్వం అవలంబించే కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఆందోళనలో కార్మికులు,రైతులు,వ్యవసాయ కార్మికులు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వ్య.కా.స. జిల్లా ఉపాధ్యాక్షులు జల్లెల పెంటయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి , సిఐటియు జిల్లా



అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యాక్షులు గొరిగె సోములు, జిల్లా నాయకులు బొడ్డుపల్లి వెంకటేశం, రైతుసంఘం మండల అధ్యక్ష,కార్యదర్శులు గన్నెబోయిన విజయ్, భాస్కర్, బోయిన ఆనంద్, ఐలు జిల్లా కార్యదర్శి మామిడి వెంకటరెడ్డి. గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నకిరేకంటి రాము,ఎన్.పి.ఆర్.డి జిల్లా కార్యదర్శి వనం ఉపేందర్,భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు వంగాల మారయ్య ప్రజానాట్యమండల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంటపాక శివకుమార్, ఈర్లపల్లి ముత్యాలు, నరసింహ, బల్గురి అంజయ్య, బామండ్లపల్లి బాలరాజు,అప్పం సురేందర్, నాగాటి ఉపేందర్, మునుకుంట్ల లెనిన్,శ్రవణ్ కుమార్, పుట్టల ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన మాజి వార్డ్ మెంబర్ ఫెరోజ్ భాండారి



**జహీరాబాద్ వెలుతురు జనవరి 16:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం పరిది కోహిర్ పట్టణానికి చెందిన మాజీ వార్డు సభ్యులు ఫెరోజ్ భాండారి శుక్రవారం నాడు బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్టు పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 సంవత్సరంలో మాజీ మంత్రి స్వర్గీయ మొహమ్మద్ ఫరీదుద్దీన్ వెంట కాంగ్రెస్ పార్టీని వదిలి బీఆర్ఎస్ లో చేరడం జరిగిందని, 12 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణం అనంతరం పార్టీకి రాజీనామా చేస్తున్నానని, ఏ పార్టీలో చేరేది త్వరలో నిర్ణయం తీసుకుంటానని, ప్రస్తుతనికైతే తన వ్యక్తిగత పనుల వల్లే బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని, పార్టీ ఎదుగుదలకు తనవంతు సహాయంగా ఎంతో కృషి చేశానని అన్నారు.

## ఎస్సై పందిరి విష్ణు ను సన్మానించిన తెలంగాణ ఉద్యమకారుడు గద్దపాటి సైదులు

**నార్కట్ పల్లి,వెలుతురు జనవరి 16:**

నార్కట్ పల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్సై. పందిరి విష్ణును తెలంగాణ ఉద్యమకారుడు, బిఆర్ఎస్ జిల్లా నాయకులు గద్దపాటి సైదులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, పుష్పగుచ్చని అందజేశారు.




# మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వగ్రామం బి వెల్లంల కి వెళ్లే రోడ్డు

**- అండర్ పాసింగ్ వద్ద నీళ్లు నిలవడంతో ప్రజల ఇక్కట్లు**

**- భయంతో వణుకుతున్న వాహనదారులు**

**- నిర్లక్ష్యం చూస్తున్న రైల్వే అధికారులు**





**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 16:** నార్కట్పల్లి నుండి మునుగోడు కు పోయే రోడ్డు రైల్వే అండర్ పాస్ దగ్గర నీళ్లు నిలిచి ఎంతోమంది బండి జారీ పడిపోతున్నారు

ఈరోజు మధ్యాహ్నం ఒంటి గంట సమయశీలొ భార్య భర్తలు బాబుతో కలిసి మోటర్ సైకిల్ మీద జారిపడిపోయారు. ఇలా చాలా ప్రమాదాలు జరుగుతున్నవి ఏనుగులదోరి చౌడంపల్లి బ్రాహ్మణ వెల్లంల ఔరవాణి ఎలికట్టే పోయే ప్రజలు మరియు మునుగోడుకు పోయే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు దీనికి సంబంధించి నీళ్లు పోయే దగ్గర మట్టి పేరుకుపోయినది మట్టిని తొలగించాలని కోరుచున్నాము. గత మూడు నెలల నుండి ఎవరూ పట్టించుకోవడం లేదు కావున జాగ్రత్తతో నెమ్మదిగా ప్రయాణించగలరని మనవి కావుననార్కట్ నుంచి ఎంపిడిఓ లేదా నార్కట్పల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి లేదా R&B AE అందరూ సమిష్టితో పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని బి వెల్లంల మాజీ ఎంపీటీసీ సభ్యులు చిరుమర్తి యాదయ్య కోరుతున్నారు.

# సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు



**మునుగోడు, జనవరి 16 (వెలుతురు):**
శుక్రవారం మండలంలోని గుండ్లోరిగూడెం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా మహిళలకు కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బొల్లం మహేష్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన వారికి, పాల్గొన్న వారికి బొల్లం వెంకటేష్ సహకారంతో కాంగ్రెస్,బి జె పి వార్డ్ మెంబర్లు బహుమతులు అందజేశారు.మొదటి బహుమతిని బొల్లం రాజేశ్వరి గెలుచుకున్నారు.అనంతరం బొల్లం మహేష్ మాట్లాడుతూ గ్రామీణ సంస్కృతి,సంప్రదాయాలు కాపాడుకోవడంలో మహిళల పాత్ర కీలకమని,గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలు ఐక్యత పెంపొందిస్తాయని అన్నారు.మహిళలను ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడూ తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమానికి సహకరించి విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు జంగిలి నాగరాజు,పల్లెబోయిన సైదులు,పల్లెబోయిన దుర్గా శ్రీ,బి జె పి గ్రామశాఖ అధ్యక్షుడు పల్లెబోయిన సురేష్, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# టీయూటీఎఫ్ 2026 సంవత్సర డైరీ ఆవిష్కరణ

**- ఉపాధ్యాయులు వృత్తి నిబద్దతతో విద్యా బోధన చేయాలి!**

**- జిల్లా కలెక్టర్ శ్రీ తేజస్ నందలాల్ పవార్**



**సూర్యాపేట వెలుతురు జనవరి 16:**
తెలంగాణా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 2026 సంవత్సరం దైనందినిని సూర్యాపేట జిల్లా కలెక్టర్ శ్రీ తేజస్ నందలాల్ పవార్ గారు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీ తేజస్ నందలాల్ పవార్ గారు మాట్లాడుతూ టీయూటీఎఫ్ సంఘ సభ్యులు సమాజ నిర్దేశకులుగా ఉండాలని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటుగా,ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కొరకు వృత్తి నిబద్దతతో విద్యా బోధన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూటీఎఫ్ రాష్ట్ర నాయకులు దామెర శ్రీనివాస్,ఊట్కూరి జానకి రాములు,ధరణికోట రవి కుమార్,యర్రంశెట్టి చలమంద రావు,జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు మామిడి అరవిందు,కస్తూరి కిషన్ ప్రసాద్,సూర్యాపేట జిల్లా నాయకులు కటకం నరసింహ స్వామి,నక్కపోతు శ్రీనయ్య,శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.

# చట్టవిరుద్ధంగా వాకీటాకీల విక్రయం

**- అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో సహా పలు సంస్థలకు షాక్**

**- ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై రూ.44లక్షల వరకు జరిమానా**




**న్యూఢిల్లీ,జనవరి16( వెలుతురు):**
చట్టవిరుద్ధంగా వాకీ టాకీలను విక్రయిస్తున్న పలు ఈ-కామర్స్ సంస్థలపై కేంద్ర వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ సుమోటోగా చర్యలు చేపట్టింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో సహా పలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై మొత్తంగా రూ.44లక్షల వరకు జరిమానా విధించింది. వినియోగదారుల రక్షణ, టెలికాం చట్టాలను ఉల్లంఘించి పలు ఈ-కామర్స్ సంస్థలు నిబంధనలకు అనుగుణంగా లేని ఉత్పత్తులను లిస్ట్ చేసి విక్రయిస్తున్నట్లు సీసీపీఏ గుర్తించింది. సాధారణంగా 446.0-446.2 బ్యాండ్‌లోని పర్సనల్ మొబైల్ రేడియోలకు మాత్రమే లైసెన్స్ మినహాయింపు వర్తిస్తుంది. మిగతా వాటి దిగుమతి, విక్రయాల కోసం తప్పనిసరిగా ఎక్విప్‌మెంట్ టైప్ అప్రూవల్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. అంతేగాక, లైసెన్సింగ్ నిబంధనలకు సంబంధించిన వివరాలను కూడా విక్రయదారులు స్పష్టంగా తెలియజేయాలి. అయితే, ఫ్లిప్‌కార్ట్ , అమెజాన్ , మీషో , జియో మార్ట్ తదితర ఈ-కామర్స్ సంస్థలు ఈ నిబంధనలను ఉల్లంఘించి నట్లు అఖం తెలిపింది. లైసెన్స్ మినహాయింపు ఫ్రీక్వెన్సీ రేంజ్ దాటి ఉన్న వాకీ టాకీలను ఈ కంపెనీలు విక్రయించినట్లు పేర్కొంది. ఇందుకు గానూ మీషో, మెటా, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ సంస్థలకు రూ.10లక్షల చొప్పున జరిమానా విధించింది. చిమియా, జియో మార్ట్, టాక్ ప్రో, మాస్క్‌మ్యాన్ టాయ్స్ సంస్థలకు రూ.లక్ష చొప్పున ÷న్ వేసింది. వీటిలో మీషో, మెటా, చిమియా, జియో మార్ట్, టాక్ ప్రో ఇప్పటికే పెనాల్టీలు చెల్లించినట్లు సీసీపీఏ వెల్లడించింది.

# వైట్‌హైజ్‌లో ట్రంప్‌తో కొరినా మచాడో భేటీ

**- తనకు దక్కిన నోబెల్ శాంతి బహుమతి ట్రంప్‌కు అందచేత**

**వాషింగ్టన్,జనవరి16( వెలుతురు):**
వెనుజువెలా ప్రతిపక్ష నాయకురాలు మారియా కొరినా మచాడో గురువారం వైట్ హౌజ్‌లో అధ్యక్షుడు ట్రంప్‌ని కలిశారు. ఈ సందర్భంగా తన నోబెల్ శాంతి బహుమతి పురస్కారాన్ని ట్రంప్ నకు అందజేశారు. సమావేశం అనంతరం ఈ విషయాన్ని మచాడో స్వయంగా మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా మచాడో మాట్లాడుతూ.. 'చరిత్రలో రెండు వందల ఏళ్ల తర్వాత, బొలివర్ వారసులు వాషింగ్టన్ వారసుడికి ఒక పతకాన్ని తిరిగి ఇస్తున్నా.. ఇది మన స్వేచ్ఛ పట్ల ఆయన ప్రత్యేక నిబద్ధతకు గుర్తింపుగా నా నోబెల్ శాంతి బహుమతిని ట్రంప్ నకు అందజేస్తున్నా' అని వ్యాఖ్యానించారు. వెనుజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను ఇటీవల అమెరికా సైనిక దళాలు అదుపులోకి తీసుకున్న కొన్ని రోజులకే ఈ పరిణామాలు చోటు చేసుకోవడం ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మచాడోతో భేటీ అనంతరం ట్రంప్ స్పందిస్తూ.. 'మారియా కొరినా మచాడోను కలవడం నాకు ఎంతో సంతోషంగా ఉంది. ఆమె ఎన్నో కష్టనష్టాలను ఎదిరించి నిలిచిన గొప్ప మహిళ, ఇన్నాళ్ళు ప్రపంచ శాంతి కోసం నేను చేసిన కృషిని గుర్తించి ఆమె తన నోబెల్ పురస్కారాన్ని నాకు బహుమతిగా ఇచ్చారు.. థ్యాంక్యూ మరియా.. అంటూ తన ట్రూత్ సోషల్ వేదికగా తెలిపారు. గత ఏడాది అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ తనకు నోబెల్ శాంతి బహుమతి



ఇవ్వాలని.. దానికి తాను పూర్తి అర్హుడని నానా హంగామా చేశారు. కానీ, నోబెల్ బహుమతి మాత్రం ట్రంప్‌నకు దక్కలేదు. 2025 లో నోబెల్ బహుమతి వెనుజువెలా ప్రతిపక్ష నేత కొరినా మచాడోకి దక్కింది.

# వాట్సాప్ గ్రూప్ లింకులతో జాగ్రత్త: పోలీసుల హెచ్చరిక

**కాకినాడ,జనవరి16( వెలుతురు):**
వాట్సాప్ గ్రూపుల్లో వస్తున్న లింకులను క్లిక్ చేస్తే బుక్ అవుతారని సిఐ వై అర్ కె శ్రీనివాస్ హెచ్చరించారు. ' నాకు రూ.5 వేలు వచ్చాయి. నేను నకిలీ అనుకున్నాను. మీరూ ప్రయత్నించి చూడండి. మీరు పది మందికి ఈ లింకును ఫార్వర్డ్ చేయండి ' అని వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని సిఐ తెలిపారు. సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. వాట్సాప్, ఫేస్ బుక్, ఇన్స్టాగ్రామ్, తదితర మాధ్యమాల నుంచి వచ్చే లింకులు ఓపెన్ చేయొద్దని చెప్పారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



**ముంబై, జనవరి16( వెలుతురు):**
భారతీయులకు బంగారానికి విడదీయరాని అనుబంధం ఉంది. బంగారం అంటే ఇష్టపడని భారతీయుడు ఉండడంటే అతిశయోక్తికాదు. ఏ శుభకార్యం జరిగినా కూడా బంగారు ఆభరణాలకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఏడాది క్రితం లక్ష రూపాయలకు దిగువన ఉన్న బంగారం ధరలు ఊహించని స్థాయిలో పెరిగాయి. ప్రస్తుతం స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,43,620 దగ్గర ట్రేడ్ అవుతోంది. గత కొద్దిరోజుల నుంచి చుక్కలు చూపిస్తున్న బంగారం ధరలు శుక్రవారం స్వల్పంగా తగ్గాయి. బంగారం కొనాలనుకునే పేద, మధ్య తరగతి వారికి ఊరటను మాత్రం ఇవ్వడం లేదు. శుక్రవారం బంగారం ధరల విషయానికి వస్తే.. పది గ్రాముల 24, 22,18 క్యారెట్ల బంగారంపై వరుసగా రూ.220, రూ. 200, రూ.170లు తగ్గింది. ప్రస్తుతం దేశీ మార్కెట్‌లలో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,620 పలుకుతోంది. అలాగే పది గ్రాముల 22 క్యారెట్ల ధర రూ.1,31,650 దగ్గర ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,07,720 వద్ద ట్రేడ్ అవుతోంది. గత రెండు రోజుల నుంచి వెండి ధరలు తగ్గుతూ వస్తున్నాయి. నిన్న కిలో వెండి ధర రూ.3,10,000 వద్ద ట్రేడ్ అయింది. 100 గ్రాముల వెండి ధర రూ.31,000 దగ్గర ట్రేడ్ అయింది. నేడు కిలోపై రూ.4000, 100 గ్రాములపై రూ.400 మేర తగ్గింది. ప్రస్తుతం కేజీ వెండి ధర రూ.3,06,000 వద్ద, 100 గ్రాముల వెండి ధర రూ.30,600 వద్ద ట్రేడ్ అయింది.

# గుర్తు తెలియని పండ్లు తిని చిన్నారులకు అస్వస్థత

**సంగారెడ్డి జనవరి16( వెలుతురు):**



పటాన్చెరు నియోజకవర్గంలో విషాదం నెలకొంది. రామచంద్రాపురం పరిధిలోని బండ్లగూడ నేతాజీనగర్ లో నివసిస్తున్న బీహార్కు చెందిన ముగ్గురు చిన్నారులు (8)ఏళ్ల వయసు వారు సరదాగా సమీపంలోని అడవిలోకి వెళ్లారు. అక్కడ చెట్లకు ఉన్న కొన్ని గుర్తుతెలియని విషపు కాయలను వారు తిన్నారు. కొద్దిసేపటికే ఆ చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్లోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు....

# ఐటీ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

**హైదరాబాద్,జనవరి16( వెలుతురు):**
ఐటీ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టే ఒక కొత్త సంస్థను తెలంగాణ ప్రభుత్వం ఆవిష్కరించబోతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) రంగంలో తెలంగాణను గ్లోబల్ లీడర్‌గా నిలబెట్టే దిశలో ఒక చారిత్రాత్మక అడుగుగా, రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ AI ఇన్నోవేషన్ హబ్ (TAIH) ను దావోస్‌లో ప్రారంభించనుంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సమావేశంలో ఈనెల 20న ఈ సంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమం జరగబోతోంది. AI పరిజ్ఞానాన్ని ఇమడ్చటం, AI ఆవిష్కరణలను వేగవంతం చేయడానికి ప్రత్యేకంగా రూపొందించిన స్వతంత్ర సంస్థగా, TAIH ప్రపంచంలోనే తొలి "ప్రపంచ AI ప్రయోగ వేదిక"గా పనిచేస్తుంది.

ఇప్పటిదాకా భారతదేశపు టెక్నాలజీరంగపు కేంద్రంగా ఉన్న తెలంగాణ, ఇప్పుడు ప్రపంచ నూతన ఆవిష్కరణల రాజధానిగా మారిపోయిందని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చెప్పారు. దావోస్‌లో తాము కేవలం పెట్టుబడులు మాత్రమే అడగడం లేదని, భాగస్వామ్యాలకై చేయి చాస్తున్నామని వివరించారు. నూతన ఆవిష్కరణలు, ప్రతిభల మేలుకలయికగా ఉన్న తెలంగాణలో AI భవిష్యత్‌ను నిర్మించడానికి ప్రపంచదేశాలను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ప్రపంచానికి ఒక శాండ్‌బాక్స్ AI, క్వాంటమ్ కంప్యూటింగ్, చిప్ డిజైన్ వంటి డీప్‌టెక్ రంగాలలో నూతన ఆవిష్కరణలకు చోదక శక్తిగా పనిచేసేలా TAIH రూపొందించబడింది. తెలంగాణ యొక్క ప్రగతిశీల AI వ్యూహంలో భాగంగా, విధానాల రూపకల్పన నుండి భారీస్థాయి అమలు దిశగా ఒక నిర్ణయాత్మక మార్పును TAIH సూచిస్తుంది.

ప్రపంచానికి మరో ఇంక్యుబేటర్ అవసరం లేదని, ఒక ఇన్నోవేషన్ శాండ్‌బాక్స్ అవసరం ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు అన్నారు. TAIH ప్రారంభంద్వారా తాము ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో డీప్‌టెక్ రంగాలలో అత్యాధునిక ఆవిష్కరణలకు వేదికను ఏర్పాటు చేస్తున్నామని, ఇక్కడ అత్యంత సురక్షితమైన, ఎంటర్‌ప్రైజ్-గ్రేడ్ ఉత్పత్తులు




తెలంగాణలో రూపుదిద్దుకుంటాయని చెప్పారు.

నూతన ఆవిష్కరణల వేగానికి అనుగుణంగా విస్తృత స్థాయిలో పనిచేయగల కొత్త సంస్థాగత నమూనాగా TAIH రూపుదిద్దుకుంది. ప్రభుత్వ సంస్థలు ఎలా రూపకల్పన చేయబడతాయి, నిర్వహించబడతాయి అనే దానిని పునర్నిర్మించడం ద్వారా, వేగవంతమైన ప్రయోగాలు, వేగవంతమైన అమలు, ప్రైవేట్ రంగంతో లోతైన భాగస్వామ్యాన్ని TAIH సాధ్యం చేస్తుంది.

TAIH యొక్క ప్రత్యేక బలం దాని రూపకల్పనలోనే ఉందని, ఇది వేగం, స్థాయి, ప్రభావం కోసం రూపొందించిన సంస్థ అని ఐటీ, పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సంజయ్ కుమార్ అన్నారు. స్టార్టప్ చురుకుదనం, ఎంటర్‌ప్రైజ్ సామర్థ్యం, ప్రభుత్వ విశ్వసనీయత, విస్తృతిని సమన్వయం చేయడం ద్వారా, ఇది వేగవంతమైన ఇన్నోవేషన్‌ను సాధ్యం చేస్తుందని తెలిపారు. ఉత్పత్తి-మార్కెట్ సరిపోలికను వేగవంతం చేస్తుందని, వెంచర్ క్యాపిటల్‌ను ఆకర్షిస్తుందని, పైలట్ దశను దాటి విభిన్న రంగాల్లో విస్తృత స్థాయి వాణిజ్య అమలుకు పరిష్కారాలను తీసుకెళ్తుందని చెప్పారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలకు అనుగుణంగా, డీప్-టెక్ భవిష్యత్తుకు స్వాగతం పలికేవిధంగా తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న ఇన్నోవేషన్-ఫస్ట్ దృక్పథాన్ని ఈ ప్రారంభ కార్యక్రమంలో ప్రదర్శించనున్నారు. డిస్‌రప్టివ్ AI మోడల్స్, అటానమస్ ఏజెంట్‌లు, క్వాంటమ్ టెక్నాలజీలు, అధునాతన సెన్సార్ ప్లాట్‌ఫామ్‌లు, సూపర్‌హ్యూమన్ ఇంటెలిజెన్స్ ద్వారా నిర్వచించబడే తదుపరి ఇన్నోవేషన్ యుగంలోకి ప్రవేశిస్తున్నామని, ఈ కీలక సమయంలో TAIH ను ప్రారంభించడం ద్వారా తెలంగాణ ఆర్థిక ప్రగతిని మరింత వేగవంతం చేసి, ప్రపంచంలోని టాప్ 20 ఇన్నోవేషన్ హబ్‌లలో ఒకటిగా తెలంగాణను నిలపడం తమ లక్ష్యమని TAIH సీఈఓ ఫణి నాగార్జున చెప్పారు. కార్యక్రమ వివరాలు తెలంగాణ AI ఇన్నోవేషన్ హబ్ అధికారిక ప్రారంభం ఈ నెల 20న సాయంత్రం 7 గంటల నుండి 8:30 వరకు, దావోస్‌లోని మౌంటెన్ ప్లాజా హోటల్‌లో జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వాధినేతలు, పరిశ్రమల అధినేతలు, టెక్నాలజీ రంగ ప్రముఖులు హాజరుకానున్నారు. TAIH అనేది కృత్రిమ మేధస్సులో ఇన్నోవేషన్, పరిశోధన, అమలును ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వయం ప్రతిపత్తి గల సంస్థ. ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలకు మధ్య వారధిగా పనిచేస్తూ, జనాభా స్థాయిలో గ్లోబల్ సవాళ్లకు పరిష్కారాలు అందిస్తుంది. TAIH నాలుగు వ్యూహాత్మక స్థంభాలపై పనిచేస్తుంది-టాలెంట్ ఫౌండ్రీ, ఇన్నోవేషన్ ఇంజిన్, క్యాపిటల్ ఫ్లైవీల్, ఇంపాక్ట్ ల్యాబ్స్-నైపుణ్యాలు, పరిశోధన నుంచి స్టార్టప్‌లు, మూలధనం, వాస్తవ ప్రపంచ అమలు వరకు నిరాటంక ప్రయాణాన్ని నిర్ధారిస్తుంది.

# సైబర్ దాడి వ్యూహం..




**న్యూఢిల్లీ, జనవరి16( వెలుతురు):**
ట్రిగర్ జారలేదు, గుండు బయల్దేరలేదు, మిసైల్ ప్రయోగం జరగలేదు. అయినా వెనెజువెలాలో పూర్తి యుద్ధం జరిగి ముగిసింది. అమెరికా విమానాలు ఎగరకుండా, రాడార్లు మౌనంగా మారాయి. అధ్యక్షుడు మదురో దంపతులు అదుపులోకి రాలేదు. ఇది సైబర్ యుద్ధం ? నాలుగు సంప్రదాయ యుద్ధాలకు (నేల, ఆకాశ, సముద్ర, స్పేస్) ఐదవ అధ్యాయం. ప్రపంచ యుద్ధ చరిత్రలో కొత్త అధ్యాయం రాసిన ఈ ఘటన ప్రతి దేశానికి పాఠాలు చెబుతోంది.వెనెజువెలా విద్యుత్ గుర్రం గురీ డ్యామ్ సూపర్ విజరీ సిస్టమ్ మొదట లక్ష్యం. రెండు కీలక టార్గెట్లతో మొత్తం విద్యుత్ సరఫరా కట్ అయింది. మిలటరీ అంధకారంలో మునిగింది. రాడార్లు ఆఫ్, ఎయిర్‌ఫోర్స్ ఇన్వర్టర్లపై ఆధారపడింది. ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్ కూడా నిలిచిపోయింది. టెలిఫోన్లు పనిచేయలేదు, సమాచార బదిలీ ఆగిపోయింది. రాడార్లు రీబూట్ అయ్యే ముందే 150 అమెరికా విమానాలు దేశంలోకి చేరాయి.ఇది ఒక్కరోజు ఆపరేషన్ కాదు. 10?15 ఏళ్లుగా అమెరికా సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ చిప్స్‌లో మాల్‌వేర్ ఏర్పాటు చేసింది. ఎప్పుడు కావాలంటే ఆ సిస్టమ్ షట్‌డౌన్ చేసే సామర్థ్యం కలిగింది. వెనెజువెలా చిప్స్ ఆధారంగా ఉండటం వల్ల వారి ప్రత్యేక రక్షణ లేకపోయింది. దొంగల మార్గాలు, సైనిక కదలికలు అన్నీ అమెరికాకు తెలిసాయి. యుద్ధ సమయంలో విద్యుత్ అంతరాయం తప్పనిసరి. సోలార్, జనరేటర్లు సిద్ధంగా ఉండాలి. విదేశీ చిప్స్, సాఫ్ట్‌వేర్‌లో బ్యాక్‌డోర్ ఉండే అవకాశం. స్వదేశీ సాంకేతికతపై ఆధారపడాలి. సైబర్ దాడులకు తట్టుకునే ఆల్టర్నేటివ్ నెట్‌వర్క్‌లు అవసరం.అజర్‌బైజాన్ డ్రోన్ యుద్ధంలా, ఇజ్రాయెల్ ఐరన్ డోమ్‌లా సైబర్ యుద్ధం కూడా కొత్త నార్మల్. ఇజ్రాయెల్ లెబనాన్ పేజర్ బాంబుల్లా భవిష్యత్ యుద్ధాలు హైబ్రిడ్ రూపంలో ఉంటాయి. పౌరులు, మిలటరీ, సైబర్ బలగాల మధ్య సమన్వయం లేకుండా గెలుపు అసాధ్యం.వెనెజువెలా యుద్ధం ప్రపంచ రక్షణ వ్యూహాలను మార్చేస్తుంది. భారత్‌కు స్వదేశీ సాంకేతికత, సైబర్ రక్షణ, పౌర?సైనిక సమన్వయంపై దృష్టి పెట్టాలి. రాబోయే యుద్ధాలు బుల్లెట్‌లు కాకుండా బైట్‌లతో జరుగుతాయి.

# దేశంలో 4 ఏళ్లలో 3.3 లక్షల మంది దుర్మరణం




**ముంబై, జనవరి16( వెలుతురు):**
బైక్ యాక్సిడెంట్లు, దేశవ్యాప్తంగా పెరుగుతున్న రోడ్డు మరణాల పట్ల కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం.. 2019 నుంచి 2023 వరకు గత 5 ఏళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన వారిలో దాదాపు సగం మంది బైక్ ప్రయాణికులే కావడం గమనార్హం. ఈ పరిస్థితిని అరికట్టేందుకు ప్రభుత్వం 2026 నాటికి భారీ సంస్కరణలు, కొత్త చట్టాలను తీసుకురావడానికి సిద్ధమవుతోంది. ఈ 5 ఏళ్లలో మొత్తం 7.78 లక్షలకు పైగా రోడ్డు ప్రమాద మరణాలు చోటు చేసుకున్నాయి. ఇందులో ద్విచక్ర వాహన ప్రమాదాల్లో చనిపోయిన వారి సంఖ్య 3.35 లక్షలకు పైగా ఉండటం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. 2023లో బైక్ మరణాల శాతం 45 శాతం అంటే 77,539 మంది ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇక రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న యువత 66 శాతం 18 నుంచి 34 ఏళ్ల వయస్సు వారు ఉన్నట్లు తేలింది.కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల ప్రకటించిన వివరాల ప్రకారం.. ఈ ఏడాదిలో రోడ్డు భద్రతపై విప్లవాత్మక మార్పులు రానున్నాయి. మోటారు వాహన చట్టానికి సుమారు 61 సవరణలతో కూడిన నూతన రోడ్డు భద్రతా బిల్లును 2026లో పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. 2026 జనవరి నుంచి అమ్ముడయ్యే అన్ని కొత్త ద్విచక్ర వాహనాలకు యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ తప్పనిసరి కానుంది. ప్రతి కొత్త బైక్ కొనుగోలుతో పాటు.. షోరూమ్ యజమానులు ఐఎస్ఐ గుర్తింపు పొందిన రెండు హెల్మెట్లను (రైడర్, పిలియన్ రైడర్ కోసం) ఉచితంగా లేదా వాహనం ధరలోనే భాగంగా అందించాల్సి ఉంటుంది. 2026 చివరి నాటికి వాహనాల మధ్య పరస్పర సమాచార మార్పిడికి ఉపయోగపడే వెహికల్ టు వెహికల్ కమ్యూనికేషన్ సిస్టమ్‌ను ప్రయోగాత్మకంగా తీసుకురానున్నారు. ఇది మంచు లేదా పొగమంచు సమయాల్లో ప్రమాదాల గురించి డ్రైవర్లను అప్రమత్తం చేస్తుంది. రోడ్డు ప్రమాద బాధితులను కాపాడే వారికి ఇచ్చే రివార్డును రూ. 25 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అలాగే.. బాధితులకు 7 రోజుల పాటు రూ. 1.5 లక్షల వరకు ఉచిత క్యాష్‌లెస్ చికిత్స అందించనున్నారు.

# సికింద్రాబాద్ కార్పోరేషన్ కోసం ర్యాలీ

**- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**

**సికింద్రాబాద్ జనవరి16( వెలుతురు):**
శనివారం ఉదయం 9 గంటలకు సికింద్రాబాద్ అస్తిత్వం, ఆత్మగౌరవం పోరాటం ర్యాలీ జరుగుతుంది. రైల్వే స్టేషన్ నుంచి ఎంజిరోడ్ లోని గాంధీ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగుతుందని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఇంటికి ఒకరు చొప్పున సికింద్రాబాద్ నివాసితులు రావాలి. 220 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రాంతం సికింద్రాబాద్. అనేక చారిత్రాత్మక ప్రదేశాలు సికింద్రాబాద్ లో ఇమిడి ఉన్నాయి. లష్కర్ బోనాలకు పెద్ద చరిత్ర ఉంది. సికింద్రాబాద్ ను నామరూపాలు లేకుండా చేయాలని ప్రభుత్వం చూస్తోందని అన్నారు. కమిషనరేట్ లు అక్రమంగా కలిపారు. ఎందుకు కలిపారో చెప్పాలి. రేపు అన్ని రంగాల సంఘాలు పాల్గొనాలి. ఈ ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడానికి ఇదే మంచి సమయం. రేపు కార్యక్రమానికి బీ ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో సహా ఎమ్మెల్యేలు కూడా వస్తున్నారు. సికింద్రాబాద్ పేరు మార్చేందుకు కుట్ర జరుగుతుంది. అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చారు. ఆ హామీలు అమలు చేయకుండా పేర్లు ఊర్లు మారుస్తూ తుగ్లక్ పాలన చేస్తున్నారు. లష్కర్ సాధన సమితి రెండేళ్లుగా అడుగుతున్నాం. సికింద్రాబాద్ కార్పొరేషన్ కోసం అందరూ కలిసి రావాలని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు కచ్చితంగా ఈ కార్యక్రమం లో పాల్గొనాలి. ఇది శాంతియుత ర్యాలీ. ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోతే కోర్టు నుంచి అనుమతి తీసుకుంటాం. కార్యక్రమం విజయవంతం చేస్తామని అన్నారు.

# వ్యవసాయ భూముల్లో అక్రమ రిజిస్ట్రేషన్లు

**హైదరాబాద్, జనవరి16( వెలుతురు):**
తెలంగాణలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల అక్రమాల విచారణ రెవెన్యూ అధికారులను కలవరపెడుతోంది. 2021-2025 మధ్య కాలంలో జనగామ, రంగారెడ్డి వంటి కీలక జిల్లాల్లో పనిచేసిన తహసీల్దార్లు ఇప్పుడు ఏసీబీ విచారణకు భయపడుతున్నారు. ధరణి పోర్టల్ ద్వారా జరిగిన లావాదేవీల్లో చలానాల మాయాజాలం, నిబంధనల ఉల్లంఘనలపై ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ ఆడిటింగ్ నిర్వహిస్తోంది. ఇప్పటికే పలువురు రైతులకు నోటీసులు జారీ కాగా.. సంక్రాంతి తర్వాత అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.తెలంగాణలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన అక్రమాల విచారణ ఇప్పుడు రెవెన్యూ శాఖలో పెను తుపానును సృష్టిస్తోంది. ప్రధానంగా భూముల క్రయవిక్రయాల్లో జరిగిన లావాదేవీలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించడంతో.. గతంలో కీలక జిల్లాల్లో పనిచేసిన అధికారులు ఇప్పుడు వణికిపోతున్నారు.ముఖ్యంగా 2021 నుండి 2025 మధ్య కాలంలో జనగామ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పనిచేసిన తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బందిలో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ విచారణ కమిటీలో అవినీతి నిరోధక శాఖ అధికారులు కూడా సభ్యులుగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. గతంలో తాము చేసిన భూముల బదిలీలు లేదా రిజిస్ట్రేషన్లలో ఏవైనా సాంకేతిక లోపాలు ఉన్నాయా అనే కోణంలో సిబ్బంది ఆరా తీస్తున్నారు.ఈ కేసు ఒక ప్రాంతానికో లేదా ఒక అధికారికి సంబంధించినది మాత్రమే కాదు. రాష్ట్రవ్యాప్తంగా ధరణి పోర్టల్ ద్వారా జరిగిన రిజిస్ట్రేషన్లలో అనేక లోపాలు ఉన్నట్లు ప్రభుత్వం ప్రాథమికంగా గుర్తించింది. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించినట్లు తప్పుడు చలానాలను సృష్టించడం లేదా ఒకే చలానాను ఒకటి కంటే ఎక్కువ సార్లు ఉపయోగించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. విచారణలో భాగంగా ఇప్పటికే అనేకమంది భూ యజమానులకు, రైతులకు రెవెన్యూ శాఖ నోటీసులు పంపింది. వారి నుంచి ఆర్థిక లావాదేవీల వివరాలను సేకరిస్తోంది. భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం నుంచి ప్రతి రిజిస్ట్రేషన్ లావాదేవీని క్షుణ్ణంగా ఆడిటింగ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా లావాదేవీల్లో తేడాలు వచ్చిన వివరాలను నేరుగా ఆయా జిల్లాల కలెక్టర్లకు పంపారు. ప్రస్తుతానికి ప్రభుత్వం నియమించిన కమిటీ కేవలం ఆధారాల సేకరణలో నిమగ్నమై ఉంది. సంక్రాంతి పండుగ ముగిసిన తర్వాత ఈ విచారణ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. పోలీసులు ఇప్పటికే కొందరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తుండటంతో.. వారిచ్చే సమాచారం ఆధారంగా రెవెన్యూ అధికారులకు కూడా నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది.కలెక్టర్ల పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ఆడిటింగ్‌లో 90 శాతం నివేదికలు ఇప్పటికే ప్రభుత్వానికి అందాయి. కొన్ని చోట్ల చిన్నపాటి పొరపాట్లు జరిగినట్లు అధికారులు అంగీకరిస్తున్నప్పటికీ.. ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొట్టే స్థాయిలో అక్రమాలు జరిగాయా లేదా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ కేసు తేలే వరకు తహసీల్దార్ల కార్యాలయాల్లో పని చేస్తున్న సిబ్బందికి కంటిమీద కునుకు లేకుండా పోయింది.




# మున్సిపాల్టీల్లో ఆమెదే హవా...

**హైదరాబాద్, జనవరి16( వెలుతురు):**
తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు ఎన్నికల సంఘం దాదాపుగా పూర్తిచేస్తోంది. ఓటర్ల వివరాలను దాదాపుగా ఫైనల్ చేసింది. రాష్ట్రంలోని మొత్తం 123 మున్సిపాలిటీల పరిధిలో ఓటర్ల తుది జాబితా విడుదలైంది. ఈ గణాంకాల ప్రకారం, మొత్తం 2,996 వార్డుల్లో కలిపి 52,43,023 మంది ఓటర్లు తమ ఓటు హక్కును కలిగి ఉన్నారు. గతంతో పోలిస్తే పట్టణ ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరగడం విశేషం. మున్సిపల్ ఓటర్ల జాబితాలో మహిళా ఓటర్ల ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. మొత్తం 123 మున్సిపాలిటీలకు గానూ ఏకంగా 113 మున్సిపాలిటీల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఓటర్లలో 51.1 శాతం మంది మహిళలు ఉండగా, వీరి సంఖ్య 26,80,014 గా ఉంది. పురుష ఓటర్లు 25,62,369 (48.9 శాతం) ఉండగా, ఇతరులు 640 మంది ఉన్నారు. పట్టణ ఓటర్ల జాబితాను నిశితంగా గమనిస్తే, పురుషుల కంటే మహిళలు దాదాపు 1.17 లక్షల మంది ఎక్కువగా ఉన్నారు. కేవలం 10 మున్సిపాలిటీల్లో మాత్రమే పురుష ఓటర్లు ఆధిక్యంలో ఉండగా, మిగిలిన చోట్ల మహిళలే నిర్ణాయక శక్తిగా మారనున్నారు. ఈ గణాంకాలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీల వ్యూహాలను మార్చే అవకాశం ఉంది. ఎన్నికల సంఘం విడుదల చేసిన ఈ అధికారిక గణాంకాలు పట్టణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీస్తున్నాయి. వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసిన అధికారులు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. నిర్ణాయక శక్తిగా ఉన్న మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికే ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు మరియు కొన్ని కార్పొరేషన్లకు సంబంధించి ఫిబ్రవరి లేదా మార్చి లో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధమైంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన గణన ప్రక్రియ కూడా తుది దశకు చేరుకుంది. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే, జనవరి నెలాఖరులో లేదా ఫిబ్రవరి మొదటి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుత మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ఎప్పుడో ముగిసింది. ప్రస్తుతం స్పెషల్ ఆఫఈసర్ల పాలనలో ఉన్నాయి.

ఎత్తులు.. పై ఎత్తులు

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ దిశగా పురపాలక శాఖ కీలక అడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 121 మున్సిపాలిటీలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా కేటగిరీలకు చైర్‌పర్సన్ స్థానాల సంఖ్యను పురపాలకశాఖ ఖరారు చేసినట్లు సమాచారం. జనాభా ప్రాతిపదికన ఏ ఏ కేటగిరీలకు ఎన్ని స్థానాలు కేటాయించాలనే అంశంపై స్పష్టతనిస్తూ ప్రాథమిక జాబితాను సిద్ధం చేశారు. మునిసిపాలిటీ చైర్మన్ల సంఖ్య విభాగాల వారీగా.. జనరల్ 30, జనరల్ మహిళలు 31 స్థానాలు, ఎస్టీ జనరల్ 3, ఎస్టీ మహిళ 2, ఎస్సీ జనరల్ 9, ఎస్సీ మహిళ 8, బీసీ జనరల్ 19, బీసీ మహిళ 19 స్థానాలను కేటాయించాలని పురపాలకశాఖ ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మూడు రోజుల్లో దీనిపై క్లారిటీ రానుంది.

రిజర్వేషన్ల వివరాలు - మొత్తం 121 మున్సిపాలిటీల్లో స్థానాల కేటాయింపు

జనరల్: 61 స్థానాలు (వీటిలో జనరల్ 30, జనరల్ మహిళ 31)

బీసీ (వెనుకబడిన తరగతులు): 38 స్థానాలు (బీసీ జనరల్ 19, బీసీ మహిళ 19)

ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు): 17 స్థానాలు (ఎస్సీ జనరల్ 9, ఎస్సీ మహిళ 8)

ఎస్టీ (షెడ్యూల్డ్ తెగలు): 5 స్థానాలు (ఎస్టీ జనరల్ 3, ఎస్టీ మహిళ 2)

మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ దాదాపు 50 శాతం స్థానాలను మహిళలకు కేటాయించడం విశేషం.

తుది ప్రకటన ఈ నెల 17న

మునిసిపాలిటీ చైర్మన్ల రిజర్వేషన్ల స్థానాల సంఖ్యను ఖరారు చేసిన తెలంగాణ ప్రభుత్వం, ఏయే మున్సిపాలిటీ ఏ వర్గానికి కేటాయించాలనే (లక్కీ డిప్ లేదా రోస్టర్ విధానం) తుది రిజర్వేషన్లను ఈ నెల 17న అధికారికంగా ప్రకటించనుంది. ఈ ప్రకటన వెలువడిన వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండటంతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం అప్పుడే వేడెక్కింది. అభ్యర్థులు తమ తమ స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.తెలంగాణలో మూడు విడతల్లో ఉత్కంఠభరితంగా సాగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీ మద్దతుదారులు స్పష్టమైన ఆధిపత్యం చెలాయించారు. రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకున్నారు. ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అధికార పార్టీ అభ్యర్థులు దాదాపుగా క్లీన్ స్వీప్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ముఖ్యంగా రైతు భరోసా, రుణమాఫీ అంశాలు ఓటర్లపై సానుకూల ప్రభావం చూపినట్లు కనిపిస్తున్నాయి. అయితే స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ మద్దతుదారులే గెలుస్తారని తెలిసిందే. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కూడా గట్టి పోటీని ఇచ్చింది. ఉత్తర తెలంగాణలోని కొన్ని నియోజకవర్గాల్లో, సిద్దిపేట, గజ్వేల్ పరిసర ప్రాంతాల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు మెరుగైన ఫలితాలు సాధించారు. బీజేపీ కూడా ఈసారి గ్రామీణ స్థాయిలో తన పట్టును నిరూపించుకుంది, ముఖ్యంగా నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఆ పార్టీ మద్దతుదారులు గణనీయమైన స్థానాల్లో విజయం సాధించారు.



# నల్గొండకు కార్పొరేషన్ హోదా

**నల్గొండ, జనవరి16( వెలుతురు):**
నల్గొండ జిల్లాకు మహర్దశ పట్టనుంది. జిల్లాకు కార్పొరేషన్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా కీలక అప్డేట్ వచ్చింది. నల్గొండను కార్పొరేషన్‌గా మారుస్తున్న అంశంపై తాజాగా అధికారిక గెజిట్ విడుదల చేసింది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల పాలనపరంగా అధికారాలు పెరిగి, అభివృద్ధికి నిధులు, పథకాలు నేరుగా అందనున్నాయి. మేయర్, డిప్యూటీ మేయర్ వ్యవస్థతో పాటు మౌలిక సదుపాయాల కల్పన వేగవంతం కానుంది.నల్గొండ మున్సిపాలిటీ ఇకపై కార్పొరేషన్‌గా మారనున్న సంగతి తెలిసిందే. జిల్లా కేంద్రానికి కార్పొరేషన్ హోదాను కల్పిస్తూ ప్రభుత్వం కొన్ని రోజుల క్రితం నిర్ణయం తీసుకుంది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో నల్గొండను కార్పొరేషన్‌గా మార్చేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తాజాగా దీనిపై కీలక అప్‌డేట్ వచ్చింది. నల్గొండను కార్పొరేషన్‌గా మారుస్తూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది.ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి కే. శ్రీదేవి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపాలిటీగా ఉన్న నల్గొండను కార్పొరేషన్‌గా మార్చడం వల్ల పాలనాపరంగా నల్గొండకు ఎక్కువ అధికారాలు దక్కుతాయి. అలాగే దాని విస్తృతి పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రాంత అభివృద్ధి కోసం నిధులు పెరగనుండటంతో పాటు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు నేరుగా అందే అవకాశం ఉంది. అలాగే కొత్త డివిజన్లను పునర్వ్యవస్థీకరించనున్నారు. నల్గొండ కార్పొరేషన్‌గా మారడంతో.. ఇకపై ఇక్కడ మేయర్, డిప్యూటీ మేయర్ వ్యవస్థ అమలులోకి రానుంది. కమిషనర్ స్థాయి అధికారుల వ్యవస్థ అమల్లోకి రావడంతో పాలన మరింత బలోపేతం కానుంది. నల్గొండను కార్పొరేషన్‌గా మార్చడం వల్ల ఈ ప్రాంతంలో రహదారులు, మురుగు నీరు, తాగు నీరు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల కల్పన వేగవంతం అవుతుంది. పట్టణ ప్రణాళిక (టౌన్ ప్లానింగ్)లో కార్పొరేషన్ నిబంధనలు అమలు అవుతాయి. ట్రేడ్ లైసెన్స్, ఆస్తి పన్ను విధానాల్లో మార్పులు జరుగుతాయి. త్వరలో నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా నల్గొండ కార్పొరేషన్‌కు కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు.

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగా రాష్ట్రంలోని 121 మున్సిపాలిటీలు, 10 కార్పొరేషన్లకు సంబంధించి రిజర్వేషన్లను ఖరారు చేస్తూ బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రిజర్వేషన్ల ప్రక్రియలో భాగంగా పాటించాల్సిన మార్గదర్శకాలు, నియమ, నిబంధనలపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. జనవరి 17న ఏ ఏ స్థానాలను.. ఏ ఏ వర్గాలకు కేటాయిస్తారనే దానిపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది అంటున్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా నల్గొండకు కూడా ఎలక్షన్ నిర్వహిస్తారు.



# గిరిజనులతో కలసి ఆడిపాడిన హోంమంత్రి అరుణ

- కుటుంబ సభ్యుతలతో కలసి గ్రామం సందర్శన
- వారి యోగక్షేములు తెలుసుకుని కలసి భోజనం
- మంత్రి రాకతో ఆనందం వ్యక్తం చేసిన గ్రామస్థులు

**అనకాపల్లి,జనవరి16( వెలుతురు):**

గిరిజన గ్రామంలో కుటుంబ సభ్యులతో కలసి పర్యటించిన మంత్రి అనిత అక్కడి వరితో కలసి ఆడిపాడారు. వారితో కలసి భోజనం చేసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కోటవురట్ల మండలం గొట్టివాడ శివారులో ఉన్న మారుమూల గిరిజన గ్రామం అణుకులో హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి గిరిజనులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన మంత్రి.. గిరిజనులతో కలిసి సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. కనుమ పండగ సందర్భంగా గిరిపుత్రులతో ఎంతో సంతోషంగా గడిపారు. గ్రామస్థులు మంత్రి అనితను 'అనితమ్మ.. మా గుండె' అంటూ కొనియాడారు. 'అనితమ్మ రావడం మాకు పెద్ద పండుగ' అని ఆనందం వ్యక్తం చేశారు. గతంలో రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఎన్నో ప్రాణాలు కోల్పోయినట్లు గిరిజనులు గుర్తుచేశారు. ఇప్పుడు రోడ్డు మంజూరు చేయించినందుకు మంత్రి అనితకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలోని పరిదేశమ్మ తల్లి ఆలయాన్ని మంత్రి అనిత దర్శించుకున్నారు. గిరిజనులతో ముఖాముఖి సంభాషణ జరిపి, వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. అక్కడి



ప్రజలను పేరుపేరునా పలకరించి వారి యోగక్షేమాలు అడిగారు. చిన్నారులతో ఆడుకుని.. వారికి పుస్తకాలు, గిరిజనులకు సంక్రాంతి కానుకలు అందజేశారు. గిరిజనులకు స్వయంగా భోజనాలు వడ్డించి, తన కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. మంత్రి కుమారుడు నిఖిల్.. అణుకు యువకులకు క్రికెట్ కిట్లు, స్పోర్ట్స్ టీషర్టులు అందజేశారు. మంత్రి అనిత, కుమారుడు నిఖిల్‌తో పాటు కుటుంబ సభ్యులు ఆ గ్రామ యువకులతో కలిసి వాలీబాల్ ఆడారు. అనంతరం.. చిన్నారుల డ్యాన్స్‌ను అభినందించారు. గిరిజనులు పండించిన కూరగాయలు, పంటలను మంత్రికి అణుకు ప్రజలు బహూకరించారు. గ్రామస్థులతో మాట్లాడిన మంత్రి అనిత మాట్లాడుతూ.. 'మీతో ప్రశాంతంగా పండుగ చేసుకోవాలని ఇక్కడకు వచ్చాను. మీ అందరితో కలిసి పండుగ చేసుకోవడం నా పూర్వజన్మ సుకృతం. నా పిల్లలను కూడా తీసుకువచ్చాను. మీ గ్రామానికి ఏమి కావాలో అన్నీ చేస్తాను. రూ. 2.50 కోట్లతో రోడ్డు మంజూరైంది. సంబంధిత ఆర్డర్ కాపీతోనే వచ్చాను. మీరంతా సంతోషంగా ఉండాలి. పిల్లలు చక్కగా చదువుకోవాలి. మంచి ఉద్యోగాలు చేయాలి' అని హోంమంత్రి చెప్పారు. 2014 నుంచి 2019 వరకు ఈ గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ఇప్పుడు రేషన్ డిపో ఏర్పాటు చేస్తున్నామని అనిత అన్నారు. త్వరలో సెల్ టవర్ స్థాపన చేస్తామని తెలిపారు. గ్రామంలో 20 మంది పిల్లలు ఇంటర్, డిగ్రీ వరకు చదివారన్న ఆమె.. ఇద్దరు ఆడపిల్లలు డిగ్రీ చదువుతుండటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అంతేకాకుండా.. అణుకు గ్రామంలో ఒక్కో ఇంటికి ఒక బాత్‌రూమ్ నిర్మాణం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# కోనసీమ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

- వైభవంగా సంక్రాంతి ప్రభల ఉత్సవం
- భారీగా హాజరైన జిల్లా ప్రజలు
- పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు

**కోనసీమ, జనవరి16( వెలుతురు):**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి ప్రభల ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. 476 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్న జగ్గన్నతోట ప్రభల ఉత్సవాన్ని వీక్షించేందుకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. జిల్లాలోని అంబాజీపేట, అయినవిల్లి, అమలాపురం గ్రామీణ మండలాలకు చెందిన 11 ఏకాదశరుద్ర ప్రభలను ఇక్కడికి తీసుకొస్తున్నారు. గ్రామాల్లో ముహూర్తం నిర్ణయించి ఊరేగించారు. జగ్గన్నతోట ప్రభల ఉత్సవాన్ని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించిన విషయం తెలిసిందే. ఏటా కనుమ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రభలను కొలువుదీర్చుతారు. అక్కడ భక్తులు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ఆయా గ్రామాలకు తరలివెళతాయి. వీటిల్లో టన్నులకొద్దీ బరువుండే గంగలకుర్రు, అగ్రహారం ప్రభలను స్థానిక ఎగువకౌశిక నదిని దాటించి యువకులు భుజాలపై మోసుకుని జగ్గన్నతోటకు తీసుకొస్తారు. ఈ సన్నివేశాన్ని చూసేందుకు జనం తరలివస్తారు. మిగతా వాటిని రోడ్డు మార్గంలో తీసుకొస్తారు. ఈ ఉత్సవం బందోబస్తులో 300కు పైగా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసారు. ఈ ఉత్సవం కోనసీమ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. ఈ సంప్రదాయ



ఉత్సవంలో ఏకాదశ రుద్రుల ప్రభలు 11 గ్రామాల నుంచి ఊరేగింపుగా జగ్గన్నతోటకు తరలిరానున్నాయి. వ్యాఘ్రేశ్వరం, కె.పెదపూడి, ఇరుసుమండ, వక్కలంక వంటి గ్రామాల నుంచి కూడా ప్రభలు ఊరేగింపుగా వచ్చాయి. లక్షలాది మంది భక్తులు, పర్యాటకులు తరలి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం, స్థానిక అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జగ్గన్నతోటకు వచ్చే వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. వాహనాల దారి మళ్లింపు చేపట్టారు. భక్తులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పించారు. అలాగే ప్రభల ఉత్సవంలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా భారీ భద్రతను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ముందుస్తు జాగ్రత్త చర్యలో భాగంగా వైద్య సిబ్బందిని కూడా ఉంచారు. ప్రభుత్వం ఇచ్చిన రాష్ట్ర పండుగ హోదాతో జగ్గన్నపేట ప్రభల ఉత్సవం ఇకపై ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందే అవకాశం ఉందని స్థానిక ప్రజలు భావిస్తున్నారు.

# వైబవంగా కొత్తకొండ వీరభద్రస్వామి ఉత్సవాలు

- భారీగా తరలివచ్చిన భక్తజనం
- బండ్లు కట్టి స్వామిని దర్శించుకున్న ప్రజలు
- పలువురు మంత్రులు రాక..భారీ బందోబస్తు ఏర్పాటు

**హన్మకొండ, జనవరి16( వెలుతురు):**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గురు, శుక్రవారాల్లో లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కోనేరులో పవిత్ర స్నానాలు ఆచరించారు. కోరిన కోరికలు తీర్చాలని స్వామివారికి కోర మీసాలు సమర్పించుకున్నారు. తమ గండాలు తొలగిపోవాలని గండా దీపంలో నూనె పోశారు. వీరభద్రుని సన్నిధిలో కోడె ప్రదక్షిణ చేశారు. గుమ్మడికాయ మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూ కట్టారు. భక్తులు అధికం కావడంతో శీఘ్ర దర్శనం, విఐపి క్యూలైన్లు సైతం కిక్కిరిసిపోయాయి. జాతరలోని దుకాణాలు, రంగులరాట్నం, సర్కస్ తదితర షాపులన్నీ రద్దీగా మారాయి. జాతరలో భక్తుల సౌకర్యార్థం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు వాటిల్లకుండా ఆలయ చైర్మన్ అశోక్ ముఖర్జీ, ఈవో కిషన్ రావు పూర్తి సదుపాయాలు కల్పించారు. మకర సంక్రాంతి పర్వదినం గురువారం అర్ధరాత్రి ఆనవాయితీ ప్రకారం వరంగల్ జిల్లా వేలేరు కు చెందిన యాదవులు డబ్బు చప్పుళ్ళు, శివసత్తులు నృత్యాల మధ్య మేకల బండితో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఎడ్లబండ్లతో వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి గుట్టపైన కొలువుదీరిన వీరభద్ర స్వామి ఆత్మలింగం ఆలయంలో దివ్యాలంకరణ పూజలు జరిగాయి. గుట్టపైకి వెళ్ళిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



గుట్టపైకి వెళ్లి ప్రకృతి రమణీయతను వీక్షించేందుకు యువత పోటీపడ్డారు. మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు స్వగ్రామం వంగర లోని అతని ఇంటి నుంచి కొత్త కొండకు ఎడ్ల బండి రథం మకర సంక్రాంతి రోజున వెళ్లడం అనవాయతీగా వస్తుంది. ఈ ఏడాది సైతం ఎడ్ల బండి రథాన్ని అందంగా అలంకరించారు. శివ సత్తుల నృత్యాలు, మహిళల కోలాటాల నడుమ ఎడ్ల బండి రథాన్ని కొత్తకొండకు గ్రామస్తులు అంగరంగ వైభవంగా సాగనంపారు. బండెనుక బండి కట్టి పదహారు బండ్లు కట్టి అనే చందంగా కొత్తపల్లి నుంచి కొత్తకొండకు వెళ్లిన ఎడ్లబండ్లు రథాలను తలపించాయి. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది సైతం సుమారు 72 వరకు ఎడ్లబండ్లను బంతిపూలతో వివిధ రంగులతో అందంగా అలంకరించి రథాలుగాతీర్చిదిద్దారు. కొత్తకొండ వరకు సాగిన ఎడ్ల బండి రథాలను తిలకించేందుకు ప్రజలు దారి వెంట బారులు తీరారు. హిందూ, ముస్లిం అనే భేదం లేకుండా ఎడ్ల బండ్లతో వచ్చి ఆలయ ప్రదక్షిణలు చేసి మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మకర సంక్రాంతి పర్వదినాన దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారిని పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం చేయగా, ఆలయ చైర్మన్ అశోక్ ముఖర్జీ, ఈవో కిషన్ రావు వారికి శేష వస్త్రాలు సమర్పించి స్వామి వారి మెమొంటోను ప్రధానం చేశారు. అంతకుముందు త్రిశూల చౌరస్తాను ప్రారంభించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కొత్తకొండ ఆలయ అభివృద్ధిలో భాగంగా మాడ వీధులు, ఇతరత్ర అభివృద్ధి పనులకోసం రూ. 70 కోట్లు నిధులు మంజూరు చేసిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. భక్తులకు అందుబాటులో వైద్య సిబ్బంది ఉండి మందులు పంపిణీ చేశారు. అత్యవసర పరిస్థితి దృష్ట్యా అంబులెన్స్ ను అందుబాటులో ఉంచారు. దీంతోపాటు జాతరలో అగ్నిమాపక సిబ్బంది సైతం అందుబాటులో ఉన్నారు. జాతర లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. జూదం, మట్కా గుట్కా నాటుసారా లేకుండా పూర్తిస్థాయిలో పోలీసులు నియంత్రించారు. కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి తో పాటు మరో ఇద్దరు ఏసీపీలు పదిమంది సీఐలు, 25 మంది ఎస్సైలు, 350 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొని సేవలందించారు.

# వెలవెలబోయిన రోడ్డు

**హైదరాబాద్ జనవరి16( వెలుతురు):**

సంక్రాంతి పండుగ వస్తే చాలు హైదరాబాద్ లోని కూకట్ పల్లి, కేపి.హెచ్.బి, జేఎన్టీయూ పరిసర ప్రాంతాలు ప్రధాన రహదారులు నిర్మానుషంగా కనిపించాయి. ఇక్కడ నివసించే వారందరూ పండుగ నేపథ్యంలో సొంత గ్రామాలకు వెళ్లడంతో రద్దీ ఉండాల్సిన రోడ్లన్నీ వెలవెలబోయాయి. సామాన్య సమయంలో ఈ ప్రాంతాలకు వెళ్లాలంటే ట్రాఫిక్ రద్దీతో గంటల తరబడి ఆగుతూ వెళ్తూ ఉండాలి. వారం రోజులపాటు పాఠశాలలకు సెలవులు ఉండడం పండుగతో పాటు వీకెండ్ కలిసి రావడంతో కాంక్రీట్ జంగల్ ను వీడి పల్లెకు చేరుకున్నారు ప్రజలు. ఇలానే ప్రతిరోజు ఉంటే బాగుంటుంది అని పలువురు భావిస్తున్నారు

# మాయివోస్టుల డంపు స్వాధీనం

**దంతేవాడ జనవరి16( వెలుతురు):**

ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం దంతేవాడ జిల్లా లోని బర్సూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుర్సిగ్బహార్ గ్రామ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల పేలుడు పదార్థాల డంప్ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సర్చ్ ఆపరేషన్ లో సిఆర్పిఎఫ్, క్యూఏటీ, బీడీఎస్ బలగాలు పాల్గొన్నాయి. 10 కిలోల బరువున్న 3 పైప్ బాంబులు, 5 కిలోల బరువున్న 1 ప్రెషర్ కుక్కర్ ఐఇడి స్వాధీనంచేసుకున్నారు. బీడీఎస్ బృందం అక్కడికక్కడే అన్ని పేలుడు పదార్థాలను సురక్షితంగా నిర్వీర్యం చేసింది.

# భిజెపి అధ్యక్ష ఎన్నికకకు రంగం సిద్ధం

- 19న నామినేషన్..20 ఎన్నికల ప్రక్రియ



**న్యూఢిల్లీ, జనవరి16( వెలుతురు):**

భారతీయ జనతా పార్టీకి మరికొన్ని రోజుల్లో కొత్త సారథి రానున్నారు. పార్టీ నూతన అధ్యక్షుడి కోసం ఎన్నిక తేదీని భాజపా శుక్రవారం ప్రకటించింది. ఈ పదవికి జనవరి 19న నామినేషన్లు దాఖలు కానున్నట్లు తెలిపింది. ఆ మరుసటి రోజు జనవరి 20న కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటించనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు భాజపా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.లక్ష్మణ్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. 19వ తేదీ మధ్యాహ్నం 2-4 గంటల మధ్య అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పించవచ్చని లక్ష్మణ్ తెలిపారు. ఆ తర్వాత నామినేషన్ల పరిశీలన చేపడతామన్నారు. అదేరోజు సాయంత్రం 5-6 గంటల మధ్య నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నిక అవసరమైతే జనవరి 20న పోలింగ్ నిర్వహించి విజేతను ప్రకటిస్తామన్నారు. ఈ పక్రియంతా భాజపా ప్రధాన కార్యాలయంలో జరగనుంది. కాగా.. ఇటీవల కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన 45 ఏళ్ల నితిన్ నబీన్ నే పార్టీ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. యువనాయకత్వాన్ని తయారుచేసుకోవడడంలో భాగంగా నబీన్‌కు పార్టీ సారథ్య పగ్గాలు అప్పగించే అవకాశాలు కన్పిస్తున్నాయి. బిహార్‌కు చెందిన నితిన్ నబీన్ సిన్హాను భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమిస్తూ గతేడాది డిసెంబరులో పార్టీ అనూహ్య ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. కాయస్థ సామాజికవర్గానికి చెందిన నబీన్ సిన్హాకు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. గతేడాది జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపుర్ నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బిహార్ నుంచి పార్టీలో ఆ స్థాయికి చేరిన తొలినేతగా నబీన్ గుర్తింపు సాధించారు.

# 10 మినిట్స్ డెలివరీలు రద్దు




**ముంబై, జనవరి16( వెలుతురు):**

ఆన్‌లైన్ సర్వీస్‌లకు డిమాండ్ పెరుగుతోంది. ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మంది ఈకామర్స్ సంస్థలపైనే చాలా వరకు ఆధారపడుతున్నారు. దీంతో ఈకామర్స్ సంస్థలు కూడా కస్టమర్లకు మెరుగైన సేవలు అందిచేందుకు ఫోటీపడుతున్నాయి. ఈ క్రమంలో జెప్టో, బ్లింకిట్ వంటి సంస్థలు పది నిమిషాల్లో డెలివరీ సర్వీస్‌లు అందుబాటులోకి తెచ్చాయి. అయితే ఈ విధానంతో ఆయా సంస్థలో పనిచేసే గిగ్ వర్కర్లు ఇబ్బంది పడుతున్నారు. గిగ్ వర్కర్ల నిరసనల నేపథ్యంలో కేంద్రం క్విక్ కామర్స్ సంస్థలపై కొత్త ఆంక్షలు విధించింది. కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ 10 నిమిషాల డెలివరీలను రద్దు చేయాలని ఆదేశించారు. బ్లింకిట్ వంటి ప్లాట్‌ఫామ్‌లు యాడ్‌లలో ఈ టైమ్‌లైన్ చూపకూడదని స్పష్టం చేశారు.కొత్త సంవత్సరానికి ముందు డెలివరీ బాయ్స్‌లు తీవ్రంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. అధిక వేగ లక్ష్యాలు ప్రమాదాలు, ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయని డిమాండ్ చేశారు. ఈ ఒత్తిడి కేంద్ర జోక్యం చేసుకుంది. 10 నిమిషాల మోడల్ రద్దు సంస్థల వ్యాపార వ్యూహాలను మార్చనుంది. డెలివరీ సమయాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. కానీ వర్కర్ల భద్రత మెరుగుపడుతుంది.ఈ మార్పు ఇ?కామర్స్ రంగాన్ని ప్రభావితం చేస్తుంది. గ్రాహకులు సౌలభ్యం కోల్పోవచ్చు, సంస్థలు కొత్త మార్గాలు ఆవిష్కరించాలి. గిగ్ ఎకానమిలో కార్మిక హక్కులు బలపడుతాయి.డెలివరీ వేగాలకు భద్రతా మార్గదర్శకాలు రూపొందించాలి. వర్కర్లకు బీమా, శిక్షణ కార్యక్రమాలు అమలు చేయాలి. సంస్థలు బాధ్యతాయుత వ్యాపార మోడల్‌లకు మారాలి.మొత్తంగా గిగ్ వర్కర్లకు తాజా నిర్ణయం ఊరట దక్కింది. క్విక్ కామర్స్ సమస్థలు కూడా ఈమేరకు ప్రకటన చేశాయి. పది నిమిషాల డెలివరీని ఉప సంహరించుకుంటున్నట్లు ప్రకటించాయి.

# పడిపోతున్న ఇరాన్ కరెన్సీ..

**న్యూఢిల్లీ, జనవరి16( వెలుతురు):**

రాన్ ఆర్థిక వ్యవస్థ చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోంది. ఆర్థిక




సంక్షోభం రోజురోజుకూ తీవ్రమవుతోంది. దేశ కరెన్సీ రియాల్ విలువ పతనం ఆగడం లేదు. దీంతో ప్రజలు పెరిగిన నిత్యావసర ధరతో ఆందోళనలు ఉధృతం చేస్తున్నారు. ప్రస్తుతం ఒక డాలర్ విలువ ఇరాన్‌లో 14 లక్షల రియాల్‌కు చేరింది. దీంతో సామాన్యులు రోజువారీ అవసరాలు కూడా తీర్చుకోలేని పరిస్థితి నెలకొంది. భారత రూపాయితో పోల్చితే, కేవలం రూ.90తో 14 లక్షల రియాల్స్ పొందవచ్చు. గత డిసెంబర్‌లో సెంట్రల్ బ్యాంక్ అధ్యక్షుడు మొహమ్మద్ రెజా ఫార్జిన్ రాజీనామా చేశారు.గత జూన్‌లో ఇజ్రాయిల్‌తో ప్రారంభమైన యుద్ధం ఇరాన్ పతనాన్ని వేగవంతం చేసింది. అమెరికా యూక్లియర్ సైట్లపై దాడులు, ఐకేయరాష్ట్ర సమితి ఆంక్షలు ఆర్థికాన్ని కుంగదీశాయి. 2018లో ట్రంప్ పాలిసీతో జిల్లెడిన ఆయిల్ ఎగుమతులు, విదేశీ ముద్ర లభ్యత తగ్గడం సమస్యలను మరింత తీవ్రతరం చేశాయి.1979 విప్లవ సమయంలో డాలర్ విలువ 70 రియాల్స్‌కు సమానంగా ఉండేది. 2026 ప్రారంభంలో 14 లక్షలకు చేరింది. 40 ఏళ్లలో విలువ 20,000 రెట్లు పడిపోయింది. 2025లో మాత్రమే 45 శాతం క్షీణత. బంక్ డబ్బులు కరిగిపోతాయని భయపడి పౌరులు డాలర్లు, బంగారు కొనుగోళ్లకు దూకుతున్నారు.డిసెంబర్‌లో తెహ్రాన్ గ్రాండ్ బజార్ వ్యాపారులు ధరల పెరుగుదలతో ఇబ్బంది పడ్డారు. రియాల్ పతనంతో రుణాలు పెరిగి, విద్యార్థులు, కార్మికులు ఆందోళన చెందుతున్నారు. జొమ్హౌరి అవెన్యూలో ప్రారంభమైన ఇది ఇప్పుడు అయతోల్లా అలీ ఖమేనీ నేతృత్వంలోని ఇస్లామిక్ రిపబ్లిక్‌పై పోరుగా మారింది. 2022లో మహ్సా అమినీ మరణం తర్వాతి అల్లర్లు ఇప్పటి అగ్నిపర్వతాన్ని పెంచాయి.ఇరాన్ సంక్షోభం భారత్‌పైనా ప్రభావం పడే అవకావం ఉంది. మన దేశం గతేడాది 1.24 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను ఎగుమతి చేసింది. 0.44 బిలియన్ డాలర్ల ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది. ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం విలువ 1.68 బిలియన్ డాలర్లు. భారత కరెన్సీలో రూ.15 వేల కోట్లకుపైనే. ఆర్థిక సంక్షోభం కారణంగా ఎగుతులు నిలిచిపోయే ప్రమాదం ఉంది.

https://epaper.velthuru.com

వెలుతురు

cinema


# పూరి-సేతుపతి మూవీ టైటిల్ స్లమ్ డాగ్




విజయ్ సేతుపతి -పూరి జగన్నాథ్ కాంబోలో రానున్న సినిమా టైటిల్ ఖరారయ్యింది. ఇప్పటివరకూ 'పూరి సేతుపతి'గా ప్రచారంలో ఉన్న ఈ సినిమా టైటిల్‌ను తాజాగా ప్రకటించారు. ఈ చిత్రానికి 'స్లమ్ డాగ్' అనే పేరు ఖరారు చేశారు. '33 టెంపుల్ రోడ్' అనేది ఉపశీర్షిక. టైటిల్ పోస్టర్‌లో విజయ్ సేతుపతి ఆసక్తికర లుక్‌లో కనిపించారు. చేతిలో కత్తి పట్టుకొని కళ్లజోడుతో పవర్‌ఫుల్‌గా ఉన్నారు. ఈ పోస్టర్‌ను పంచుకున్న టీమ్ ఆసక్తికర క్యాప్షన్‌ను షేర్ చేసింది. 'మురికివాడల నుంచి ఎవరూ తట్టుకోలేని తుపాను వస్తుంది.. అది చాలా భయంకరంగా ఉంటుంది' అనే క్యాప్షన్ ఇందులో విజయ్ పాత్ర తీరును తెలిపేలా ఉంది. ఎన్నో రోజులుగా ఈ సినిమాకు రకరకాల టైటిల్స్ వినిపించాయి. ఇప్పుడు వాటికి చెక్ పెడుతూ 'స్లమ్ డాగ్'ను అధికారికంగా ప్రకటించారు. గతేడాది జులై మొదటివారంలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభించి ఐదు నెలల్లోనే కంప్లీట్ చేసేశారు. పాన్ ఇండియా స్థాయిలో ఇది విడుదల కానుంది. సంయుక్త కథానాయికగా నటించారు. టబు (÷ుజీశిబీ), విజయ్‌కుమార్ కీలక పాత్రలు పోషించారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా ఓ వినూత్న కథాంశంతో ఈ చిత్రం ముస్తాబైంది. విజయ్ సేతుపతి ఇందులో మునుపెన్నడూ చేయని విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు.

## 70 ఏళ్ల వయసులో ఇంత ఎనర్జీ ఎక్కడిది ప్రసాదం

### ఓ అభిమాని చిలిపి ..కొంటె ప్రశ్నలతో లేఖ





మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో తెరకెక్కిన తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు' సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని అందుకుంది. ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు మెగా అభిమానులను కూడా ఈ సినిమా విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా చాలా కాలం తర్వాత చిరంజీవి క్లాసిక్ స్టైల్, వింటేజ్ ఛార్మ్‌తో కనిపించడం అభిమానులకు పెద్ద పండుగగా మారింది. ఈ సినిమా విజయోత్సాహం మధ్య ఒక అభిమాని చేసిన ఎమోషనల్ ఎక్స్‌ప్రెషన్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. మెగాస్టార్ సినిమాలతో తన బాల్యం, యవనాన్ని గుర్తు చేసుకుంటూ ఓ వీరాభిమాని చిరంజీవికి ఓ లేఖ రాశాడు. ఆ లేఖలో చిరంజీవి సినిమాలు తన జీవితానికి ఇచ్చిన ప్రేరణ, కుటుంబంతో కలిసి థియేటర్లలో చూసిన అనుభవాలు, అభిమానిగా ఎదిగిన ప్రయాణాన్ని భావోద్వేగంగా వివరించాడు.

ఓయ్ ప్రసాదు? ఇదుగో నిన్నే..

'నిన్నేనయ్యా ప్రసాదూ. అసలు నువ్వేం చేస్తున్నావో నీకైనా అర్థమవుతుందా? ఏడు పదుల వయసులో జనాలు ఎంఆర్ఐ స్కాన్లు, ఎక్స్ రేలు, రక్త పరీక్షలు, డయాలసిస్ అంటూ డాక్టర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న కాలంలో హుక్కు స్టెప్పు హుక్కు స్టెప్పు అంటూ డ్యాన్సులు వేసి ఎవరిని రెచ్చగొడదామని నీ ప్లాన్. అసలు నాకొకటి అర్థం కాక అడుగుతాను. చిన్నప్పుడు యముడికి మొగుడు పాటను బ్లాక్ అండ్ వైట్ టీవీలో గుడ్లప్పగించి చూస్తుంటే మా నాన్న భుజం మీద చరిచి చెప్పేవాడు ఒంట్లో స్ప్రింగులు ఉన్నోడే చిరంజీవి అని'. అప్పుడర్థమయ్యేది కాదు. చెడ్డీలకు బటన్లు ఊడిపోతే పిన్లు పెట్టుకుని స్కూలుకు పరిగెత్తే మధ్య తరగతి జీవితాల్లో బ్లాక్ టికెట్లు కొనే వైరస్ తెచ్చింది నీ గ్యాంగ్ లీడర్, ఘరానా మొగుడు సినిమాలే. క్లాసులో బెంచీల మీద నీ డైలాగులు అప్పజెబుతూ టీచర్ కు దొరికిపోతే వీపు మీద కర్ర దెబ్బలు ఎందుకు నొప్పనిపించలేదో తెలుసా? బోలో బోలో బోలో రాణి క్యా చాహీయే అంటూ నువ్వు ఖాకీ కోటుని ఎగరేసి, తిరగేసి డాన్సు చేయడం గుర్తుకు వస్తే మాస్టారి బెత్తం దెబ్బ ఒక లెక్కా' 'సరే చిన్నప్పటి ముచ్చట్లు ఇప్పుడెందుకులే ప్రసాదు విషయానికి వద్దాం. ముందు ఒక మాట చెప్తా గుర్తు పెట్టుకో. నీ మనవళ్లు మనవరాళ్లతో ఆడుకుంటున్న వీడియోలు ఆడియోలు మాకు చూపెట్టకు. వాళ్ళు నిన్ను తాత అంటే ఒప్పుకునే పరిస్థితిలో మేం లేం. ఎందుకంటే నువ్వు మాకెప్పటికీ కాళీవి, ఆటో జానీవి, రాజువి, ఇప్పుడీ ప్రసాదువి. అంతే నో డిబేట్. శశిరేఖతో ప్రేమలో పడే సీన్లలో నీలో ఆ పెళ్లి కాని కళని మొహంలోకి ఎలా తీసుకొచ్చావో ఎంత రాకెట్ సైన్స్ చదివినవాడైనా చెప్పలేడు. నా పందెం పది వేలు. అమాయకత్వం, తింగరితనం కలగలసి నీ టైమింగ్ లో ప్రేక్షకులు మునకలు వేస్తుంటే ఒక ఇంటెలిజెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ ఇంత సిల్లీగా ఉంటాడానే లాజిక్ మాకెందుకు గుర్తుకు వస్తుంది చెప్పు. గ్రేసుకే బాసులా ఒళ్ళు వయ్యారంగా తిప్పుతూ పక్కన నయనతార ఉన్న సంగతే మర్చిపోయేలా చేస్తే ఇద్దరి మధ్యా వయసు వ్యత్యాసాన్ని ఎలా గుర్తిస్తాం. అంత చిన్న పిల్లలు ఈ పెద్దాయన ప్రసాద్ కొడుకు కూతురాని నా కొడుక్కు అనిపించలేదంటే దాన్ని స్క్రీన్ ప్రెజెన్స్ అనాలా లేక మాస్ భాషలో దొంగ సచ్చినోడు అనాలా నాకైతే అర్థం కాలేదు' అంటూ లేఖను కొనసాగించాడు.

## ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ మూవీలో అనిల్ కపూర్




యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా, పాన్ ఇండియా దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'డ్రాగన్' ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు పెంచుకుంటోంది. 'కేజీఎఫ్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ల తర్వాత ప్రశాంత్ నీల్ నుంచి వస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమాలో బాలీవుడ్ సీనియర్ స్టార్ అనిల్ కపూర్ భాగమవుతున్నారనే వార్తలు మరింత హీట్ పెంచుతున్నాయి. ఇప్పటికే 'యానిమల్' సినిమాలో రణబీర్ కపూర్ తండ్రిగా అనిల్ కపూర్ చేసిన పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు దక్కాయి. వయసు పెరిగిన తర్వాత కూడా పవర్‌ఫుల్ క్యారెక్టర్లతో తన మార్క్ చూపిస్తున్న అనిల్, ఇప్పుడు 'డ్రాగన్'లో కూడా అంతే బలమైన పాత్రలో కనిపించబోతున్నారనే చర్చ నడుస్తోంది. ఐఎండీబీ మోస్ట్ యాంటిసిపేటెడ్ ఇండియన్ మూవీస్ జాబితాలో 'డ్రాగన్' చోటు దక్కిన విషయాన్ని పరోక్షంగా హైలైట్ చేస్తూ, ఈ ప్రాజెక్ట్‌పై తన ఆసక్తిని అనిల్ కపూర్ వ్యక్తం చేశారు. ప్రశాంత్ నీల్ సినిమాల్లో సీనియర్ నటుల పాత్రలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందన్న విషయం తెలిసిందే. 'కేజీఎఫ్'లో సంజయ్ దత్‌ను భీకరమైన విలన్‌గా చూపించి కొత్త కోణంలో ఆవిష్కరించారు. అలాగే 'సలార్'లో జగపతి బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ పాత్రలు కథకు బలమైన స్థంభాలుగా నిలిచాయి. అదే తరహాలో 'డ్రాగన్'లో అనిల్ కపూర్ పాత్ర కూడా కథను మలుపు తిప్పే స్థాయిలో ఉంటుందనే అంచనాలు పెరుగుతున్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్నారు. ఎన్టీఆర్‌కు జోడీగా రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రం, ప్రశాంత్ నీల్ స్టైల్ మాస్ యాక్షన్‌తో పాటు స్టాం÷-రగ్ ఎమోషనల్ క్యారెక్టర్ల మేళవింపుగా ఉండబోతుందని టాక్.





## కలసి వచ్చిన సంక్రాంతి సెంటిమెంట్

### అనిల్ రావిపూడి, శర్వానంద్‌లకు పండగే పండగ

సంక్రాంతికి హిట్ కొట్టడం వేరు....అలాంటిది ఆ పండగకు వచ్చిన ప్రతిసారి విజయం అందుకున్నారు హీరో శర్వానంద్, డైరెక్టర్ అనిల్ రావిపూడి. పొంగల్ రిలీజ్.. అనిల్‌కు సెంటిమెంట్‌గా మారింది. వీలుంటే ప్రతి ఏడాదీ పండగకు వస్తాననంటుంటారు. సంక్రాంతికి వచ్చిన సినిమాలే కాదు అనిల్ తెరకెక్కించిన ఇతర సినిమాలన్నీ హిట్ అయిన సంగతి తెలిసిందే. సంక్రాంతికి తమ సినిమాలను రిలీజ్ చేయాలని ఎంతోమంది మేకర్స్ ప్లాన్ చేసుకుంటూ ఉంటారు. కానీ, అది కొన్నిసార్లు వర్కౌట్ కాదు. దీంతో, కొన్ని సినిమాలు అకస్మాత్తుగా విడుదలవుతుంటాయి. సాధారణ రోజుల్లో పెద్ద హీరోల సినిమాలు రిలీజ్ అవుతున్నాయంటే.. చిన్న చిత్రాల మేకర్స్ వాటిని విడుదల చేసేందుకు సాహసించరు. పెద్ద పండగకు తప్పని సరిగా ప్రేక్షకులు ఆశీర్వదిస్తారన్న నమ్మకంతో రిలీజ్ చేస్తుంటారు. అలా ఈ ఏడాది విడుదలైన ప్రభాస్ 'ది రాజాసాబ్', చిరంజీవి సినిమా, రవితేజ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో పాటు శర్వా మూవీ, నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు' సందడి చేస్తున్నాయి.సంక్రాంతి సందర్భంగా 'ఎక్స్‌ప్రెస్ రాజా'తో 2016లో శర్వా తొలి విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు. ప్రేమించిన అమ్మాయి పెంచుకున్న కుక్క కనిపించకపోవడంతో.. దాన్ని వెతికి పట్టుకునే క్రమంలో హీరోకి ఎలాంటి సంఘటనలు ఎదురయ్యాయి? అన్న పాయింట్‌తో మేర్లపాక గాంధీ తెరకెక్కించిన రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్ ఇది. మరుసటి ఏడాది సంక్రాంతికి 'శతమానం భవతి'తో అంతకుమించిన సక్సెస్ చూశారు శర్వానంద్. కుటుంబ విలువలు గుర్తుచేసేలా సతీశ్ వేగేశ్న తెరకెక్కించిన ఫ్యామిలీ డ్రామా ఇది. ఈ ఏడాది 'నారీ నారీ నడుమ మురారి' గా నవ్వులు పంచారు. ఇద్దరమ్మాయిల మధ్య నలిగిపోయే యువకుడి కథాంశంతో రామ్ అబ్బరాజు తెరకెక్కించిన ఈ సినిమా థియేటర్లలో నవ్వులు పూయిస్తోంది. ఈ మూడు సినిమాలు జనవరి 14న విడుదల కావడం విశేషం. ప్రేక్షకులను నవ్వించడమే లక్ష్యంగా సినిమాలు చేస్తూ వరుస విజయాలు అందుకుంటున్న దర్శకుడు అనిల్ రావిపూడి. వెంకటేశ్, వరుణ్‌తేజ్ కాంబినేషన్‌లో ఆయన తెరకెక్కించిన 'ఎఫ్ 2' 2019 జనవరి 12న రిలీజైంది. ఈ మూవీ రూ.100 కోట్లకుపైగా వసూలు చేసింది. 2020 జనవరి 11న విడుదలైన మహేశ్‌బాబు 'సరిలేరు నీకెవ్వరు' దాదాపు రూ.200 కోట్లు రాబట్టింది. 2025 జనవరి 14న విడుదలైన వెంకటేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం' ఏకంగా రూ.300 కోట్లు వసూలు చేసి, ఈ హీరో- దర్శకుడి కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఈ నెల 12న విడుదలైన చిరంజీవి 'మన శంకరవర ప్రసాద్‌గారు' సైతం జోరు ప్రదర్శిస్తోంది. మూడు రోజుల్లోనే రూ.152 కోట్లు కలెక్ట్ చేసింది.

## ఆగని దురంధరన్ దూకుడు

### 15న ఒక్కరోజే మూడుకోట్ల వసూళ్లు




రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన స్పై యాక్షన్ థ్రిల్లర్ ధురంధర్ బాక్సాఫీస్ వద్ద తన జోరు ఇంకా తగ్గించలేదు. విడుదలై ఆరు వారాలు పూర్తయినా, ఈ సినిమా కలెక్షన్ల పరంగా రోజుకో కొత్త రికార్డును నమోదు చేస్తూ ఇండియన్ సినీ పరిశ్రమలో అరుదైన ఘనతలు సాధిస్తోంది. ముఖ్యంగా విడుదలైన 42వ రోజున కూడా భారీ వసూళ్లు రాబట్టి సినీ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఇండియన్ సినిమాల చరిత్రలో 42వ రోజున అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ధురంధర్ నిలవడం విశేషం. జనవరి 15న మాత్రమే ఈ చిత్రం సుమారు రూ.3 కోట్ల నికర వసూళ్లు సాధించింది. ఇంతకు ముందు ఈ రికార్డు ఛావా (రూ.1.35 కోట్లు) పేరిట ఉండగా, దాన్ని భారీ తేడాతో ధురంధర్ బ్రేక్ చేసింది. ఈ సినిమా థియేటర్లలోకి వచ్చిన మొదటి రోజు నుంచే బలమైన పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. రూ.28 కోట్ల ఓపెనింగ్‌తో మొదలైన ఈ చిత్రం, తొలి మూడు రోజుల్లోనే వంద కోట్ల మార్క్‌ను దాటేసింది. మొదటి వారాంతం ముగిసే సరికి దాదాపు రూ.103 కోట్ల వసూళ్లు నమోదు చేసి ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తొలి వారం మొత్తం కలెక్షన్లు రూ.207 కోట్లకు పైగా ఉండటం ఈ సినిమాకు ఉన్న క్రేజ్‌ను స్పష్టంగా చూపించింది. రెండో వారం వచ్చాక కూడా గ్రాఫ్ పడిపోకుండా మరింత బలంగా నిలిచింది. ముఖ్యంగా వీకెండ్లలో ప్రేక్షకుల తాకిడి పెరగడంతో 9వ, 10వ రోజుల్లో రికార్డు స్థాయి వసూళ్లు నమోదయ్యాయి. రెండో వారం ముగిసే సరికి మరో రూ.250 కోట్లకు పైగా కలెక్షన్లు వచ్చాయి. ఆ తర్వాత మూడో, నాలుగో వారాల్లోనూ సినిమా స్థిరమైన రన్ కొనసాగిస్తూ వరుసగా రూ.172 కోట్లు, రూ.106 కోట్లకు పైగా వసూలు చేసింది. ఐదో వారం, ఆరవ వారాల్లో కొత్త సినిమాల పోటీ ఉన్నప్పటికీ ధురంధర్ తన స్క్రీన్లను నిలబెట్టుకుని మంచి వసూళ్లు రాబట్టింది. 39వ రోజు నుంచి 42వ రోజు వరకూ రోజుకు రూ.2 నుంచి 3 కోట్ల మధ్య కలెక్షన్లు రావడం ఈ సినిమాకు లభించిన అరుదైన ఘనతగా చెప్పుకోవచ్చు. ఇప్పటి వరకు దేశీయంగా ఈ చిత్రం దాదాపు రూ.817 కోట్ల నికర వసూళ్లు నమోదు చేయగా, భారతదేశ గ్రాస్ కలెక్షన్లు రూ.976 కోట్లకు చేరుకున్నాయి. అదే సమయంలో ఓవర్సీస్ మార్కెట్లలో కూడా రూ.293 కోట్ల వరకు వసూలు చేసి, మొత్తం ప్రపంచవ్యాప్తంగా రూ.1,270 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు సాధించింది. మొత్తంగా చూస్తే, ధురంధర్ కేవలం ఒక హిట్‌గా మాత్రమే కాకుండా, దీర్ఘకాలం బాక్సాఫీస్‌పై ఆధిపత్యం చూపిన అరుదైన ఇండియన్ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఇంకా థియేటర్లలో కొనసాగుతున్న ఈ సినిమా రన్ చివరికి ఎక్కడ ఆగుతుందో చూడాల్సిందే.

# సంక్రాంతి సెలవుల ముగింపు

**- తిరుగు ప్రయాణాలకు సన్నాహాలు**
**- ట్రాఫిక్ జామ్ లేకుండా వాహనాల మళ్లింపు**



**నల్లగొండ,జనవరి16( వెలుతురు):**
సంక్రాంతి సంబురాల ముగింపుతో పల్లెలకు వెళ్లిన వారు ఇళ్లకు చేరే సమయం ఆసన్నమైంది. శని, ఆదివారాల్లో నగరాలకు బయలుదేరనున్నారు. ఈ క్రమంలో రోడ్లు జామ్ కాకుండా, ట్రాఫిక్ చిక్కులు ఏర్పడకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు మళ్లీ పట్నం బాట పట్టనున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ – విజయవాడ హైవేపై రద్దీని తగ్గించేందుకు నల్గొండ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు.హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై చిట్యాల, పెద్ద కాపర్తి వద్ద ÷÷–లఓల్ల÷వర్ నిర్మాణ పనులు జరుగుతుండటతంతో ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశం ఉన్నందున దారి మళ్లింపు చర్యలు చేపట్టినట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ప్రయాణికులు, వాహనదారులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని పోలీసులకు సహకరించాలని కోరారు.దారి మళ్లింపు వివరాలు ఇలావున్నాయి. గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలను గుంటూరు, మిర్యాలగూడ, హాలియా, కొండమల్లేపల్లి,చింతపల్లి,మాల్ మీదుగా హైదరాబాద్‌కు మళ్లిస్తున్నారు. మాచర్ల నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలలను మాచర్ల,నాగార్జునసాగర్, పెద్దవూర,కొండపల్లేపల్లి, చింతపల్లి–మాల్ మీదుగా హైదరాబాద్ మళ్లిస్తారు. నల్లగొండ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను నల్లగొండ,మార్రిగూడ బై పాస్ –మునుగోడు , నారాయణపూర్– చౌటుప్పల్ (ఎన్.హెచ్ 65)మీదుగా హైదరాబాద్ తరలిస్తారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలను కోదాడ–హుజూర్‌నగర్–మిర్యాలగూడ–హాలియా–చింతపల్లి– మాల్ మీదుగా హైదరాబాద్ మళ్లించారు. ఎన్. హెచ్ 65 విజయవాడ –హైదరాబాద్ రహదారి పై చిట్యాల, పెద్దకాపర్తిలో ఫ్లై ఓవర్ నిర్మాణాలు జరుగుతున్నందున ట్రాఫిక్ జామ్ అయిన పక్షంలో చిట్యాల నుంచి భువనగిరి గుండా హైద్రాబాద్ మళ్లించడం జరుగుతుంది.ఈ మార్గాల ద్వారా వెళ్లడం వల్ల ప్రధాన రహదారి విజయవాడ, హైద్రాబాద్ పై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గి, ప్రయాణికులు గమ్యస్థానాలకు త్వరగా చేరుకోవచ్చని పోలీసులు తెలిపారు.

# సీఎం రేవంత్ ఆదిలాబాద్ జిల్లా పర్యటన

**- ముందస్తుగా మాజీమంత్రి జోగు రామన్న అరెస్ట్**



**ఆదిలాబాద్,జనవరి16( వెలుతురు):**
ఆదిలాబాద్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్నను హౌస్ అరెస్టు చేశారు. జోగు రామన్నతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను హౌస్ అరెస్టు చేశారు. ఇలా బీఆర్ఎస్ నేతల అరెస్టుతో జిల్లాలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ.. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చనాకా కొరాటా ప్రాజెక్టు ట్రయల్ రన్‌కు రావడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లా రైతాంగానికి 50 వేల ఎకరాలకు నీరు అందించాలన్న సంకల్పంతో బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ పూర్తిస్థాయిలో ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టి రైతులకు సంకల్పంతో కృషి చేశారని తెలిపారు. కానీ బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఒక్క ఎకరాకు కూడా అందించకుండా ట్రయల్ రన్ చేయడం, దాన్ని ప్రారంభించడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. సీఎం పర్యటన నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి నుంచే పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికం అని జోగురామన్న మండిపడ్డారు. భేలా, జైనత్, ఆదిలాబాద్ మండల నాయకులను ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం సమంజసం కాదని సూచించారు. ఒక్క ఎకరానికి కూడా నీరు అందించలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను రైతులు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. రైతు సమస్యలు పరిష్కరించడంపై ధ్యాసలేని ఈ ముఖ్యమంత్రి కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ట్రయల్ రన్ అంటూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

# నోట్ల కట్టల కేసులో జస్టిస్ యశ్వంత్‌వర్మకు చుక్కెదురు

**- దర్యాప్తు చట్టబద్ధతపై సవాల్‌ను తిరస్కరించిన సుప్రీం**

**న్యూఢిల్లీ,జనవరి16( వెలుతురు):**
నోట్ల కట్టల కేసులో న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. తనను తొలగించాలని కోరుతూ వచ్చిన తీర్మానాన్ని లోక్‌సభ స్పీకర్ ఆమోదించడంతోపాటు తనపై దర్యాప్తు కోసం ఏర్పాటుచేసిన పార్లమెంటరీ ప్యానల్ చట్టబద్ధతను సవాల్ చేస్తూ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసుకు సంబంధించిన తీర్పును జనవరి 8న రిజర్వ్ చేసిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎస్‌సీ శర్మలతో కూడిన ధర్మాసనం నేడు వెలువరించింది. గతేడాది జస్టిస్ యశ్వంత్‌వర్మ దిల్లీ హైకోర్టులో సేవలందిస్తున్నప్పుడు తన అధికారిక నివాసంలో పెద్దఎత్తున నోట్లకట్టలు లభ్యమయ్యాయి. దానిపై అంతర్గత త్రిసభ్య సంఘం విచారణ జరిపింది. అది ఇచ్చిన నివేదిక నేపథ్యంలో పదవి నుంచి వైదొలగాల్సిందిగా సుప్రీంకోర్టు సూచించింది. ఆయన దానికి అంగీకరించకపోవడంతో పార్లమెంటులో అభిశంసనకు ప్రయత్నాలు జరిగాయి. ఈ క్రమంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లిన జస్టిస్ వర్మకు అక్కడ మళ్లీ చుక్కెదురైంది.

# కారు అద్దాలు పగలగొట్టి దూసుకొచ్చిన జంతువు

**- తల్లి ఒడిలో నిద్రిస్తున్న నాలుగేళ్ల చిన్నారి మృతి**

**భోపాల్,జనవరి16( వెలుతురు):**
మధ్యప్రదేశ్‌లోని గుణ జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఓ కుటుంబం కారులో వెళ్తుండగా.. అడవి జంతువు ఉన్నట్టుండి కారులోకి దూసుకురావడంతో ముందు సీట్లో తల్లి ఒడిలో కూర్చున్న నాలుగేళ్ల చిన్నారి మృతి చెందింది. బుధవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుణ ప్రాంతానికి చెందిన సోను జాట్ అనే వ్యక్తి సంక్రాంతి పండగను జరుపుకోవడానికి తన భార్య, నాలుగేళ్ల కుమార్తె తాన్యతో కలిసి బుధవారం వారి స్వగ్రామానికి బయల్దేరాడు. బైపాస్‌లోని దోఖంభా ప్రాంతంలో వారు కారులో వెళ్తుండగా.. రెండు నీల్‌గాయ్ జంతువులు అకస్మాత్తుగా రోడ్డు పైకి వచ్చాయి. సోను అప్రమత్తమయ్యేలోపు ఆ జంతువుల్లో ఒకటి కారు అద్దం పగలగొట్టుకుని లోపలికి దూసుకువచ్చింది. దీంతో ముందు సీటులో తల్లి ఒడిలో కూర్చున్న నాలుగేళ్ల తాన్య తలకు జంతువు కాళ్లు బలంగా తాకడంతో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. కారులో చిక్కుకున్న నీల్‌గాయ్‌ను బయటకు తీసి, చికిత్స అందిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు.

# ఎన్నిసార్లయినా విచారణకు పిలుస్తాం

**- పైలట్ల నోటీసులపై ఎఎఐబి అధికారుల స్పష్టీకరణ**




**న్యూఢిల్లీ,జనవరి16( వెలుతురు):**
అహ్మదాబాద్ విమాన ప్రమాదం కేసు లో పైలట్ మేనల్లుడికి 'విమాన ప్రమాదాల దర్యాప్తు బ్యూరో' సమన్లు జారీ చేయడాన్ని ఖండిస్తూ.. పైలట్ల సమాఖ్య ఏఏఐబీకి లీగల్ నోటీసులు ఇచ్చింది. ఈ వ్యవహారంపై ఏఏఐబీ అధికారులు స్పందించారు. విమాన ప్రమాదంపై దర్యాప్తు విషయంలో తాము చట్టప్రకారంగానే వ్యవహరించామన్నారు. ప్రమాదంపై క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్న సమయంలో వాస్తవాలను తెలుసుకోవడానికి అన్ని విషయాలపైనా దృష్టిపెట్టాల్సి ఉంటుందన్నారు. అందుకు ఎవరినైనా విచారించే అధికారం తమకు ఉందన్నారు. దర్యాప్తునకు ఉపయోగపడతారని అనిపిస్తే ఎవరినైనా, ఎన్నిసార్లు అయినా పిలుస్తామని వెల్లడించారు. ఇవి వేధింపుల కిందకు రావని స్పష్టం చేశారు. గత ఏడాది జూన్ 12న జరిగిన అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదంలో మృతి చెందిన వారిలో కెప్టెన్ సుమిత్ సభర్వాల్, కో–పైలట్ క్లైవ్ కుందర్‌లు కూడా ఉన్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సుమిత్ మేనల్లుడు కెప్టెన్ వరుణ్ ఆనంద్‌కు ఏఏఐబీ ఇటీవల సమన్లు జారీ చేసింది. జనవరి 15న విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. ఎయిరిండియాలో పైలట్‌గా పనిచేస్తున్న వరుణ్ ఆనంద్.. 'భారత పైలట్ల సమాఖ్య' లో సభ్యుడిగా ఉన్నారు. ఏఏఐబీ నోటీసులను పూర్తి అనవసరమైన చర్యగా ఎఫ్ఐపీ పేర్కొంది. ప్రమాదంతో ఎలాంటి సంబంధం లేని కెప్టెన్ వరుణ్ ఆనంద్‌ను పిలిపించడం అనవసరమని ఇది వేధింపులకు పాల్పడటం, మానసిక క్షోభకు గురిచేయడమే అవుతుందని పైలట్ల సమాఖ్య ఏఏఐబీకి పంపిన నోటీసులో పేర్కొంది.


# గాదె ఇన్నయ్యకు మాతృవియోగం



**జనగామ,జనవరి16( వెలుతురు):**
సామాజిక ఉద్యమకారుడు, మావోయిస్టు పార్టీ మాజీ నేత గాదె ఇన్నయ్య ఇంట్లో విషాదం నెలకొంది. ఇన్నయ్య తల్లి థెరిసమ్మ కన్నుమూశారు. అనారోగ్య సమస్యలు, వయోభారంతో ఇబ్బంది పడుతున్న ఆమె గురువారం రాత్రి జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం సాగరంలోని సొంతింట్లో తుదిశ్వాస విడిచారు. శనివారం నాడు ఆమె అంత్యక్రియలు జరగనున్నాయని సమాచారం.మావోయిస్టు పార్టీకి అనుకూలంగా మాట్లాడినందుకు మావోయిస్టు పార్టీ మాజీ నేత గాదె ఇన్నయ్యను నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) అధికారులు డిసెంబర్‌లో అరెస్ట్ చేశారు. ఇన్నయ్య జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం రేగడి తండా గ్రామ పంచాయతీ పరిధిలో 'మా ఇల్లు ప్రజాదరణ' ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఎన్ఐఏ అధికారులు .. ఆశ్రమానికి చేరుకుని మూడు గంటలపాటు విచారణ చేపట్టారు. అనంతరం ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఇన్నయ్య హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో ఉన్నారు.

# కన్యాకుమారిలో రోడ్డు ప్రమాదం

**- లక్సెట్టిపేటకు చెందిన దంపుతల దుర్మరణం**



**మంచిర్యాల,దజనవరి16( వెలుతురు):**
తమిళనాడులోని కన్యాకుమారి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన దంపతులు మరణించారు. అయ్యప్ప మాల ధరించిన వారు.. శబరిమలకు వెళ్లొస్తుండగా ఈ దారుణం జరిగింది.వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చెందిన పాలకుర్తి సత్యనారాయణ (63), రమాదేవి (59) జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నారు. ఇటీవల అయ్యప్ప మాల ధరించిన ఈ దంపతులు జనవరి 8వ తేదీన ఓ ప్రైవేటు సర్వీస్‌లో శబరిమల దర్శనానికి వెళ్లారు. జనవరి 15వ తేదీన మకర సంక్రాంతి రోజున అయ్యప్ప స్వామి దర్శనం చేసుకుని తిరిగి బయల్దేరారు. ఈ క్రమంలో కన్యాకుమారి సమీపంలో బైపాస్ రోడ్డులో బస్సును ఆపారు. అక్కడ సముద్ర స్నానం చేసుకుని దేవాలయాలు సందర్శించుకుని బస్సు దగ్గరకు వస్తుండగా వారికి ఓ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు.మృతదేహాలను కన్యాకుమారి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కన్యాకుమారి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# సీఎంఆర్ క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన మల్లారెడ్డి

**మేడ్చల్ జనవరి16( వెలుతురు):**
మేడ్చల్ లోని ఎల్లంపేట అలియాబాద్ మూడు చింతలపల్లి మూడు మున్సిపాలిటీల్లో మూడు రోజులు సీఎంఆర్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ను మాజీ మంత్రి,ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రారంభించారు. మూడు చింతలపల్లి మున్సిపల్ పరిధిలో క్రికెట్ పోటీ నిర్వహిస్తున్న గ్రౌండ్లో మాజీ మంత్రి మల్లారెడ్డి బౌలింగ్ చేయగా మల్లారెడ్డి చిన్న కొడుకు భద్రారెడ్డి బ్యాటింగ్ చేసి హల్చల్ చేశారు.ఎల్లంపేట మున్సిపల్ గ్రౌండ్లో మల్లారెడ్డి బ్యాటింగ్ చేస్తూ సందడి చేశారు.మూడు రోజులు యువత క్రికెట్ టోర్నమెంట్లో అడిన అనంతరం ఫైనల్ విజేతలను ఎంచుకొని బహుమతులు అందజేస్తామని తెలిపారు...




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com